
ఆంధ్రపత్రిక


సచిత్రవారపత్రిక



పంజాబ్ చంబాలోయ స్త్రీ.

3-12-47 ANDHRA PATRIKA ILLUSTRATED WEEKLY వెల 4 అణాలు


అఖిలభారత కాంగ్రెస్ మహాసభా, శాసనసభాదృశ్యాలు




అ. భా. కాంగ్రెస్ సభలో అధ్యక్షోపన్యాసమిస్తున్న ఆచార్య కృపాలనీ




సమావేశానికి వెళ్తున్న మహాత్మాగాంధి.




కాంగ్రెస్ సమావేశానికి వెళ్తున్న బి. జి. ఖేర్, డాక్టరు సైయద్ మామూద్, సత్యనారాయణ సింహాగార్లు.




అధినివేశ శాసనసభా ప్రారంభదినాన్ని హాజరైన ఆక్టింగ్ గవర్నరుజనరల్ శ్రీరాజగోపాలాచారి సభానంతరం నెహ్రూజీతో సంభాషిస్తున్నదృశ్యం.



జగ్జీవన్‌రాం అధ్యక్షతను కార్మిక మంత్రుల సమావేశానికి వచ్చిన మంత్రులు శ్రీ ధిపీ సింగ్ అజన్, గుల్జారీ నాలవందా, వి యస్ సిన్హా సంపూర్ణానంద్, జగ్జీవన్‌రాం, గోఖలే; డాక్టరు యస్ బెనర్జీలు వరుసగా చిత్రంలోనున్నారు



ప్రధాని నెహ్రూ అధ్యక్షతన 14 వ తేదీన జరిగిన భారత రాజ్యాంగ పరిషత్



అధినివేశ శాసనసభా సమావేశం ముస్లింలీగ్ సభ్యురాలు బేగ

ఆంధ్రపత్రిక

సంవత్సర చందా రు. 12-0-0
విడిప్రతిక అణాలు 0-4-0


ప్రతిబుధవారమున ప్రకటింపబడును

ఒరు లేయవి యొనరించిన నరవర! యప్రియము తన మనంబున కగు దా
నొరులకు నవి సేయకునికి పరాయణము పరమధర్మ పథముల కెల్లన్. (మహాభారతము)

సంపుటము 40
సంచిక 12

Founder: K. NAGESWARA RAO.

సర్వజిత్తు సంవత్సర కార్తిక బహుళ షష్ఠి బుధవారము



వెంటి తాళ్లు
ఛాయాచిత్రకారుడు సి. టి. వి. తిలక్ మద్రాసు.



ఆంధ్రపత్రిక

1947 వ సం॥ డిసెంబరు నెల 3-వ తేదీ బుధవారము

ఇండియా-హైదరాబాదు ఒడంబడిక

హైదరాబాదు సంస్థానానికీ, భారత అధినివేశానికీ అయిదుమాసాల ఎడతెరపి లేని సంప్రతింపుల ఫలితంగా ఒక సంవత్సరం అమలులో ఉండే యథాతథపు ఒడంబడిక కుదిరినందుకు సంతోషింపవలసి ఉన్నప్పటికీ, ఇంత దీర్ఘకాలం రాయబారాలు జరిగినప్పటికి శాశ్వతపు పరిష్కారం సాధ్యం గానందుకు నవాబుగారివలెనే అందరూ విచారింపక తప్పదు. కాని భారత అధినివేశ గవర్నరు జనరల్ ఎరల్ మౌంట్ బాటన్ నవాబుగారి జాబుకు వ్రాసిన ప్రత్యుత్తరంలో తెలిపినట్లు ఈ ఒడంబడిక ఉభయ పక్షాలకూ ఈ సంవత్సరకాలంలో సంతృప్తికరంగా ఉన్నట్లు తోస్తే సంవత్సరానంతరం హైదరాబాదు సంస్థానం భారత అధినివేశంతో చేరిపోగలదనే అందరూ ఆశించెదరు. గవర్నరు జనరల్ ఎరల్ మౌంట్ బాటన్, సంస్థాన శాఖామాత్యుడు సర్దార్ వల్లభాయ్ పటేల్ గారు స్పష్టం చేసినట్లు హైదరాబాదు అపేక్షలు, సంస్థాన భౌగోళిక స్థితినిబట్టి భారత అధినివేశం అపేక్షలతో మిళితమై ఉన్నవి. నేడుగాక పోయినా మరికొన్నాళ్ళు గడచిన తరువాతనైనా సంస్థానం, ఇతర సంస్థానాలవలెనే, అధికార దఖలు ఒడంబడికను సంతకం చేయక తప్పదు.

ప్రథమ ప్రపంచ సంగ్రామానంతరము అమెరికా రాజకీయవేత్తలు ప్రెసిడెంట్ విల్సన్ అంతర్జాతీయ విధానాన్ని ప్రతిఘటించి, నానాజాతి సమితితో అమెరికాకు సంబంధం ఉండకుండా చేసిరి. అప్పట్లో అమెరికను నిర్లిప్తవాదుల విధానమే నెగ్గింది కాని ద్వితీయ ప్రపంచ సంగ్రామంతో నిర్లిప్తవాదులే తీవ్ర అంతర్జాతీయవాదులైనారు. యుద్ధారంభంలో కొందరు రూజ్ వెల్టు అధ్యక్షుని విదేశాంగ విధానమును విమర్శించినప్పటికీ, అమెరికా యూరపు యుద్ధంతో ఎలాంటి ప్రమేయం పెట్టుకో రాదని ఆందోళన చేసినప్పటికీ ప్రజలు రూజ్ వెల్టు విధానమునే సమర్థించిరి, హర్షించిరి. నిర్లిప్త వాదులు పరిస్థితులకనుగుణంగా తమ విధానమును మార్చుకొనవలసి వచ్చినది. ఈనాడు రిపబ్లికన్ పక్షస్థులు సైతం ప్రపంచ వ్యవహారాల్లో ఎక్కువ శ్రద్ధ వహిస్తున్నారు. కిందటి ఎన్నికల్లో రూజ్ వెల్టును ఎదిరించిన స్వర్గీయ వెండెల్ విల్కీ కూడ "ఏక ప్రపంచ" విధానమునే అంగీకరింపవలసి వచ్చెను.

యూరపునందు కూడా లోగడ స్వతంత్ర రాజ్యములుగా ఉన్న దేశాలు కొన్ని చేరి యూరపు సంయుక్త రాజ్యాలుగా ఏర్పడాలని వాంఛిస్తున్నవి. లగ్జెంబర్గ్, హాలెండ్, బెల్జియం లు చేసుకొన్న సుంకముల ఒడంబడిక, ఏర్పాటు చేసుకొన్న కస్టమ్స్ యూనియన్ ఇట్టి రాజ్యాంగ వ్యవస్థకు ప్రాతిపదిక కావచ్చును. వీటన్నింటివల్లా స్పష్టమౌతున్న దేమంటే ఈ కాలం ఏ దేశము ఎంత శక్తివంతమైనదైనా, ఎంత విస్తీర్ణం కలిగిఉన్నా స్వతంత్రంగా ఉండ లేదని.

జులై 25 వ తేదీన సార్వభౌమ ప్రతినిధిగా సంస్థానాలకు లార్డు మౌంట్ బాటన్ చేసిన హెచ్చరిక, ఇచ్చిన సలహా ఇదే. "సంస్థానం వైశాల్యం ఎంత ఎక్కువైనా, ఎంత తక్కువ అయినా, రక్షణ, రవాణా, వైదేశిక వ్యవహారాలను స్వతంత్రంగా, స్వయంగా నిర్వహింపజాలదు. భౌగోళిక స్థితిని గుర్తించి ప్రతి సంస్థానమూ ఏదో ఒక అధినివేశములో చేరడం సంస్థానానికే ప్రయోజనకరం. ఆ అధినివేశం ద్వారానే ఈ వ్యవహారాలను నడుపుకోవడం అవసరం." అని ఆనాడు తాను చేసిన సూచననే ఎరల్ మౌంట్ బాటన్ తిరిగి ఇప్పుడు నిజాం నవాబుగారికి వ్రాసిన సమాధానంలో ప్రస్తావించారు.

అనుభవంమీద, నేడు పాకిస్థాన్ అధికారులు గ్రహించినట్లు, హైదరాబాదు సంస్థానాధికారులున్నూ, స్వాతంత్ర్యమును వాంఛించుట, స్వతంత్ర ప్రతిపత్తిని సాధించుట, సులభమే అయినా, ఆ స్వతంత్ర ప్రతిపత్తికి ఉండవలసిన హంగులను ఏర్పాటు చేసుకోవడం అంత సులభము గాదని గ్రహింతురని ఆశించుచున్నాము.

ఈ యథాతథపు ఒడంబడికవల్ల ఆగస్టు 15 వ తేదీకిపూర్వం భారత ప్రభుత్వానికీ, హైదరాబాదు సంస్థానానికీ ఉండిఉన్నట్టి సంబంధాలే ఇంక ముందూ ఉంటవని స్పష్టమౌతున్నది. సర్దార్ వల్లభాయ్ పటేల్ అధినివేశ శాసనసభలో ఇందుగురించి చేసిన ప్రకటనవల్ల లోగడ సార్వభౌమ ప్రతినిధికీ, సంస్థానానికీ ఉండిఉన్నట్టి ఒడంబడికలు సార్వభౌమాధికార సంజనిత అధికారాలు వినా, ఇంకముందున్నూ ఉంటవనీ, అధినివేశ ప్రభుత్వం సార్వభౌమ ప్రతినిధి అధికారాలను, బాధ్యతలను నిర్వహిస్తుందని వెల్లడి అవుతున్నది.

15 ఆగస్టుకు పూర్వం కూడా నిజాంకు ప్రత్యేకాధికారాలు, హక్కులున్నవని, సార్వభౌమత్వం అంతరించడంతో, ఇతర సంస్థానాలవలెగాక తన సంస్థానం సర్వాధికార సమన్విత స్వతంత్ర రాష్ట్రం కాగలదని నవాబుగారు, వారి అనుయాయులు వాదించుచుండిరి కాని బట్లర్ కమిటీ నివేదికవల్ల నిజాంకూడా ఇతర సంస్థానాధీశ్వరుల మాదిరే అనీ, అనేక పర్యాయములు బ్రిటిష్ ప్రభుత్వం సంస్థాన "గృహ వ్యవహారాల్లో" జోక్యం కలిగించుకొని శాంతిని నెలకొల్పెనని స్పష్టమౌతున్నది. హైదరాబాదు సంస్థానంలోని పరిస్థితులు భారత దేశ పరిస్థితుల ప్రమాదింప చేయగల అవకాశం ఏర్పడినపుడు భారత ప్రభుత్వం ఉపేక్షించి ఊరుకొనజాలదు. ఉభయపక్షముల సంబంధములు సమరసంగా ఉండాలన్నా, స్నేహ సంబంధాలు నిజాం నవాబుగా రాశించిన విధంగా వృద్ధి పొందాలన్నా, ఒకే మార్గం ఉంది. సర్దార్ పటేల్ అధినివేశ శాసనసభలో చేసిన ప్రకటన యందా మార్గమును సూచించిరి. "సంస్థాన ప్రవేశ విషయంలో నేమి, రాజ్యాంగ సంస్కరణల విషయంలో అయితేనేమి, మరే ఇతర విషయంలో అయితేనేమి సంస్థానాధిపతులు ప్రజాభీష్టాన్నే ధ్రువతారగా పెట్టుకో దగియున్నదని నిజాం ఇప్పటికైనా నిస్సంకోచంగా అంగీకరించగలడని ఆశిస్తున్నాను. సంస్థానాధిపతులందరిలోనూ విశిష్ట స్థానాన్ని ఆక్రమించుకొని ఉన్న నిజాం, ఈ విషయంలో ఆదర్శప్రాయుంగా వ్యవహరించి ఇతరులందరికీ మేలుబంతి కాగలడని ఆశిస్తున్నాను". అని సంస్థాన శాఖామాత్యుడు వెల్లడించిన ఉదాత్త భావాలను నిజాం అవగాహన చేసుకొని ఆయన సూచించిన మార్గాన్ని అనుసరిస్తారని విశ్వసిస్తున్నాము.

భాషాప్రయుక్తరాష్ట్రనిర్మాణం

ఏవిధంగా చూచినప్పటికీ భాషాప్రయుక్తంగా రాష్ట్ర పునర్నిర్మాణం వాంఛనీయం గనుక, ఆ కార్యక్రమాన్ని కొనసాగించడంలో ఎలాంటి జాప్యమూ ఉండరాదని గాంధీజీ చేసిన హెచ్చరిక సమంజసముగానూ, చాలా సమయోచితంగానూ ఉంది. భాషా రాష్ట్ర నిర్మాణ సూత్రాన్ని అధినివేశ ప్రభుత్వం అంగీకరించినట్లు ప్రధానామాత్యుడు పండిట్ నెహ్రూ అధినివేశ శాసనసభలో ప్రకటించెను. ఆంధ్ర రాష్ట్ర నిర్మాణానికి అట్టే చిక్కులు లేనందువల్ల నూతన రాజ్యాంగం ఆమోదింపబడిన వెంటనే రాష్ట్ర నిర్మాణానికి ప్రభుత్వం ఉపక్రమిస్తుందనికూడా పండిట్ నెహ్రూ పస్పష్టం చేశారు. ఒక్క సరిహద్దుల నిర్ణయంతప్ప రాష్ట్ర నిర్మాణానికి సంబంధించిన ఇతర విషయాలన్నింటినీ వెంటనే పరిష్కరించి వేయవచ్చును. నూతన రాజ్యాంగంలో ఆంధ్రరాష్ట్రం పేర్కొనబడి, పరిషత్తు ఈ నూతన రాజ్యాంగాన్ని ఆమోదించిన వెంటనే అధినివేశ ప్రభుత్వం ఒక ఆర్డర్-ఇన్-కౌన్సిల్ ను జారీచేసి ఆంధ్రరాష్ట్రాన్ని ఏర్పాటు చేయాలి. ఇలా జరగడానికి పూర్వమే సరిహద్దు నిర్ణాయక సంఘాన్ని ఏర్పాటు చేసి, సంఘం నివేదికను పూర్తి చేయడానికి ఒక తేదీని నిర్ణయించడం అవసరం. నివేదిక తయారైన వెంటనే ప్రత్యేకాంధ్రరాష్ట్రం ఏర్పాటు కాగలదు.

సరిహద్దుల విషయంలో వివాదాలు పెరగక, సమరస ధోరణిలో అన్ని వర్గములవారూ వ్యవహరించి సరిహద్దు నిర్ణయ సంఘమునకు తోడ్పడిన, భాషాప్రయుక్త రాష్ట్ర పునర్నిర్మాణ కార్యక్రమము యావత్తూ ఒక సంవత్సరంలోపునే పూర్తి కాగలదు. సరిహద్దుల విషయంలో అన్ని ప్రాంతాలవారూ గాంధీజీ సలహాను పాటించిన అసలు సమస్య ఎలాంటి చిక్కులూ, గొడవా లేకుండా పరిష్కారం కాగలదు. గాంధీజీ సలహా ననుసరించి ఆంధ్రనాయకులు ఒరిస్సా, కర్నాటక, తమిళ, మధ్యరాష్ట్రముల నాయకులతో సంప్రతింపులు ప్రారంభించి సరిహద్దుల విషయమై ఒక సమాధానమును సాధింప ప్రయత్నింపవచ్చును. ప్రభుత్వం ఏర్పాటు చేయు సరిహద్దు నిర్ణాయక సంఘంతో నిమిత్తం లేకనే వీరీ పని చేయవచ్చును. సమాధానం కుదిరిన ప్రయోజనకరమే. సమాధానం కుదరకున్న సరిహద్దు నిర్ణయ సంఘ తీర్పు ఉండనే ఉంది. ఆంధ్ర నాయకులిక తమశక్తి సామర్థ్యములను సరిహద్దు సమస్యా పరిష్కారానికే వినియోగింతురని విశ్వసించుచున్నాము.

నేటి ప్రపంచం

[అగ్రరాజ్య విదేశమంత్రుల సమావేశానికి అడుగులోనే హంసపాది; సభాకార్యక్రమం విషయంలో తర్జనభర్జన, చివరకు రష్యా లొంగుబాటు; చైనా అంతర్యుద్ధ ఉధృతం; మంచూరియా రాజధాని కమ్యూనిస్టు సేనల కైవశం; పాలస్తీనాలో విభజన పథకాన్నే అమలు జరపడానికి ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశంలో కూడా నిర్ణయం; అరబ్ రాజ్యాల ప్రతిఘటన సన్నాహాలు; పర్షియాలో కమ్యూనిస్టు ఆధ్వర్యాన నడిచే టూడేపార్టీ విధ్వంసకచర్యల ప్రారంభం, ఘవాంసుల్తానే ప్రభుత్వం మారిపోయే సూచన—ఇవి ఈ వారంలో గమనార్హమైన అంతర్జాతీయ సంఘటనలు]



జార్జి బిడాల్టు

అతితీవ్రమైన అభిప్రాయభేదాలతో, మన స్పర్థలతో అగ్రరాజ్య విదేశమంత్రుల సమావేశం నవంబరు 24 వ తేదీ మంగళవారంనాడు లండన్‌లో ప్రారంభమైంది. అమెరికా విదేశమంత్రి జార్జి మార్షల్, బ్రిటిష్ విదేశమంత్రి ఎర్నెస్ట్ బెవిన్, ఫ్రెంచి విదేశమంత్రి జార్జి బిడాల్ట్, రష్యా విదేశమంత్రి మొలటావ్‌లు ఈ సమావేశంలో పాల్గొంటున్నారు. యూరప్ ఖండ భవిష్యత్తును, తద్వారా ప్రపంచశాంతిని పరిష్కరించవలసిన సమావేశం కాబట్టి దీన్ని వాస్తవంగా చరిత్రాత్మక ప్రాధాన్యంగల సమావేశమనే చెప్పవలసివుంటుంది. పరస్పరవిరుద్ధమైన దృక్పథాలతోనూ, ఆధిపత్య విస్తరణను సాధించాలనే అహమహమికతోనూ ప్రారంభమైన ఈ సమావేశం జయప్రదమై ప్రపంచానికి శాంతి లభిస్తుందనే ఆశ ఎక్కడా ద్యోతకం కావడంలేదు. నిరాశ, నిస్పృహలే ఎక్కువగా గోచరిస్తున్నవి.

* * *

1945 లో అగ్రరాజ్యాధిపతుల సమావేశం పోట్స్‌డాంలో జరిగినప్పుడు బ్రిటన్, అమెరికా, ఫ్రాన్సు, రష్యా, చైనా విదేశమంత్రుల సమావేశాలను తరుచూ జరిపి, ద్వితీయ ప్రపంచ సంగ్రామంలో ఓడిపోయిన అక్షరాజ్యాలకు, విజయం సాధించిన మిత్రరాజ్యాలకు మధ్య కుదరవలసిన శాంతి ఒడంబడికలను తయారు చేయడం అవసరమనే నిర్ణయం జరిగింది. ఈ అగ్రరాజ్య విదేశమంత్రుల సమావేశం 1946 వసంతఋతువులోనూ, గ్రీష్మఋతువులోనూ రెండుసార్లు జరిగింది. తిరిగి ఈ సంవత్సరంలో కూడా రెండుసార్లు విదేశమంత్రులు సమావేశమైనారు. గత సమావేశం 1947 మార్చిలో మాస్కో నగరంలో జరిగింది. ఇప్పటివరకూ జరిగిన అగ్రరాజ్య విదేశమంత్రుల సమావేశాలలో కృత్యాద్యవస్థతో ఇటలీతోనూ, బాల్కన్ ఉపగ్రహరాజ్యాలతోనూ తిరుకువుండవలసిన భవిష్యత్ శాంతి ఒడంబడికలను మాత్రం నిర్ణయించగలిగారు. ఆస్ట్రియాతోనూ, జర్మనీతోనూ జరగవలసిన శాంతి ఒడంబడికలను పరిష్కరించుకోవడంలోనూ, తద్వారా యూరప్‌ఖండశాంతిని సాధించడంలోనూ పూర్తిగా విఫలులైనారు.

* * *

ప్రస్తుతం లండన్‌లో జరుగుతున్న సమావేశానికి అడుగులోనే హంసపాద ఏర్పడింది. సమావేశకార్యక్రమాన్ని ఏ వరసలో అనుసరించాలి, ముందు ఆస్ట్రియా సమస్యను ఎత్తుకోవలెనా, లేక జర్మనీ సమస్యను ఎత్తుకోవలెనా— అనే విషయంలో తీవ్రాభిప్రాయభేదం ఏర్పడి, పెద్ద తర్జనభర్జన జరిగింది. ఆస్ట్రియా శాంతి ఒడంబడిక సమస్యతో సమావేశకార్యక్రమాన్ని ఉపక్రమించడం అవసరమని బ్రిటన్, అమెరికా ఫ్రాన్సుల వాదన. కార్యక్రమంలో జర్మనీ ముఖ్యమైంది కాబట్టి, జర్మనీ శాంతి ఒడంబడికతో ప్రారంభించాలని సోవియట్ రష్యా పట్టుదల.

బ్రిటిష్ విదేశమంత్రి ఎర్నెస్టు బెవిన్ చాకచక్యముతో జరిపిన అంతరంగిక సంభాషణ ద్వారా సోవియెట్ రష్యా విదేశమంత్రి మొలటావ్ సమావేశంలో ఆస్ట్రియా శాంతి ఒడంబడిక సమస్యనే ముందు చర్చించడానికి ఎలాగైతేనేమి ఒప్పుకున్నాడు. అగ్రరాజ్య విదేశ మంత్రులు చివరకు అంగీకరించిన సమావేశ కార్యక్రమం ఇది: (1) బ్రిటన్, అమెరికా, ఫ్రాన్సులు సూచించినట్టుగా ఆస్ట్రియా శాంతి ఒడంబడికపై చర్చించడం; (2) భవిష్యత్ జర్మనీ సరిహద్దులను సైతం నిర్ణయించి, జర్మనీలో జరగవలసిన శాంతి ఒడంబడికలను తయారుచేయడం. సోవియట్ ప్రతినిధి ప్రతిపాదన ప్రకారం జర్మనీ సమస్యలను చర్చకు తీసుకొనేటప్పుడు జర్మనీ శాంతి ఒడంబడిక సమస్యనే ప్రప్రథమంగా ఎత్తుకుంటారన్నమాట; (3) జర్మనీ ఆర్థిక భవిష్యత్తుకు సంబంధించిన ప్రధాన సూత్రాలను నిర్ణయించడం; (4) జర్మనీలో ఏర్పడవలసిన తాత్కాలిక ప్రభుత్వ స్వరూపాధికారాలను తేల్చడం; (5) జర్మనీని నిరాయుధం చేసే విషయమై మాస్కో సమావేశంలో జరిగిన నిర్ణయాలను ఎంతవరకు ఆచరణలో పెడుతున్నదీ పరిశీలించడం; (6) జర్మనీని సైన్యరహితంగానూ, నిరాయుధంగానూ వుంచడానికి నాల్గు అగ్రరాజ్యాల ఒడంబడిక అవసరమని అమెరికా చేసిన ప్రతిపాదనను చర్చించడం.

ఈ కార్యక్రమం విషయంలో ఏకీభావం కుదరగానే, ఆస్ట్రియా శాంతి ఒడంబడిక సమస్యను అగ్రరాజ్య విదేశమంత్రులు తమ ప్రత్యేక ప్రతినిధుల పరిశీలనార్థం పంపించారు.

* * *

సోవియెట్ రష్యా విదేశమంత్రి మొలటోవ్ బ్రిటన్, అమెరికాలు పశ్చిమ జర్మనీలో సామ్రాజ్య విధానాన్ని అనుసరిస్తూ, యుద్ధప్రేరేపణ చేస్తున్నవని మరొకసారి ఆరోపించినమాటగాని అగ్రరాజ్యసమావేశ కార్యక్రమ సవరణను సమ్మతించలేదు. ప్రజాస్వామ్యబద్ధమైన సమైక్య జర్మనీ స్థాపన జరగాలని కూడా మొలటోవ్ ఈ సమావేశంలోనే ప్రసంగించాడు. పశ్చిమ జర్మనీ అంతటినీ బ్రిటన్, అమెరికాలు తయారుచేస్తున్నవని సోవియెట్ సేనాని మార్షల్ సొకలొవ్‌స్కీ గతవారం చేసిన ఆరోపణ తెలిసిందే. పైకి బ్రిటన్, ధర్మపన్నాలు చెప్పి జర్మన్ ప్రజలను తమ పక్షానికి తిప్పుకోడానికి సోవియెట్ రష్యా చేస్తున్న ఎత్తే ఇది. ఈ మధ్యవచ్చిన వార్తలుకూడా ఇదే విషయాన్ని బలపరుస్తున్నవి.

* * *

కమ్యూనిస్టుల ఆధ్వర్యంకింద నడుస్తున్న సోషలిస్టు యూనిటీపార్టీ బర్లిన్ నగర సోవియెట్ ఆక్రమిత భాగంలో రాయబారవర్గాన్ని ఒకదాన్ని ఎన్నుకునే నిమిత్తం ప్రత్యేక సమావేశాన్ని జరుపబోతున్నది.

ఈ రాయబారవర్గం అగ్రరాజ్యవిదేశమంత్రుల సమావేశం జరుగుతున్న లండన్‌కు వెళ్లి మొలటోవ్ వాదనను బలపరుస్తుందట. జర్మనీలో తక్షణమే ఒక కేంద్ర జర్మన్ ప్రభుత్వం ఏర్పడడం అవసరమన్నదే మొలటోవ్ వాదన. కాబట్టి బర్లిన్ నగరంలో సోషలిస్టు యూనిటీపార్టీవారు జరపదలచింది నిస్సందేహంగా రష్యా ప్రోద్బలంతో, ప్రోత్సాహంతో జరుగుతున్న కమ్యూనిస్టు సమావేశమే నన్నమాట. జర్మన్ సోషల్ డెమోక్రెటిక్ పక్షంవారు, క్రిస్టియన్ డెమోక్రెటిక్ పక్షంవారు, బెర్లిన్ సమావేశంలో పాల్గొనడానికి నిరాకరించారు. బెర్లిన్ సమావేశంవల్ల ఏ తీర్మానాలు జరిగినప్పటికీ, పశ్చిమ ప్రజాస్వామిక రాజ్యాలు వాటిని తోసి రాజనేమాట హాస్తవం. ఈ కమ్యూనిస్టు సమావేశతీర్మానాలు జర్మన్ ప్రజలందరి మనోభీష్టాన్ని వ్యక్తపరచవంటే దని బ్రిటన్, అమెరికాలు వాదించక మానవు. ఈ వాదనను మొలటోవ్ ప్రతిఘటించకా మానడు.

* * *

జర్మనీ ఎవరి ఆధిపత్యంకింద వుంటే, వారి ఆధిపత్యం కిందనే యూరప్ ఖండమంతా వుంటుందనే విషయం జ్ఞాపకముంచుకుంటే జర్మనీ విషయంలో అగ్రరాజ్యాలు పోటాపోటీలు పడడంలో వున్న ఆంతర్యం బోధపడుతుంది. ద్వితీయ ప్రపంచ సంగ్రామం అంతిమ దినాలలోనే జర్మనీ ఆక్రమణ కోసం ఈ అహమహమిక ప్రారంభమైంది. జర్మనీరాజధానిని తూర్పు దిశనుంచి పురోగమిస్తు సోవియట్ సేనలు ముందు ఆక్రమించుకోవడమా, లేక పశ్చిమ దిశనుంచి పురోగమిస్తున్న బ్రిటిషు, అమెరికన్, ఫ్రెంచి సేనలు ఆక్రమించుకోవడమా అనే పోటీ అప్పుడే ప్రపంచానికి స్పష్టపడింది. ఈ నాడు జర్మనీ విషయంలో అగ్రరాజ్యాలు చూపుతున్న క్లిష్ట సంఘర్షణ, బెర్లిన్ నగరంలో మిత్రరాజ్య సేనలు ప్రవేశించిన 48 గంటలలోనే తలఎత్తింది. గత మార్చి, ఏప్రిల్ మాసాలలో మాస్కోలో అగ్రరాజ్య విదేశమంత్రుల సమావేశానంతరం ఈ సంఘర్షణ తీవ్రవేగంతో మరీ విపరీత పరిణామానికి వచ్చింది.

ఏది ఏమైనప్పటికీ, జర్మనీ ఆర్థికంగా తన యథాస్థాయికి వస్తేనేగాని, యూరప్ ఖండానికి ఆర్థికంగా విమోచనంలేదు. అమెరికా ఎన్ని మార్షల్ ప్రణాళికలను అమలుపరచదలచినా, యూరప్ ఖండాన్ని స్థానికంగా అభ్యున్నతికి తీసుకురావడం అవసరం. అగ్రరాజ్యాలు అన్యదేశ వ్యవహారాలలో ప్రమేయాన్ని విరమించి, ఏ దేశభవిష్యత్తును ఆ దేశప్రజలే నిర్ణయించుకోడానికి సహాయపడాలి. అవసరమైతే, సైనిక, ఆయుధ సమస్యల విషయంలో జర్మనీపై కొన్ని ఆంక్షలను ప్రయోగించవచ్చు. స్వయంగా జర్మనీ సమస్యను జర్మన్ ప్రజలే పరిష్కరించుకోవాలిగాని, ఇటు బ్రిటన్ అమెరికాలుగాని, అటు రష్యాగాని ప్రత్యక్షంగా, పరోక్షంగా ఏ కుతంత్రాలను పన్ని ప్రజలలో విభేదాలను రెచ్చగొట్టకుండా వుంటే అదే పదివేలు. అప్పుడే జర్మన్ సమస్యగాని, యూరప్ ఖండ సమస్యగాని సవ్యంగా పరిష్కారం కావడానికి వీలుంటుంది. లేకపోతే, అగ్రరాజ్యాల పోటాపోటీలవల్ల ఒక్క యూరప్ ఖండాన్నే గాక, సమస్తప్రపంచాన్నీ అగ్రరాజ్యాలు మరొక మారణహోమంలోకి లాగడం తథ్యం. ఏ దేశసమస్యలను, ఆ దేశప్రజలే అన్యుల ప్రాబల్యం లేకుండా ధైర్యంగా పరిష్కరించుకోవడం అగ్రరాజ్యవిభేదాలకు విరుగుడు.




మొలటోవ్

రెండవ ప్రపంచయుద్ధం సమాప్తమై ఇప్పటికి రెండు సంవత్సరాలు దాటిపోయినా, అటు జర్మనీతోగాని, ఇటు జపానుతోగాని మిత్రరాజ్యాలకు శాంతి ఒడంబడికలు కుదరకపోవడం నిజంగా శోచనీయమే. జపానుతో జరగవలసిన శాంతి ఒడంబడికను గురించి ఆలోచించడానికి పదకొండు దేశాల ప్రతినిధులలో ప్రత్యేక మిత్రరాజ్య సంఘం ఒకటి వున్నది. పాకిస్థాన్‌ను కూడా కలుపుకొంటే 12 రాజ్యాలు ఇందులో ప్రాతినిధ్యం వహించవలసి వుంటుంది. ఈ ప్రతినిధులందరూ కలసి జపానుతో జరగవలసిన శాంతి ఒడంబడిక ముసాయిదాను తయారు చేయడం అవసరమని చైనా ప్రభుత్వం ఈ మధ్య 11 రాజ్యాలకూ ఒక తాఖీదు పంపింది. సోవియెట్ విదేశమంత్రి మొలటోవ్ ఇందుకు సమాధానం ఇస్తూ, జపాను శాంతి ఒడంబడిక ముసాయిదా తయారు చేయడానికి 1948 జనవరిలో నాల్గు అగ్రరాజ్యాల (అమెరికా, బ్రిటన్, రష్యా, చైనాల) విదేశమంత్రులు చైనాలోనే సమావేశమవుతారని చైనాకు తెలియజేశాడు. ఇట్టి సమావేశం ఒకటి జనవరిలో జరుగుతుందనే విషయాన్ని బ్రిటిష్ విదేశశాఖ ప్రతినిధి కూడా ధృవపరుస్తున్నాడు.

* * *

ప్రపంచంలో ఏదేశమైనా శాంతిసౌఖ్యాలను అనుభవించడానికి వీలున్నదేమోగాని, అభాగ్య చైనామాత్రం అందుకు నోచుకోలేదా అనిపిస్తున్నది. దాదాపు 10 లక్షల సైనికబలంతో కమ్యూనిస్టులు సాగిస్తున్న అంతర్యుద్ధ ఉధృతం ఆనాటికానాడు ఎక్కువవుతున్నదేగాని, అంతమయ్యేటట్లు కనిపించడం లేదు. మంచూరియా రాజధాని అయిన చాంగ్‌చున్ నగరం కమ్యూనిస్టుల వశమైనట్లు ధృవపడని వార్తల ద్వారా తెలియవస్తున్నది. ఇదే నిజమైతే, చాంగ్-కై-షేక్ సేనలకు పెద్ద దెబ్బ అనే చెప్పవలసివుంటుంది. ఉత్తర దిశన వున్న హోపే రాష్ట్ర రాజధాని పావోటింగ్ నగరానికి కూడా కమ్యూనిస్టుసేనలవల్ల ఉపద్రవం ఎక్కువైనట్లు తెలుస్తున్నది. ఉత్తరచైనాలోని ప్రధాననగరాలైన పీపింగ్, టేంటిస్టిన్, పావోటింగ్‌ల మధ్య త్రికోణాకారం గల యుద్ధరంగంలో మార్షల్ చాంగ్-కై-షేక్ స్వయంగా సైన్యాధిపత్యం వహించి కమ్యూనిస్టులపై యుద్ధం సాగిస్తున్నాడట. హోపే రాష్ట్ర రాజధాని రక్షణకు అదనపు ప్రభుత్వ బలాలు సైతం వెళ్లుతున్నవని

20-వ పేజీ చూడుడు



అజంపాషా

నవల

నారాయణభట్టు

✽

శ్రీ నోరి నరసింహశాస్త్రి

౩౫

ధర్మాసనము

నిన్నటితో క్రీడాద్వీపములో వినోదములు సమాప్తమయ్యెను. మల్లయుద్ధములో రాజరాజు సంగరత్నకుడు రాజమయ్య అతిశయించెను. చంద్రాదిత్య దండనాథుడు ఖడ్గయుద్ధములలో నద్వితీయుడని బిరుదు పొందెను. శూల కుంత ప్రయోగములలో జననాథుడు ముప్పిమయ్య యనువారు పేరు పొందిరి.

కాని యీ చివరి రెండు దినములను యువరాజును చోళపుత్రులును కుమారసప్తకమును క్రీడలలో పాల్గొనలేదు. రాజరాజుకూడ తుట్టతుదకు బహూకృతిప్రదానమునకు దప్ప క్రీడలు దర్శించుటకు రాలేదు. వినోదములందుచే కాంతివిహీనములై యుండెను. అనేకవిధములుగా వదంతులును ప్రేక్షకులలో ప్రబలిపోయెను.

ఈనాడు రాజరాజనరేంద్రుడు ధర్మాసనము నందాసీనుడయ్యెను. నతి బ్రాహ్మణుడు సభాముఖమునకు వచ్చి వాఙ్మూలమియ్యగల స్థితిలో నున్నందున ఈ సభ సమావేశపరచెను. ఈ సభకుగూడ వెనకటివలెనె సామంతులు దండనాథులు రాజబంధువులు ఉద్యోగులు సంపన్నులు వచ్చిరి. చూడదలచిన జనమంతటికిని వచ్చుటకనుజ్ఞ యిమ్మని రాజభటుల కాజ్ఞయైనది. ధర్మాసనమున మహారాజుండగా నచ్చటికి జనులందరనూ రానిచ్చు నాచారమున్నది. యువరాజుకును రాజబంధువుకును సంబంధించిన వివాదముగనుక ఈ నిర్ణయ సమయమున సమస్త జనులు నుండుట యుత్తమమని రాజరాజు ప్రకటన చేయించెను. సంతకు వచ్చిన విదేశవర్తకులు కూడ పలువురా సభకు విచ్చేసిరి.

వందిమాగధుల కైవారములును కవిజనముల యాశీర్వాదములును కన్యకల మంగళహారతులను వినవి.

ధర్మాసనమున రాజరాజనరేంద్రుడే స్వయముగా నుపవిష్టుడయ్యెను. చీదమార్యుడు ప్రాడ్వివాకుడు. గణకుడు వావులూరి మల్లన. లేఖకుడు గండాచార్యుడు. కూడిన యశేష సామంత దండనాథులే సభ్యులు.

యువరాజ రాజేంద్రదేవుడొక ప్రక్కను కామరాజపుత్రుడింకొక ప్రక్కను అన్యోన్యాభిముఖులై కూర్చుండిరి.

వైతాళికుడు సభాప్రారంభము ప్రకటించెను.

వెంటనే బాణహతుడైన బ్రాహ్మణుడు ఇద్దరు బ్రహ్మచారుల కైదండలతో ప్రక్కనున్న గదినుండి సభాంగణమునకు వచ్చెను. ఆ బ్రాహ్మణునకు ప్రత్యేకముగ నొక యాసనము సిద్ధముగా నుండెను. బ్రాహ్మణుడు చేతిబాధ యోర్చుకొనుచు ప్రయత్నపూర్వకముగా బాహువులు కలిపి సభకు నమస్కరించి యనుజ్ఞాతుడై యా యాసనమున నుపవిష్టుడయ్యెను.

ప్రాడ్వివాకుడగు చీదమార్యుడు రాజేంద్రదేవుని, కామరాజపుత్రుని నా బ్రాహ్మణుని సాక్ష్యమున కభ్యంతరమున్నచో చెప్పవలసినదని కోరెను.

"ఈ బ్రాహ్మణుని క్రీడా వినోదములకు పూర్వము మాత్రమైన చూడలేదు. నాకెట్టి యభ్యంతరమును లేదు." అని యువరాజు వెంటనే వచించెను.

"నేనును ఈ బ్రాహ్మణు నెరుగను. అయినను యువరాజునెడ నభిమానముగల వజ్జియ ప్రెగ్గడల మందిరమున చికిత్స నొందుచున్నందున నాకు పూర్తిగా విశ్వాసము లేదు. సాక్ష్యమైన పిమ్మట అవసరమని తోచిన కొన్ని ప్రశ్నలడుగుట కనుజ్ఞ అర్థింతును" అని కాముడు చెప్పెను.

చీదమార్యుడు వెంటనే నిష్కర్ష చేసెను. "అట్టి వాగ్దానము ధర్మప్రభువులు ముందుగా చేయ వలనుపడదు. గాయమైన మానవుడు చికిత్స నొందక తప్పదు. ఎవరి దెబ్బకు కారణము నిర్ధార్యాంశమో అతనిని విచారింప కుండుటకు విశేషకారణము లుండవలెను. సాక్ష్యమైన పిమ్మట స్థితిగతులను బట్టి సభ్యులును ధర్మప్రభువులును అట్టి యనుజ్ఞ అనుగ్రహించ వచ్చును. అది యప్పుడు మనవి చేసికొనవలసినదే కాని ఇప్పుడప్రస్తుతము."

ప్రాడ్వివాకుని నిర్ణయమునకు రాజపుత్రుడు విధిగా తలయొగ్గెను. అంతట బ్రాహ్మణుని విచారణ ప్రారంభమయ్యెను.

ముందా బ్రాహ్మణుని యెదుట నగ్నిహోత్రముంచిరి. దానికి నమస్కరించి బ్రాహ్మణుడు అగ్నిసాక్షిగా సత్యమే చెప్పెదనని ప్రతిజ్ఞ చేసి ప్రారంభించెను.

"నా నామము నన్ని నారాయణభట్టు. మా తండ్రి పేరు అకలంకాశంకనామాత్యుడు. బ్రాహ్మణుడను. మాది పరిత్రసగోత్రము. ఆపస్తంబ సూత్రము. నాకు నలుబది యేడేండ్ల వయస్సు. ప్రస్తుతము రాజమహేంద్ర 'పురమే నా నివాసము. స్థిరవసతి లేదు."

ప్రాడ్వివాకుడగు చీదమార్యుడు వెంటనే వారించెను.

"స్థిరనివాసము లేనిచో పూర్వము వసించిన స్థలము, కృత్తి వివరముగా చెప్పితీరవలెను"

నారాయణభట్టు: "చిత్తము. ఇప్పటికి రమారమి సంవత్సరము క్రిందటి వరకు కల్యాణకటకము నివాసముగా నుండెను. ఈ వత్సరకాలమునుండి స్వస్థానము వదలి దేశాటనము చేసి తుదకు మా పూర్వుల నివాసక్షేత్రమగు వేంగీమండలము చేరినాను. మూడేళ్ల క్రిందటివరకు త్రైలోక్య మల్లదేవర యొద్ద ప్రధానిగా నుండెడివాడను."

అంతట ప్రాడ్వివాకుడు ప్రశ్నింప నారాయణభట్టు ప్రత్యుత్తరములిచ్చుచుండెను.

"నీవు చైత్రశుద్ధ త్రయోదశి సాయంకాలమున వినోదముల యొద్ద నుండగా నీ దక్షిణబాహువున బాణము తగిలినదిగదా ?"

"అవును."

"అది ఎవరు కొట్టిన బాణము?"

"నాకు ఆయుష్మంతులగు యువరాజు చేతులతో విడువబడిన బాణమే తగిలినది."

"అంతకు పూర్వము బాణము లేమైనను బ్రాహ్మణబృందములోనికి వచ్చినవా ?"

"రెండు వచ్చినవి. నామీదికే."

"అవి ఎవరు వదలినవి ?"

"అవి కామరాజపుత్రుని ధనస్సునుండి వచ్చినవి."

"అతడు వదలినవి ప్రమాదజనితమా ? బుద్ధిపూర్వకమా ?"

"ప్రమాద మగుటకు అవకాశము లేకపోలేదు. కాని రెండు బాణములును నొకరు వదలిన వెంట వెంటనే నామీదికే వచ్చుట ప్రమాదమగునా యని సందేహింపవలసి యున్నది."

"అవి రెండును నీ కెందుకు తగులలేదు ?"

"భటుడొకడు దండముతో వారించినాడు. అతడే!" అని సభలో నున్న రాజమయ్యను నారాయణభట్టు నిర్దేశించెను.

"యువరాజు బాణము ప్రమాదమున నీకు తగిలినదా ? ప్రయత్నపూర్వకమా !

"ప్రమాదమగుట కవకాశమున్నది కాని ప్రయత్నపూర్వకమను కొనుటకు గూడ కారణమున్నది."

"అనగా ?"

"యువరాజును కామరాజపుత్రుడు చివర క్షణములో చేయిపట్టి కదలింపనిచో ఆయుష్మంతుని బాణము నాకు తగిలి యుండదు."

"అనగా, ప్రయత్నపూర్వకముగా నిన్ను కొట్టుటకు కాముడు రెండు బాణములు ప్రయోగించి విఫలుడై తుదకు యువరాజు ప్రయోగించుచున్న బాణము నీకు తగులునట్లుగా అతనిని కామరాజపుత్రుడు కదలించినాడని నీ ఉద్దేశమా ?"

"అట్లనియే నా దృఢ విశ్వాసము."

ఆ సమయమున రాజరాజనరేంద్రుడు ధర్మాసనమున నుండి యిట్లు సెలవిచ్చెను:

"ఇది చిత్రముగా నున్నది. కామరాజపుత్రునికి ఈ బ్రాహ్మణుని బాణహతుని జేయుటకేమైన విరోధాదికారణము లున్నవేమో ప్రాడ్వివాకులు నిశ్చయించెదరుగాక !"

రాజానుమతితో ప్రాడ్వివాకుడు మరల ప్రశ్నింప నారంభించెను.

"నీయందు కామరాజపుత్రునికి పూర్వవైరమున్నదా ?"

"ఆ రాజపుత్రుని మనస్సు నే నెట్లూహింపగలను ?"

"నీవు పూర్వమా రాజపుత్రు నెరుగుదువా?"

"ప్రత్యక్షముగా నెరుగను గాని, రాజబంధువులలో నొకరని వినికిడి యుండెను. మరియు కల్యాణకటకములో నొకమారు వేరువేషమున జూచియున్న జ్ఞప్తి కలదు."

"ఇందా విషయములప్రస్తుతములు. ఈ విషయమున నీ వింకను జెప్పుకొనవలసిన దేమైన నున్నదా ?"

"లేదు."

అంతటితో నారాయణభట్టు వాఙ్మూలము ముగిసెను. గండాచార్యుడు ఫలకముపై లిఖించినది ప్రాడ్వివాకుడు సభాముఖమున జదివి యందరు ననుమతించిన పిమ్మట పత్రముపై వ్రాయించుట కనుజ్ఞ యిచ్చెను.

అంతట కామరాజపుత్రుడు ముందు మనవి చేసినట్లు కొన్ని ప్రశ్నలు వేయుట కనుజ్ఞ వేడెను. ప్రాడ్వివాకుడగు చీదమార్యుడది న్యాయవిరుద్ధమని సూచించుచు రాజరాజువంక జూచెను. రాజరాజనరేంద్రుడు నిస్సంకోచముగా కామరాజపుత్రుని నెన్ని ప్రశ్నలైన ప్రశ్నించుట కనుజ్ఞ యిచ్చెను. రాజపుత్రుడు ప్రశ్నింప నారంభించెను. నారాయణభట్టు ప్రత్యుత్తర మీయదొడగెను.

"మీరు గాయపడిన పిమ్మట వజ్జియ ప్రెగ్గడల మందిరములో చికిత్స నొందుచుంటిరిగదా!"

"అవును."

"అక్కడ ప్రెగ్గడలకును మీకును ఈ యభియోగము సంగతి సంభాషణలు జరిగెనుగదా !"

"గాయము కలిగిన రాత్రి నాకు స్మృతి వచ్చినవెంటనే నా గాయము కారణమునుగూర్చి మాయిద్దరకు సంభాషణ ఒక్కసారిమాత్రము జరిగినది. అప్పటికి యభియోగము విచారణ ప్రారంభింపలేదు."

"మిమ్మును మీ ప్రభువులు కొలువులోనుండి ఎందుకు తొలగించిరి ?"

"నన్ను తొలగింపలేదు. నేనే మానుకొంటిని."

"ఎందుకని ?"

"నాకు శాంతముగా నిత్య నైమిత్తిక విధులతో కాలము గడపవలెనని సంకల్పముదయించినది."

"ఈ దేశమెందుకు వచ్చితిరి."

"సర్వలోకాశ్రయ శ్రీ రాజరాజ విష్ణువర్ధనులు బ్రాహ్మణాభిమాని యనియు, కవి పండిత పోషకుడనియు విని యీ దేశము బ్రాహ్మణ నివాసమునకు యోగ్యమగునని వచ్చినాను."

కాముడు పొరపాటుప్రశ్న వేసితినని నొచ్చుకొనెను. కాని ప్రశ్నలు చాలించలేదు.

"మీకున్న వృత్తి ఈనాడేమైనది ?"

"మీరు ప్రసాదించిన బాణహతితో నా శక్తి మాయమైనది." సభలో చిరునవ్వు ప్రసరించెను.

"మీ రేమైన జదువుకొంటిరా?"

"కొంచెము."

"ఎక్కడ ?"

"కాంచీపురములో ముఖ్యముగా."

"వజ్జియప్రెగ్గడల కుమారు నెరుగుదురా ?"

"అతడు నా సహాధ్యాయుడు."

"నన్నయభట్టారకులు ?"

"ఎరుగను."

"రాజేంద్రదేవు నెరుగుదురా ?"

"యువరాజునా ? యువరాజని యెరుగుదును."

"యువరాజు మీ కిష్టుడుగదా !"

"కాకేమి ! ఆయుష్మంతు డెవరి కిష్టుడు కాడు !"

కాముడు మరల పొరబడితినని నొచ్చుకొనెను. రాజరాజు ముఖములో కోపము వ్యక్తమగుచుండెను. కాముడు ప్రశ్నలు చాలించలేదు.

"కొంచెము చదువుకొంటినంటిరి! ఏమిటా చదువు ?"

"నా చదువు పరీక్షింతురా, రాజపుత్రా నా చదువు స్వల్పము, కావలసిన దడిగినచో చదివిన స్వల్పము చెప్పెదను."

"మీకు దండనీతి తెలియునుగదా !"

"అవును. ప్రధానిగా నుంటినిగదా, ఏడేళ్లు"

"శస్త్రసాధనము చేసితిరా ?"

"కొంత కొంత"

"ఏ శస్త్రములు ?"

"ధనస్సు, ఖడ్గము, గద, కుంతము, శూలము—"

"వేద శాస్త్రములు రావుగదా !"

"అనంతమైన వేదము సంపూర్ణముగా నెవరికి వచ్చును? మాది కృష్ణయజుర్వేదశాఖ. అందులో నుపలబ్ధమైనంతవరకు క్రమాంతము అధ్యయనము చేసితిని. శాస్త్రములలో నేమి కావలెను ?"

కాముడు మరల ప్రశ్నింపబోవుచుండెను. సభ్యులలోనుండి రాజగురువులగు నన్నయభట్టారకుల కంఠము స్పష్టముగా వినవచ్చెను.

"రాజపుత్రా! ఇతడె నా సహాధ్యాయుడు నారాయణభట్టు వినచో ఇతడు కేవలము సరస్వతీ మూర్తి! ఇతని పాండిత్యపరీక్ష చేయ ప్రయత్నించుట నీకు వ్యర్థప్రయత్నమగును."

వ్యాసప్రోక్తమైనదని సభ్యులు నిర్ణయించిరి. నారాయణభట్టు వినయముతో తల వంచుకొనెను. కాముని ప్రశ్నలు కాముని కంఠములోననె అడగి పోయెను.

అంతట రాజరాజు కాముని సంబోధించి యతని కేమైన సాక్షు లుండిరేమో యడిగెను. వెనుక విచారించిన వారు కాక యితరులు లేరని చెప్పెను. ఇంకను జెప్పుకొనవలసిన దేమేనున్నచో చెప్పుకొనుటకు ప్రభువాన తిచ్చెను.

"నేను దోషిని కాను. యువరాజుమీది యభిమానముచేత యువరాజు చేసిన ప్రమాదమును ఇందరు కలసి నామీదికి త్రోయుటకు ప్రయత్నించుచున్నారు. వజ్జియప్రెగ్గడల బుద్ధి సూక్ష్మత లోక మెరుగనిది కాదు: అని కామరాజపుత్రుడు చెప్పుకొనెను.

వజ్జియ మాటాడలేదు. రాజరాజు కోపము పట్టలేక పోయెను, "ఇందులో దోషి యెవరో సభ్యులు నిర్ణయింతురుగాక !" అనెను.

సభ్యులందరు "కామరాజపుత్రుడు దోషి" యని యేకగ్రీవముగా వచించిరి.

రాజరాజనరేంద్రు డిట్లు వచించెను :

"కామరాజపుత్రా ! యువరాజు దోషి యను నిశ్చయముతో నతనిని శిక్షించుటకే మహాసభలో ఈ వ్యవహారవిచారణ ప్రారంభించితిమి కాని యువరాజు నిర్దోషి యని సిద్ధాంతమైనది.

"నీవు చేసిన నేరము తలచుకొనిన నాకే సిగ్గగుచున్నది. ఒక చాళుక్యరాజపుత్రుడు విద్వాంసుడైన బ్రాహ్మణుని హత్యచేయుటకు మూడు ప్రయత్నములు చేసినాడు. అందులో విషదిగ్ధబాణములు ప్రయోగించినాడు.

"ఇంతియకాదు. నీ దోషము యువరాజుపై వేయుటకు కృత్రిమముగా నాతని నామాంకిత బాణములు సృష్టించినావు. సభాముఖములో నిశ్శంకముగా యువరాజు బాణములు బ్రాహ్మణునికి తగిలినట్లు అసత్యమాడినావు."

(19-వ పేజీ చూడుడు)

కమ్యూనిస్టుల, ఫాసిస్టుల, సారూప్యతలు

లూయీ ఫిషర్

ప్రచారణ విధానాలలో, దేశవిస్తరణ జిగీషా విజృంభణలలో, వ్యక్తుల మీద క్రౌర్యప్రదర్శనలో, వ్యక్తుల ప్రాణాలపట్ల నిర్లక్ష్యంలో, నియంతృత్వాల కొకదానితో ఒకదానికి చాలా సారూప్య మున్నది. కాన్సంట్రేషను కాంపుల పేరెత్తితే హిట్లరు జ్ఞప్తికి వస్తాడు. అయితే సోవియట్ రష్యాకూడా కన్నులకు కట్టుతుంది. "పోలీసురాజ్య" మనుకొనేటప్పటికి ముస్సోలినీ, ఫ్రాంకో, స్టాలిన్, టిటో, పెరాన్‌లు ప్రత్యక్షమౌతారు. "ఏకపక్ష ప్రభుత్వము"ల తలపోసి పరీక్షణ చూడబోతే ఒక నియంతృత్వానికి మరొక నియంతృత్వానికి విభేదమే కనుబడదు.


కాబట్టి, నియంతృత్వవాదు లందరిలోనూ ఏవో ప్రత్యేక సారూప్యత లున్న, విలక్షణా మండితీరాయనే గోచరిస్తుంది. అందరూ బల ప్రయోగంలో నమ్మక మున్నవారే. గట్టిగా అరచి ప్రచారం చెయ్యగలవారే. ప్రతికక్షుల నణగద్రొక్కి రూపుమాపా లనేవారే. అల్ప సంఖ్యాకవర్గ ప్రభుత్వ ప్రియులే. సంపూర్ణ అయుధ సమీకరణ విశ్వాసులే. సర్వశక్త్యాత్మక ప్రభుత్వ భక్తులే. ఏకనాయకుని దేవతాంశ సంభూతుని గావించి, కొలచి, అచంచలుడు, అజేయుడు, అప్రతిమాను డని కొలిచేవారే. ("హెయిల్ హిట్లరు", "ఫ్రాంకో జిందాబాద్" "మహాఘన స్టాలిన్" "ఏకైకవీర టిటో" ఇత్యాది నినాదభక్తులే.)

నియంతృత్వవాదులకు పాపభీతులు లేవు. సత్యముతో సంబంధములేదు. వ్యక్తిగతఅభిప్రాయాలకు గౌరవంలేదు. వ్యక్తిసౌఖ్యం లెక్కకురాదు. వ్యక్తుల తారతమ్యాలులేవు. నియంతృత్వ వాదు లందరూ, ప్రభుపక్షీయులే, ప్రభు విశ్వాసులే, నియంతృత్వ ప్రియుల ప్రథమ సూత్రాలు వినయవిధేయతలు. సైన్యవిధాన వినయవిధేయతలు.

అందుచేత, జర్మనీ, ఇటలీ హంగరీ, రుమేనియా, బల్గేరియాలలో చాలమంది ఫాసిస్టులు కమ్యూనిస్టులుగా మారారంటే, ఆశ్చర్యపడ నక్కరలేదు. ప్రజాస్వామ్యపక్షాలలో కన్నా వాళ్ళు కా పక్షంలోనే ఎక్కువగా తమ స్వభావాని కనుగుణ్యంగా కనుబడుతుంది.

డోరియట్ ఫ్రెంచి కమ్యూనిస్టు నాయకుడు. కొమింటర్నులో ఉన్నతోద్యోగి. తరువాత ఇట్టే జర్మన్ నాజీలతో చేతులు కలిపి వ్యాగలిగాడు. పియర్ లావల్ కమ్యూనిస్టుగా రాజకీయ జీవితం ప్రారంభించాడు. ఫ్రాంసులో హిట్లరు ముఖ్య ఏజెంటుగా అయి ఉరికంబం మీద జీవితం చాలించాడు. ఒకరకపు నియంతృత్వానికి మరొకరకపు నియంతృత్వానికి మధ్య వంతెన ఏనాడూ పెద్దదికాదు.

ఈ మధ్యకాలంలో, ఈ వంతెన మరీ చిన్నదైపోయింది. కారణం కమ్యూనిస్టులు కూడా



స్టాలిన్

జాతీయవాదులుగా మారిపోవటమే. పూర్వం కమ్యూనిస్టులు అంతర్జాతీయవాదులు. జాతి, కుల, వర్ణ విచక్షణలో వారి కప్పుడు నమ్మకముండేదికాదు. ఆర్థికవర్గభేదాలు గుర్తించి, "ప్రపంచ కార్మికులారా, ఏకం కండి" అన్న నినాదం మీదనిలచేవారు. ఫ్రెంచికార్మికునికి ఫ్రెంచి ధనికునికి ఉన్న భేదంకన్నా, ఫ్రెంచికార్మికునికి చైనీయకార్మికునికి మధ్యభేదం చాలా తక్కువని నిరూపించి ఒత్తిచెప్పారు.

అనాడు కమ్యూనిస్టులకూ, స్వజాతి, స్వరక్త, స్వదేశ ఔన్నత్యాలలో నమ్మే ఫాసిస్టులకూ విపరీతమైన వ్యత్యాస ముండేది.

కాని ఈనాడు సోవియట్, స్వదేశ, విదేశరాజ్యాంగవిధానా లన్నీ, సమిష్టి స్లావ్ కూటమి అన్న ప్రవాహ పథంలోనే పడినడుస్తున్నాయి. పదేళ్ళ క్రితం, బోల్షివిక్ నాయకులెవరికీకూడా, జాతి విభేద నిరసనఘట్టాలలో తప్ప "స్లావ్" అన్నపదం వాడేందుకే గుండె లుండేవికావు. కాని నేడు, 'స్లావ్ తత్వము' క్రెమ్లిన్ తత్వముగా ఐపోయింది.

ఇక ఎప్పటిలాగే, సోవియటేతర కమ్యూనిస్టు పక్షాలూ, ఈ గొంతెత్తే మొదలుపెట్టాయి. జర్మన్ కమ్యూనిస్టులు జర్మన్ జాతీయవాదుల మనీ, ఫ్రెంచి కమ్యూనిస్టులు ఫ్రెంచి



ఫ్రాంకో

జాతీయవాదులమనీ, అల్లాగే ఇతరచోట్లా మొదలుపెట్టారు. ప్రతిచోటా కమ్యూనిస్టులు బలీయమైన జాతీయ భావాన్ని ఒడిసి పట్టుకొని తమ రథానికి కట్టెయ్య చూస్తున్నారు.

ప్రపంచాన్ని గానీ, లేదా ఒక ఖండాన్ని గాని తామేనాడైనా ఏలటం జరిగితే, సంకుచితజాతీయవిద్వేషాలను రూపుమాపుతా మని పూర్వపు కమ్యూనిస్టులు వాదించేవారు. కాని నేటిపరిస్థితుల్లో, జర్మన్ కమ్యూనిస్టులు పోలండులో తాము పోగొట్టుకొన్న భాగం జర్మనీకి రావాలనీ, పోలిష్ కమ్యూనిస్టులు ఆ భాగం తమకే ఉండాలనీ కోరుతున్నారు. ఫ్రెంచి కమ్యూనిస్టులు, 'సార్' రాష్ట్రం ఫ్రాంసుకు కావాలంటారు. జర్మన్ కమ్యూనిస్టులు "సార్"పై ఫ్రెంచిరాజ్యం కన్నేస్తోందని గోలచేస్తున్నారు. జెకోస్లోవాకియానుంచి జర్మన్లను, హంగేరియన్లను వెళ్లగొట్టాలని ఎక్కువగా పట్టుపట్టింది జెక్కు కమ్యూనిస్టులే. ఈ సూత్రంమీదే తేలికగా జెక్కు ఫాసిస్టులూ కమ్యూనిస్టులూ కలిసిపోవచ్చును.

అసలు ఎక్కడికన్నాకూడా స్వజాతీయ కమ్యూనిజం, వికృతాతివికృత రూపంలో రష్యాలోనే ఎక్కువగా బహిర్గత మౌతూంది. సోవియట్ పత్రికలు చూస్తున్నకొద్దీ, "రష్యనుల సర్వోత్కృష్టతా" సూత్రవివరణమే స్ఫుట నాదంతో మహాఘోషగా వినబడుతుంది.

'రేడియో కనిపెట్టినవాడు మార్కొనీకాడు. అంతకు చాలా పూర్వమే పోపోవ్ అనే రష్యను కనిపెట్టాడు' అని సోవియట్ అధికార ప్రచారశాఖ ప్రకటిస్తూంది. విద్యుద్దీపాన్ని తెచ్చినవాడు ఎడిసన్ కాడు. అంతకుముందే రష్యనొకడు తెచ్చాడు. అమెరికన్లు, అణువును భంజించటానికి పూర్వమే, ప్రొఫెసర్ జోషీ ఆ మహాప్రయోగం చేశాడు...ఇదే ధోరణి.

సోవియట్ ప్రచారశాఖ, ఒక్క అమెరికా అనే లేకుండా, పాశ్చాత్యవిషయికమైన ప్రతీదానికి వ్యతిరేకప్రచారం సాగిస్తూనే ఉంది— యూరప్ శతాబ్దాలనుంచీ ఈనాటిదాకాకూడా జీర్ణావస్థలో శిథిలముఖంగా సంస్కృతిహీనమై వెనకబడి ఉంది. చివరికి జారు కాలపు రష్యాకూడా పాశ్చాత్య సంస్కృతి ప్రభావంపై ఆధార పడవలసిందేమీ ఉండేదికాదు. ఇక సోవియట్ రష్యా, బైట ప్రపంచ మంతటికన్నా సర్వోత్కృష్టమని వేరే చెప్పనక్కరనేలేదు—ఇదీ నేటి క్రెమ్లిన్ వాణి.

బోల్షివిక్ అనే మాస్కో మాసపత్రిక క్రెమ్లిన్ తాత్వికవాదతీర్థానికి శంఖ ప్రాయముగా ఉంటుంది. ఈ పత్రిక, సుప్రసిద్ధ చిత్రకారుడు పికాసో చిత్రించిన "గొయెర్నికా" అనే ఉత్తమచిత్రాన్ని పట్టుకొని, "ధనిక వాదోద్భవమైన పాశ్చాత్య దుష్కళా స్వరూప మ"ని దుయ్యబట్టింది. ఒకనాడు సోవియట్ ప్రభుత్వ



లావెల్

ఆదరాభిమానాల నమితంగా చూరగొన్న నవీన ఫ్రెంచి చిత్రలేఖనాలు, నేడు ప్రదర్శనార్హాలు కాక బొమముడిపాటుకు గురి ఐనాయి.

నేటి సోవియట్ రాజకీయ విధానాలను, ఈ పరిణామ మూలబీజాలను చూసి ఎవరైనా తేలికగానె గ్రహించవచ్చును.

రష్యాకు పశ్చిమఖండం అంటే భయం పుట్టింది. రష్యాకు పాశ్చాత్యులు దండెత్తివస్తారన్న భయము కాదు. ఆటం బాంబు అంటే భయమూ కాదు. పాశ్చాత్యాధిక్యత అంటేనే ఎక్కువ భయపడుతూంది.

ఈమధ్య జరిగిన సోవియట్ శాసనంవల్ల సోవియట్లు విదేశీయులను వివాహమాడటానికి వీలు లేదు. సోవియట్ సైన్యాలు ఆస్ట్రియా జర్మనీలు ప్రవేశించినప్పుడు, పౌరజనంతో సంపూర్ణంగా కలిసిపోవటానికి క్రెమ్లిన్ ఒప్పుకుంది. ఇప్పుడు జర్మన్, ఆస్ట్రియన్లతో, రష్యను సైనికులు ఐక్యతనందు కోటం నిషేధించారు. ఎఱ్ఱసైన్యంలో అధికారులూ సైనికులూకూడా, వేల పదివేల సంఖ్యలలో సైన్యంలోంచి పారిపోయి, అమెరికన్, బ్రిటిష్ ఫ్రెంచి, స్థానభ్రష్టుల కాంపులలో ఇచ్ఛాయుతంగా నైతేనేం, బాధకంచేత నైతేనేం, తల దాచుకొంటున్నారు.

1933 నుంచి 1945 దాకా రష్యాలో నివసించి, అనేక గ్రంథాలు ప్రచురించిన ప్రసిద్ధ జర్మన్ కమ్యూనిస్టు నవలారచయిత థియొడోర్ ప్లివియర్, ఈ మధ్య జర్మనీవచ్చి, స్వల్పకాలం రష్యన్ ఆక్రమిత భాగంలోఉండి అమెరికన్ భాగంలోకి పారిపోయి వచ్చాడు. జర్మన్, సోవియట్ ఆక్రమిత భాగంలో ఉన్న తురింజియా ప్రధాని సోవియట్ ఆక్రమిత భాగంలోని జినాపట్టణ పురపాలకాధ్యక్షుడూ, వీళ్ళు కూడా ఇల్లాగే అమెరికన్ భాగాలలోకి పారిపోయి వచ్చారు.

క్రెమ్లిన్‌లోని సోవియట్ అధికారులను ఈ విషయాలే బాగా కలత పెడుతున్నాయి. "రష్యను సర్వోత్కృష్టతన" వాళ్ళు గొంతెత్తి ప్రచారం చేస్తున్నారు. జను లా మాట నమ్మటంలేదు అనే వారి భయం. శాంతియుతంగా దీర్ఘకాలం పాశ్చాత్యలోకంతో ఆర్థికంగా, సాంస్కృతికంగా పోటీపడుతే తమ కించిజ్జత్వము బైలుపడిపోతుం దన్న భయంతో, స్వయం విఘాతకంగా, రష్యా. పాశ్చాత్యలోకంతో సంబంధం, గట్టిగా తెంచేసుకొంటూంది.

మార్షల్ ప్రణాళికలో తన ఉపగ్రహాలైన ప్రాచ్య యూరపియన్ రాజ్యాలు చేరకుండా రష్యా చేసిందంటే, కారణం బహు చిన్నదే! పాశ్చాత్యలోకంతో బాంధవ్యాలు తమకింకా శ్రేయస్కరమని వాళ్ళు గ్రహించి పోతారేమోనని!

ఈమనస్థితిలో క్రెమ్లిన్, తనరాజ్యాన్ని మడిగాఉంచుకొని, బలపరుచుకొని, శత్రునాశనం చేసుకొంటూ, ఈగజొరకుండా చేసుకొందామని ప్రయత్నిస్తూంది. బాల్కను, మధ్య యూరప్, పోలండుదేశాలలో, విచారణలు, నిగ్రహపు వేటలు, వీటన్నిటికీ అర్థ మిదే అనేందుకు సందేహమేమీ లేదు. మాస్కోకు సాష్టాంగ ప్రణామమొనర్చకుండా ఎవరున్నా, పాశ్చాత్య లోకంతో ఏమాత్రం సానుభూతి బాంధవ్యం ఉన్నా, ఆయా విషబీజా లన్నిటినీ నిర్మూలనం చెయ్యవలసిందే.


అందరిమీదా ఒకటే నేరారోపణ: "ప్రభుత్వాన్ని కూలదోసేందుకు పాశ్చాత్య రాజ్యాలతో కలిసి కుట్రలు."

రుమేనియన్ రైతుపక్ష నాయకుడు, కమ్యూనిస్టులను ఎఱ్ఱసైన్యాలను దేశంనుంచి తను వెళ్లగొట్టగలనని ఆశించాడంటే, ఎవరైనాసరే, అతనికి పిచ్చెత్తిందా అనుకోక తప్పదు. కాని అతనిమీద సోవియట్లు చేసిన ఆరోపణమాత్రం అదే. ఎంత తప్పుల తడికలుగా కమ్యూనిస్టు లీ ఆరోపణ లల్లినా, రాజకార్యం చేయించే వాళ్ళు వాళ్ళవాళ్ళే గనక పని జరిగిపోటానికి లోటేమీ ఉండదు.

తర్వాత మికోలేచిక్ వంతు వచ్చింది. ఈయన రైతుపక్షం, కమ్యూనిస్టు సహకార పక్షంగా మార్చుకొన్నా మన్నారు. అంటే కమ్యూనిస్టుల పక్షంగానే చేసేసుకొన్నారన్న మాట.

ఈ పద్ధతే జెకోస్లోవాకియాకు పాకింది. బెనిష్ అధ్యక్షుడు, విదేశాంగమంత్రి మసారిక్ వీళ్ళకు మనశ్శాంతి ఉంటుందని ఇకఅనుకోలేము.

హిట్లరు పెట్టిన 'ఆర్య' జాతి ప్రవాహంలోనుంచి యూరప్ బైటపడదే గాని, మరల రక్తవర్ణ (Red) నియంతృత్వ హిమప్రళయంలో మునిగిపోతోంది. విడి వ్యక్తులూ, విడిదేశాలూ కూడా, కాలగమనానికి బలి ఐపోతున్నారు.



హిట్లర్

ఎ. ఐ. సి. సి. సమావేశం

శ్రీ సీతంరాజు సుబ్రహ్మణ్యశర్మ

భారతదేశమునకు జాతీయ కాంగ్రెస్ చేసిన మహత్తరసేవను తగినంతగా ప్రశంసించుటకు మాటలు చాలవు. గత 60 సంవత్సరములనుండి దేశభక్తులందరు, ఇతరభేదాభిప్రాయములను విస్మరించి, స్వాతంత్ర్యసిద్ధికై కాంగ్రెస్ ఆదేశానుసారము కృషిచేసి, జయము గాంచినారు. కాంగ్రెస్ చిరకాలవాంఛితమగు స్వాతంత్ర్యము లభించినది; పరదాస్యబంధముల నుండి భారతమాతకు విముక్తి కలిగినది; మనలనుండి విడిపోవనెంచిన దుర్భోధితులగు సోదరులకు హృదయపూర్వకముగా వీడ్కోలిచ్చితిమి; కాని మన సోదరులు మన ఔదార్యమును అపార్థము చేసుకుని తాము తికమకలపడుతూ మనలను యిబ్బంది పెడుతున్నారు. ఇది ఇటుండగా దేశములో సామాన్య మానవుని జీవితము దినదినము దుస్సహమై పోతున్నది. దేశమునకు రాజకీయ స్వాతంత్ర్యము లభించినదిగాని, సామాజిక, ఆర్థికస్వాతంత్ర్యము, సమానత్వము, న్యాయము ఇంకను ఏర్పడవలసియున్నవి. దేశభక్తులందరు, ఇదివరకటికన్న మిన్నగా ఐక్యతతో తీవ్రకృషిచేయవలసిన అవసరమునందరు గుర్తించియే వున్నారు. అతిప్రాముఖ్యములగు ఇట్టి విషయములను దీర్ఘకాలిక దృష్టిగతో ఆలోచించి నిర్ణయించుటకు ప్రజాప్రతినిధుల సభయగు ఎ. ఐ. సి. సి. ఢిల్లీలో సమావేశమైనది. దేశము స్వాతంత్ర్యము నొందిన తరువాత ఎ. ఐ. సి. సి. సమావేశమవటం ఇదే ప్రథమం. అందువలనకూడా ఈ పేశమునకు మరింత ప్రాముఖ్యత వున్నది.

* * *

ఎ. ఐ. సి. సి. సమావేశములోని అతి ముఖ్య ఘట్టము అధ్యక్షుడు ఆచార్యకృపాలనీ రాజీనామా నివ్వటం. ఎ. ఐ. సి. సి. సమావేశమును ప్రారంభిస్తూ ఆచార్యకృపాలనీ చేసిన మహోపన్యాసం వంటిది భారతదేశం ఆగష్టు 16 వ తేదీ తరువాత వినియుండలేదు. కాంగ్రెస్ ప్రజల సంస్థ. కాంగ్రెస్‌సంస్థలో అతి ప్రధానమైన వ్యక్తి అధ్యక్షుడు. ఇప్పటివరకు కూడా కాంగ్రెస్ అధ్యక్షుడు భారత ప్రథమ పౌరుడుగా గౌరవింపబడుచున్నాడు. అటువంటివ్యక్తిలో ఈ దేశంలోని ప్రజలలో అత్యధికసంఖ్యాకుల మనోభావాలు ప్రతిఫలిస్తూ వుండవలసివున్నది. మొన్న ఎ. ఐ. సి. సి. సమావేశంలో ఆచార్య కృపాలనీ చేసిన మహోపన్యాసములో ఆయన భారత ప్రజలందరి మనస్సులను బాధిస్తున్న సమస్యలను ఉన్న వున్నట్లుగా ప్రజాప్రతినిధులకు తెలియజేసి, వాటికి సరియైన పరిష్కారము సూచించవలసిన బాధ్యత వారిపై నున్నదని జ్ఞప్తికితెచ్చి, తన విధ్యుక్తధర్మమును నెరవేర్చుకున్నారు.

ఆచార్యకృపాలనీ రాజీనామా నివ్వటానికి చెప్పగలిగినది ఒక్కటే కారణం. కేంద్రప్రభుత్వంలోవున్న కాంగ్రెస్‌నాయకుల వ్యవహార ధోరణితో ఆచార్య కృపాలనీ ఏకీభవించలేకపోయినాడు. కేంద్రంలో పండిట్ నెహ్రూ నాయకత్వమున నడుస్తున్న ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమని జగత్తునందంతటా మారుమ్రోగిపోతున్నది. కాని, ఆ ప్రభుత్వంలో కాంగ్రెస్ వాదులు సగానికి సగం మాత్రమే వున్నారు. ఆ ప్రభుత్వవిధానాలు కాంగ్రెస్ అధ్యక్షునికి కూడా తెలియటంలేదు. ప్రజలమధ్యకు వెళ్లి కాంగ్రెస్‌ప్రభుత్వ చర్యలను సమర్థించవలసిన నాయకులు, ఆ విధానములను ఏర్పరచకపోవటమేగాక, ప్రజలకన్న ముందుగా తెలుసుకొననైనా లేకపోతే, వారు ఏమి చేయగలరు? కాంగ్రెస్ ప్రభుత్వవిధానాలు కాంగ్రెస్ సర్వాధికారికే తెలియకుండా వుండవచ్చుననటం సమంజసమేనా? అని ఆచార్య కృపాలనీ, ఆయనతో ఏకీభవించేవారూ అంటున్నారు. ఆచార్య కృపాలనీతో ఏకీభవించలేనివారు ఇంకొక విధంగా వాదిస్తున్నారు. కాంగ్రెసుప్రభుత్వాలు అనుసరించవలసిన విధానాలు నిర్ణయించటానికి కాంగ్రెసుకు హక్కున్నమాట వాస్తవమే. కాని దైనందిన వ్యవహారములలో, తననుపంపించిన మంత్రులను నమ్మి, వారికి సంపూర్ణస్వాతంత్ర్యం యివ్వలేమా? ప్రతిపనికీ వారు కాంగ్రెసు కార్యవర్గాన్ని, అధ్యక్షుని సంప్రదిస్తూ వుంటే ప్రభుత్వం అంటూ వేరే వుండటం ఎందుకు? బ్రిటనులో ఇప్పుడు అధికారంలోవున్న కార్మికపక్షు విధానాన్ని ఉదహరిస్తూ, వీరు తమ వాదనను సమర్థించుకో జూస్తుంటారు. అందువలన కార్మికపక్షం, కార్మికపక్షుప్రభుత్వాల మధ్య వుండే సంబంధాన్ని గురించి కొంచెం పరిశీలించవలసియున్నది.

* * *

బ్రిటన్‌లోని రాజకీయపక్షము లన్నిటిలోను కార్మికపక్షము సుసంఘటితము. కార్మికపక్షు ఆదేశాలను సభ్యులు, ఇతర అనుబంధ సంస్థలూ తు. చ. తప్పకుండా అనుసరించవలసిందని ఆదేశిస్తూ 1929 వ సం. వార్షికసమావేశంలో తీర్మానింపబడినది. అప్పటినుండి ఈ నిబంధన నిష్కర్షగా అమలు జరుగుచున్నది. కార్మికపక్షు కార్యవర్గం అధికారపూర్వకంగా నిర్ణయించిన విధానమునుండి కొంచెమైనను వేరుగా వ్యవహరించుటకు సభ్యులకు అవకాశము లేదు. కమ్యూనిస్టులు, తదితర అతివాదులతో సంబంధము లేర్పరచుకొనవలెనని అపేక్షించే కార్మికపక్షుసభ్యులకు ఈ నిబంధనలు ఎంతో కష్టమును కల్గించినవి. ఈ కారణంవల్లనే 1931 వ సం. స్వతంత్ర కార్మిక పక్షం, కార్మికపక్షంనుండి విడిపోవలసివచ్చినది. 1937 వ సం॥లో ఫ్రాన్సులో లియోబ్లుం నాయకత్వమున రాడికల్స్, సోషలిస్టులు, కమ్యూనిస్టులు ఒకపక్షంగా ఏర్పడినప్పుడు బ్రిటన్‌లోని కార్మికపక్షుసభ్యులు కూడా అటువంటి 'అతివాద ఐక్యపక్షము'ను ఏర్పరచవలెనని భావించారు; కాని కార్మికపక్షు కార్యవర్గం ఒప్పుకోలేదు. తరువాత సోషలిస్టు లీగ్‌ను స్థాపించి సర్ స్టాఫర్డ్ క్రిప్స్‌వంటివాడు పక్షంనుండి వెళ్లగొట్టబడినాడు. 1938 వ సం॥లో మ్యూనిక్ ఉదంతం తరువాత, ఛాంబర్లేన్‌కు వ్యతిరేకంగా, లిబరల్‌పక్షంతో కలసి ప్రతిఘటన జరపాలని కార్మికపక్షు పార్లమెంటుసభ్యులు చాలమంది కుతూహలపడినారు. కాని కార్మికపక్షు కార్యవర్గం వప్పుకోలేదు. కార్మికపక్షు విధానాలన్నీ కార్మికపక్షు కార్యవర్గం, పార్లమెంటులో కార్మికపక్షు కార్యవర్గం, ట్రేడ్‌యూనియన్ కాంగ్రెస్‌కౌన్సిల్‌లు సంయుక్తంగా సమావేశమై నిర్ణయించవలసియున్నది. ఈ విధంగా 1938 వ సం॥లో ఈ మూడు కార్యవర్గాలు సంయుక్తంగా సమావేశమై జకోస్లవేకియా పట్ల ఛాంబర్లేన్ వైఖరిని ఖండించాయి. లిబరల్‌పక్షంతో చేతులు కలపాలని 1939 వ సం॥లో సర్ స్టాఫర్డ్ క్రిప్స్‌చేసిన ప్రచారమంతా ఇందువలననే వృథాఅయిపోయి, ఆయన కార్మికపక్షంనుండి వెళ్లగొట్టబడి, తిరిగి చేరవలసి వచ్చింది.


బ్రిటిష్ పార్లమెంటులో ఒక ఆచారం వుంది. ప్రతికూలపక్షునాయకుడు తమ పక్షంలోని ఒక ప్రముఖయువకసభ్యుని మొదటివరుసలో కూర్చొనవలసిందని ఏర్పాటుచేస్తాడు. మొదటి వరుసలో మాజీమంత్రులు మొదలగు ప్రతికూలపక్షంలోని ముఖ్యసభ్యు లెవ్వరూ కూర్చోరు. 1939 వ సం॥లో క్రిప్స్ కార్మికపక్షంనుండి వెడలగొట్టబడకముందు ఆయన ఆ స్థానంలో వుండేవాడు. ఆయన వెళ్లగొట్టబడినతరువాత ఆ స్థానంలో ఎవ్వరు కూర్చోవాలన్న ప్రశ్న వచ్చినప్పుడు, కార్మికపక్షు నాయకుడు, ప్రతికూలపక్షు నాయకుడుగాక, పార్లమెంటులో కార్మికపక్షు కార్యవర్గం ఆ నిర్ణయముచేసి, హెండర్సన్‌ను ఆ స్థానంలో కూర్చోబెట్టింది.

కార్మికపక్షం ప్రభుత్వంలో వుండగా కార్మికపక్షు కార్యవర్గానికీ, ప్రభుత్వానికీ ఎప్పుడైనా విభేదాలు వచ్చినవా అని ప్రశ్నింపవచ్చును. దైనందిన వ్యవహారములలో కార్మికపక్షం ఎన్నడూ జోక్యం కలుగజేసుకోదు. కార్మికపక్షం నిర్ణయించిన విధానమును కార్మికప్రభుత్వం ఎన్నడైనా త్రోసిపుచ్చిగాని, కార్మికపక్షు కార్యవర్గమును నిర్లక్ష్యం చేసిగాని వుండలేదు. కార్మికప్రభుత్వం తప్పు చేస్తే, కార్యవర్గం సహించదని మాత్రం ఘంటాపథంగా చెప్పవచ్చును.

* * *

ఎక్కడో బ్రిటిష్ కార్మికపక్షు ఉదాహరణ వరకు వెళ్లనక్కరలేకుండ, మన రాష్ట్రమంత్రివర్గాల సంగతి ఆలోచించవచ్చునుకదా. కేంద్రప్రభుత్వములో గొప్పనాయకు లుండవచ్చును. కాని ఎంతటి గొప్పనాయకునికన్నను కాంగ్రెస్ అధ్యక్షుపీఠము గౌరవనీయమైనది. మంత్రిపదవులలో నున్న నాయకులు, పదవులలో లేని తమతోటివారికన్న గొప్పవారమని భావించుకోగూడదని గాంధీజీ ఈ మధ్యనే మందలించినారు. కాంగ్రెస్ అధ్యక్షుని గౌరవము ఆయన వ్యక్తిగత పలుకుబడిపై ఆధారపడి వుంటుందనటం కాంగ్రెస్ చరిత్రనే కాదనటం. మన దేశంలో ఏకైక జాతీయ సంస్థయగు కాంగ్రెస్‌లో అత్యున్నతమగు స్థానమునకు ప్రతిష్ఠ ఒక వ్యక్తిపై ఆధారపడివున్నదా? ఈ రోజున రాష్ట్రాలలోను, కేంద్రంలోను నాయకులుగా వున్న వారందరూ దైవమాయచేత కొంతకాలము అదృశ్యులైపోయిన, కాంగ్రెస్ నశించిపోయినట్లేనా? కాంగ్రెస్ బలము ప్రజలపై ఆధారపడి వున్నదా, నాయకులపైననా? కాంగ్రెస్ ప్రతిష్ఠకు ప్రజలే మూలకందమని అంగీకరించిన, కాంగ్రెస్ అధ్యక్షుపీఠమునకు స్వయంసిద్ధముగా గౌరవ మున్నదనీ, కాంగ్రెస్ సభ్యులందరూ ఆ పదవిని గౌరవించి తీరవలసినదే ననీ ఒప్పుకొనవలెను.

కాంగ్రెస్‌కు అధ్యక్షునిగా డా॥ రాజేంద్రప్రసాద్‌ను ఎన్నుకొనుటవలన ఈ క్లిష్టసమస్య ఉత్పన్నమయ్యే అవకాశం తొలగిపోయింది. ఆయన కాంగ్రెస్ అగ్రనాయకులలో ఒకరు. కేంద్ర మంత్రివర్గంలోని ఇతర నాయకులు ఆయనను ఎక్కువ గౌరవిస్తారు. అందువలన కేంద్ర మంత్రివర్గము, కాంగ్రెస్ కార్యవర్గము ఎంతటి సామరస్యముతో వ్యవహరిస్తున్నవను విషయము ఇప్పట్లో తిరిగి ప్రస్తావనకు రాదు. కాని ఈ వివాదాంశము, తాత్కాలికముగా గాక శాశ్వతముగా పరిష్కరించిన బాగుండెడిది. కాంగ్రెస్ మంత్రివర్గం కాంగ్రెస్ ఆదేశాలను పాటించవలెను; అట్లు జరగటం లేదని కార్యవర్గం భావించినప్పుడు మంత్రులపై అజమాయిషీ చేయుటకు కార్యవర్గానికి అధికారం ఉండవలెను అను సూత్రాన్ని ఎంత త్వరలో అంగీకరిస్తే అంత మంచిది.



రాజేంద్రప్రసాద్

* * *

కాంగ్రెస్ భవిష్యత్తునుగూర్చి ఎ. ఐ. సి. సి. అతి ముఖ్యమగు తీర్మానము చేసినది. ఇదివరకు కాంగ్రెస్ ప్రధానాశయముగా నున్న జాతీయ స్వాతంత్ర్యము లభించినది. అందువలన కాంగ్రెస్ భవిష్యత్కార్యక్రమము ఇప్పుడు నిర్ణయించవలసి యున్నది. కాంగ్రెస్ లక్ష్యములను నిర్వచిస్తూ ఒక తీర్మానము చేయబడినది. ప్రతి వ్యక్తికి తిననిండి, కట్ట బట్ట సమృద్ధిగా లభించునట్లు ఆర్థిక, సామాజిక సమానత్వము, న్యాయములపై ఆధారపడివుండి, ప్రతివ్యక్తి తనచేతనైనంత ఉచ్చస్థితికి వచ్చుటకు అవకాశ మిచ్చు వాస్తవిక ప్రజాస్వామ్య రాజ్యస్థాపనే కాంగ్రెస్ ఆదర్శమని ఎ.ఐ. సి. సి. ఉద్ఘాటించినది. కాంగ్రెస్ కార్యక్రమమును విపులీకరించి వివరించుటకు ఒక ప్రత్యేకఉపసంఘము ఏర్పాటుచేయబడినది.

సంస్థానాలలో వెంటనే బాధ్యతాయుత ప్రభుత్వము నేర్పాటుచేయవలెనని మరొక తీర్మానము చేయబడినది.

ప్రత్యేకసంస్థలు తమ సభ్యులకు శిక్షణ నిచ్చి, సంఘటితపరచుకొనుటను నిరసిస్తూ వేరొక తీర్మానము చేయబడినది. ప్రజాస్వామ్యమును గురించి ఇతరప్రచారము జరుగుచున్న ఈరోజులలో ఈ తీర్మానమంత సమంజసముగా లేదు. తమతమ సభ్యులను సంఘటిత పరచుకునే హక్కు కాంగ్రెస్‌కెట్లో, తదితర సంస్థలకు అట్లేవున్నది. కాంగ్రెస్ ప్రజలలో తన పలుకుబడిని నిలబెట్టుకొనవలెనన్న తన విధానములవలన ప్రజలకు సంతుష్టి కలిగించవలెను. అంతేగాని ఇతర సంస్థల విషయంలో జోక్యం కల్గించుకోవటం మంచిదికాదు.

అల్పసంఖ్యాకులు శాంతి భద్రతలతో సౌఖ్యప్రదముగా జీవించుటకు తగు ఏర్పాట్లు చేయవలసినదని కాంగ్రెస్ రెండు అధినివేశములను కోరినది. ఇప్పుడు మారిపోయిన జనాభాను వారి యిష్టమునకు వ్యతిరేకముగా తిరిగి పంపించివేయటం అసంభవం. కాని ఇప్పటికింకా మిగిలివున్నవారికైనా తగు రక్షణలు వుండవలెనని కోరటం కాంగ్రెస్ చేయగల్గిన కనీసకృత్యము. ఈ తీర్మానమును పాకిస్థాన్ ఎంతవరకు ఆదరించునో చూడవలసి యున్నది.

అన్ని పదార్థములపైనను కంట్రోల్ తొలగించవలసిందని ఎ. ఐ. సి. సి. మరొక తీర్మానము చేసినది. ఈ విషయమై గాంధీజీ చాల [illegible] కంట్రోల్స్ అన్నీ, డిసెంబరు నెలాఖరులోగా తొలగించే సూచనలు అప్పుడే కనిపిస్తున్నవి.

ఎ. ఐ. సి. సి. సమావేశం రహస్యంగా జరగటంవలన చర్చల వివరాలు ఏమీ తెలియలేదు. ఆచార్య కృపలానీ రాజీనామావలన ఉత్పన్నమైన సమస్యను ఏ. ఐ. సి. సి. ఏవిధముగా నిర్ణయించినది తెలియదు. అతి ప్రాముఖ్యతగల ఈ సమావేశాన్ని గురించి, వివరాలేమీ తెలియజేయకుండా తీర్మానాలు తెలియజేయటం ఆశ్చర్యకరంగా వున్నది.

భారత రాజకీయాలు

స్వతంత్ర భారతప్రథమ బడ్జెట్ అధినివేశ శాసనసభలో ప్రవేశపెట్టబడినది. 1947 వ సం. ఆగస్టు 15 వ తేదీనుండి 1948 వ సం. మార్చి 31 వ తేదీవరకు గల 7½ నెలల కాలములో భారతదేశ ఆదాయము రూ. 171 కోట్ల 15 లక్షలనీ, వ్యయం రూ. 197 కోట్ల 39 లక్షలనీ అంచనా వేయబడినవి. కొద్ది మొత్తము కొత్తపన్నువలన రాబట్టుకొనవలెనని ఉద్దేశించుండటంవలన లోటు మొత్తం రూ. 24 కోట్ల 59 లక్షలు వుంటుంది. ఈ బడ్జెట్‌లో చూపబడిన అంచనాలు చాలవరకు ఊహామాత్రములే నని చెప్పవలెను. కాందిశీకులకు సౌకర్యములేర్పాటుచేయుటకు, దేశ రక్షణకు ఎంత మొత్తము ఖర్చగునో తెలియదు. కాందిశీకుల కొరకు ప్రత్యేకింపబడిన సొమ్ము ఏమూలకూ చాల దన్న విషయం విశదమే. దేశరక్షణకు, పౌరసైన్యము చేర్పరచి, వయోజనులందరికి ఆయుధశిక్షణ నివ్వవలసిన అవసరమును నాయకులందరు గుర్తించిరి. ఇట్టి తరుణమున ప్రభుత్వపు ఖర్చు ఇంతకన్న పెరిగిపోవుట సహజము. అప్పుడు బడ్జెట్ లోటు మరింత పెరుగుతూ వుంటుంది కాబట్టి ఈ 24 కోట్ల రూ. ల లోటును అదనపుపన్నులతో భర్తీ చేయుటకు మంత్రిగారు ప్రయత్నించి వుండవలసినది. భారతప్రభుత్వమునకు అర్థికరంగములో అన్ని విషయాలలోను సలహాదారులు ధనికవర్గమునకు చెందినవారే అవటంవలన ప్రభుత్వ అగ్రనాయకులు చెపుతున్న విధానాలు కార్యరూపం దాల్చుటకు అవకాశం లేకపోతున్నది. రిజర్వుబ్యాంకు డైరెక్టర్లందరు ధనిక వర్గమునకు చెందినవారే కావటం వలన, గత బడ్జెట్‌లోని పన్నుల విధానమును వారు నిరసించిరని అధినివేశ శాసనసభ్యులే భావించుచున్నారు. ఈ నాడు వస్తువుల ఉత్పత్తి తగ్గిపోవుటకు అధిక పన్నులే కారణం కానేకాదు; ధనికులకు వ్యాపారస్థులందరివద్ద పన్ను చెల్లించ నక్కరలేని బ్లాక్ మార్కెట్ డబ్బు మూలుగుచున్నది. దేశంలో మతకలహములు చెలరేగుతూ వుండటమూ, రవాణా సౌకర్యములు సరిగా లేక పోవడమూ, ముడిపదార్థములు, యంత్రసామగ్రి సరిగా దొరకక పోవటమూ యజమానులకు — కార్మికులకు వివాదాలు సంభవిస్తూండటము మొదలైన కారణాలవలన ఉత్పత్తి తగ్గిపోవుచున్నదని మంత్రిగా రంగీకరించిరి. అయితే ఉత్పత్తిని అధికము చేయుటకు పన్నులు తగ్గించవలెనని ఎందువలన ఆయనకు తట్టినదో తెలియదు. భారత ప్రభుత్వము ఎన్నో ఖర్చులను చేయవలసియున్న ఈ సమయములో పన్నులు తగ్గించవలె ననటం చాలమందికి నచ్చడంలేదు: పన్నులు తగ్గించి ప్రభుత్వం ఋణాలు ఎక్కువ చేయవలెనని మంత్రిగారి ఉద్దేశ్యం. ప్రభుత్వం ఋణాలు ఎక్కువ చేసినకొద్దీ, ఏటేటా ప్రభుత్వం చెల్లించవలసిన వడ్డీమొత్తం పెరిగిపోయి చివరకిది ఒక బండబరువుగా పరిణమిస్తుంది. అయితే, ఆ ఋణపత్రాలు కొనగల ధనికులకు మాత్రం ప్రతిసంవత్సరమూ ఆదాయం ముట్టుతుంది. మొత్తంమీద షణ్ముఖంచెట్టిగారి బడ్జెట్ ధనికులకే ఎక్కువగా అనుకూలముగా నున్నదని చెప్పక తప్పదు.

* * *

భారత ప్రజలను ధైర్య, స్థైర్యవంతులుగాజేసి, తమ దేశరక్షణ కన్నివిధముల సహాయపడగల్గుటకు వీలుకలిగించుటకు భారత ప్రజలందరికీ సైనికశిక్షణ నిచ్చి, జాతీయపౌర సైన్యమును ఏర్పాటు చేయవలసిందని ప్రభుత్వమును కోరుతూ డా. పట్టాభిసీతారామయ్యపంతులుగారొక తీర్మానమును అధినివేశ శాసనసభలో ప్రతిపాదించిరి. అధినివేశ శాసనసభ యిప్పుడు సర్వస్వతంత్రమైనది. అందువలన ఆ సభలో ఆమోదించిన తీర్మానమును అప్పుడధికారములో నున్న ప్రభుత్వము శిరసావహించి తీరవలసినదే. అందువలన ఈ తీర్మానము ఈ విషయమై భారత ప్రభుత్వమున కాదేశ మిచ్చుచున్నదని చెప్పటం సమంజసము. స్వతంత్రభారత సర్వస్వతంత్ర శాసనసభ, బాధ్యతాయుతముగా పరిపాలిస్తున్న ప్రథమ ప్రభుత్వమునకు జాతీయ పౌరసైన్యమును గురించియే ప్రథమ ఆదేశ మిచ్చుట గమనింపదగిన విషయము. ఈ తీర్మానముపై జరిగిన చర్చకు సమాధానమిస్తూ, రక్షణశాఖమంత్రి బలదేవ్ సింగ్, భారతదేశంలోని యువజనులందరికీ సైనిక శిక్షణ నిచ్చే విషయమై ప్రభుత్వం కొన్ని పథకాలు తయారుచేస్తున్నదని చెప్పారు. దేశంలో వున్న విద్యార్థులలో 15 నుండి 21 సం. ల వరకు వయస్సుగలవారందరికీ సైనిక శిక్షణ నిచ్చుటకు ముందు రూ. 21 కోట్లున్నూ, తరువాత ప్రతి సంవత్సరమూ రూ. 15 కోట్లున్నూ ఖర్చగును. కాని మనదేశములో విద్యార్థుల సంఖ్య చాల తక్కువ. ఒక్క విద్యార్థులకు మాత్రమే సైనిక శిక్షణ నిచ్చిన చాలదు. యువకులందరికీ సైనికశిక్షణ నివ్వవలసియున్నది. అందుకొరకు ఖర్చు మాత్రము చాల ఎక్కువ అగును. ఈ ఖర్చు మొత్తమును బట్టి ఖజానా శాఖామంత్రి పన్నులను నిర్ణయించవలెను. అంతేగాని ఆదాయమునుబట్టి, రక్షణఖర్చు నిర్ణయింప కూడదు. ఆదాయమునుబట్టి ఖర్చును సవరించుకుంటామంటం వ్యక్తులకు ఏవిధంగా అవసరమో, అదేవిధముగా వ్యయమునుబట్టి ఆదాయమును సవరించుకుంటామంటం ప్రభుత్వమునకు సమంజసము. ప్రజలందరికి సైనిక శిక్షణ నిచ్చు విషయంలో నిర్దిష్టమగు ప్రణాళిక లింకను ఏర్పరుపబడలేదు. కొన్ని రాష్ట్రములలో నేషనల్ గార్డ్సును ఏర్పాటు చేయుటకు ప్రయత్నములు జరుగుచున్నవి. ప్రజా కివ్వవలెనని భావించిన సైనిక శిక్షణను గురించి ఒక నిశ్చితాభిప్రాయమునకు వచ్చి, అందుకు రాష్ట్రప్రభుత్వములు ఎంతవరకు బాధ్యత వహింపవలెనో నిర్ణయించి, త్వరలోనే కార్యాచరణకు పూనుకొనుట కేంద్రప్రభుత్వ విధి.

* * *

హైదరాబాద్ సంస్థాన ప్రతినిధులతో ఇన్నాళ్ళనుండి జరుగుచున్న సంప్రదింపుల ఫలితంగా ఈనాటి కొక ఒడంబడిక కుదిరినది. ఈ ఒడంబడిక ఇదివరకు ఛత్తారీనవాబు కుదిర్చిన ఒడంబడికకు నకలే నని సర్దార్ పటేల్ చెప్పినాడు. ఆగస్టు 15 వ తేదీని సార్వభౌమత్వం అంతరించి పోకమునుపు రాజప్రతినిధికి నిజాంకువున్న సంబంధబాంధవ్యములు ఇకముందు భారతప్రభుత్వమునకు, నిజాంకు వుండగలవు. రక్షణ, రాకపోకలు, విదేశవ్యవహారములలో సర్వాధికారములు భారత అధినివేశమునకు వప్పజెప్పబడినవి. విదేశములలో ప్రతినిధులను నియమించుకొనుటకు నిజాంకు అధికార మివ్వబడినది. అయితే వారు వాణిజ్యమును గురించి మాత్రమే శ్రద్ధవహిస్తారు, వారి కార్యక్రమమంతా ఆప్రాంతములోని భారతప్రభుత్వ ప్రతినిధికి తెలియజేయబడుతూవుంటుంది. పాకిస్థాన్‌లో ప్రతినిధిని నియమించకుండా వుంటానికి నిజాం అంగీకరించినాడు. ఇటువంటి ప్రతినిధులు నిజాంకు ఇప్పుడే వున్నారు. అందువలన ఇది అంత పెద్దగా గమనించవలసిన విషయం కాదు. ఆయుధాల విషయంలో కూడా నిజాం ఆట చాలవరకు కట్టినట్లే. ఆయన కోరిన ఆయుధములు, న్యాయతః అవసరమని తోచినచో భారత ప్రభుత్వం సరఫరాచేస్తుంది; భారత ప్రభుత్వం సరఫరా చేయకపోతే, భారతప్రభుత్వానికి తెలియపరచి విదేశాలలో నిజాం కొనుక్కొనవచ్చును. అంతరంగిక శాంతి రక్షణకు నిజాంసేన ఏవిధంగా ఉపయోగపడుచున్నదీ మనకు అనుభవమున్నది. దోషుల పక్షం వహించి, నిర్దోషులను మరింత పీడించుటమే నిజాంసేన కర్తవ్యమైనచో, వారి కాయుధములిచ్చి మరింత బలపరచటం కీడే. నిజాంసేనలో వివిధ వర్గముల వారిని జేర్చుకొనే విషయమై సమంజసమైన ఏర్పాట్లు చేయవలెను. విదేశస్థులగు అరబ్బులను, పఠానులను సేనలో జేర్చుకొనకూడదు. సేనలోను, పోలీసు దళములోను హిందువులకు వారి సంఖ్యాబలమునకు తగినంత స్థాన ముండవలెను. ఇది జరగనంతవరకు నిజాంకు ఆయుధసామగ్రి నిచ్చుట అచ్చటి ప్రజలకు ద్రోహ మొనర్చుటయే. ఇప్పుడు భారత దేశమునకు విదేశ నాణెముల నిలువ చాల తక్కువగా నున్నది. ఉత్పత్తి నధికము చేయుటకు కావలసిన యంత్రసామగ్రి, జీవితాధారమగు ఆహారము దిగుమతి చేసుకొనటకే విదేశ నాణెములు లేనపుడు నిజాంకు విదేశముల నుండి ఆయుధములు తెప్పించి యివ్వటమనే ప్రశ్నయేలేదు. మనదేశములో తయారైన సామగ్రికూడ భారత సైన్యమునకు, పౌరసైన్యమునకు సరిపోగా మిగిలినతప్ప నిజాంకు యివ్వకూడదు. ఇప్పుడు నిజాంతో చేసుకున్న ఒడంబడిక ఒక సంవత్సరకాలమే అమలులో వుంటుంది. ఈ సంవత్సరంలోపలనే నిజాం భారత యూనియన్‌లో జేరిపోవలెను. లేకపోయినచో, భారత యూనియన్‌లో జేరిన ఇతర సంస్థానములకు కష్టము కలిగితీరును. సంస్థానమునుండి భారత సైన్యము నుపసంహరించినను, సంస్థాన అంతరంగిక కల్లోలములవలన సరిహద్దున నున్న భారత రాష్ట్రముల శాంతికి భంగం వాటిల్లగల దని భారత ప్రభుత్వం భావించినప్పుడు, సంస్థానములోనికి సేనలను పంపుటకు భారత ప్రభుత్వమునకు అధికార ముంచియుండవలసింది. ఈ విషయమై ఇకముందు సంప్రదింపులలోనైనా భారత ప్రభుత్వం శ్రద్ధ వహించవలెను. సంస్థానములో బాధ్యతాయుత ప్రభుత్వము నేర్పాటు చేసే విషయమై భారత ప్రభుత్వం నిజాంకు హెచ్చరించినట్లు కనపడదు. బాధ్యతాయుత ప్రభుత్వమను పేరుతో నిజాం చేసిన సూచనలు ప్రజాస్వామికవాది కెవ్వనికైనను నవ్వు పుట్టింపకపోవు. నూటికి 85 వంతులు ప్రజలకు, నూటికి 10 వంతుల ప్రజలతో సమానముగ ప్రాతినిధ్యమిచ్చుట కంగీకరించుట అసంభవమని సంస్థాన కాంగ్రెస్ నాయకులు స్పష్టపరచియే వున్నారు. హిందువులకు ప్రత్యేకింపబడిన నాలుగు స్థానములలో రెండు స్థానము లప్పుడే నిజాం గులాములకు కట్టబెట్టబడినవి. భారత యూనియన్‌తో ఒడంబడిక కుదిరినది కాబట్టి, ఇక తన శక్తినంతను సంస్థాన కాంగ్రెసును, ప్రజలను అణచివేయుట కుపయోగించవచ్చునని నిజాం తలంచుచుండినచో అతని ఆశ పేరాసయే కాగలదు. బాధ్యతాయుత ప్రభుత్వమును సంపాదించుటకు ప్రజలు సర్వవిధముల పోరాటము జరపవలెను. సరిహద్దులలోని ప్రజలు వీరికి తగినంత మద్దతుగా వుండి, తా మనుభవిస్తున్న స్వాతంత్ర్యము వారికి కూడ లభించునట్లు చూడవలెను. సంస్థానము భారత యూనియన్‌లో జేరు విషయమును నిర్ణయించుటకు రిఫరెండం జరపవలసిందని యైనా భారత ప్రభుత్వం కోరియుండకపోవటం శోచనీయం. శాంతి స్థాపనకను పేరిట ముస్లిం యువకులకు శిక్షణ నిచ్చి పల్లెలకు పంపుటకు ఇతెహాద్ నిర్ణయించినది. వీరి వలన ప్రజలకు ఎంతో బాధకలుగును. పోలీసులపై గాని, సైన్యముపై గాని తమ రక్షణకు ఆధారపడివుండక, అవసరమైతే వీరినుండి కూడా తమ్ము తాము రక్షించుకొనుటకు వీలైనన్ని విధముల తయారై సిద్ధముగా నుండటంకన్న నిజాం ప్రజలు చేయవలసినదేమీ లేదు.

సంస్థానమునకు ప్రధానిగా లియాక్ అలీ నియమింపబడినాడు. పారిశ్రామిక వేత్తగా ఈయన పేరు ప్రతిష్ఠలు సంపాదించినమాట వాస్తవమే గాని రాజకీయములతో ఈయనకు వున్న పరిచయమేమో తెలియదు. సంస్థాన కాంగ్రెస్‌తో సమాధానమునకు రావలెనని ఈయన ప్రయత్నిస్తున్నట్లు నటిస్తున్నాడు. సంస్థానకాంగ్రెస్ నాయకులందరు ఈ రోజు విడుదలచేయబడిరి. అయితే, సత్యాగ్రహమును విరమించి, ప్రభుత్వములో వారు చేరుతారని ఆశించనక్కరలేదు.



మద్రాసు క్రొత్త పోలీసు ఇన్స్పెక్టరు జనరల్, సి. కె విజయరాఘవన్.

కాశ్మీర్‌లో భారతసేనలు నెమ్మదిగా పురోగమిస్తున్నవి. మీర్పూర్, కొట్లీ పట్టణాలు భారత సేనల వశమైనవి. త్వరలోనే దుండగులు సాంతముగా తుడిచివేయబడెదరు.

కొండజాతులను, మాజీసైనికులను ప్రోత్సహించి యుద్ధమునకు పంపి, కాశ్మీర్ మహారాజును భయపెట్టి బలవంతముగా పాకిస్థాన్‌లో జేర్చుకోవలెనని పన్నిన కుతంత్రం నిష్ఫలమై పోవటం కాశ్మీర్‌కు పాకిస్థాన్ నీళ్ళు వదులుకొన్నది. కాని ఆశచెడ్డది. కాశ్మీర్ పాకిస్థాన్‌లో జేరటానికి ఇంకేమైనా అవకాశము లుంటాయేమో నని పాకిస్థాన్ ప్రయత్నించి చూస్తున్నది. రిఫరెండం అంటే కట్టి బూటకమే కదా అని బుకాయించిన లియాకత్అలీఖాన్, అంతర్జాతీయ ముఖ్యవర్గుల పర్యవేక్షణక్రింద రిఫరెండం జరపవలసిందని కోరుతున్నాడు. కాశ్మీరునుండి భారతసేనల నుపసంహరిస్తే, దుండగుల నుపసంహరిస్తామని చెప్పి, తమ గుట్టును తప్ప కక్కించుకున్నాడీయన. భారత సేనలనన్నిటినీ ఒక గడువులోగా ఉపసంహరించవలెనని ఈయన కోరినదానిని భారత ప్రభుత్వం ఏనాటికీ మన్నించదు. కాశ్మీర్‌లో సంపూర్ణ ప్రశాంతత ఏర్పడిన దని కాశ్మీర్ ప్రభుత్వం భావించినప్పుడు, పాకిస్థాన్ ప్రమేయంలేకుండానే, భారతసేన లుపసంహరింపబడును. కాశ్మీర్ భవిష్యత్తును గురించి కాశ్మీర్, భారత యూనియన్, పాకిస్థాన్ అగ్రనాయకులు సమాలోచనలు జరుపుచున్నారు. ఈ సమాలోచనలో ముఖ్య స్థానము కాశ్మీర్ ప్రతినిధులకు యివ్వబడవలెను. కాశ్మీర్‌లో రిఫరెండం జరగవలెనో, ఎన్నికలు జరుగవలెనో నిర్ణయించవలసిన బాధ్యత భారత యూనియన్, పాకిస్థాన్‌లపైకన్న కాశ్మీర్ ప్రభుత్వముపైననే ఎక్కువ వున్నది. ఎన్నికలకైనా రిఫరెండంకైనా భారత ప్రభుత్వం సిద్ధంగానే వుందికాబట్టి, కాశ్మీర్ ప్రభుత్వాభిమతం ప్రకారం నడుచుకోవటం సమంజసం.

* * *

హరిజనోద్ధరణకు గాంధీజీ కంకణం ధరించినప్పుడు ఆయనకు ప్రత్యర్థిగా తమ చేతికిందవుండి నిమ్నజాతుల తరఫున 'నేను' అని మాట్లాడుతూ వుండటానికి బ్రిటిష్ ప్రభుత్వం డా. అంబేద్కర్‌ను లాలించి, దగ్గరకుతీసింది. తనవంటి స్వార్థపరులకు కొందరికి తప్ప మరెవ్వరికీ తాను ప్రాతినిధ్యం వహించటం లేదని ఆయనకు తెలిసినా, తన మాటను బొనటానికి ప్రభుత్వం వున్నది కాబట్టి తానేమిచేసినను చేయవచ్చు నని భ్రమపడి, చివరకు వారిచేతిలోని ఆటబొమ్మగా తయారై అనేక ప్రభుత్వ హోదాలను రుచిమాచాడు. డా. అంబేద్కరు అర్థిక శాస్త్రంలో డాక్టరు పట్టా పుచ్చుకున్నా, ఏ ఎండకా గొడుగు పట్టటం ఆయనకు బాగా అబ్బింది. పరిస్థితులు తారుమారై బ్రిటిష్‌వారు వైదొలగుతున్నారని గ్రహించినంతనే ఆయన కాంగ్రెసును బలపరుస్తూ రాజ్యాంగపరిషత్తులోను, చివరకు భారత ప్రభుత్వంలోను స్థానం సంపాదించాడు. కాని

20 వ పేజీ చూడుడు

గొప్పవారితో గుసగుసలు

అల్లసాని పెద్దన

కీ॥ శే॥ శ్రీ వారణాసి శ్రీనివాసరావు

[హంపీ — మాతంగపర్వతంమీద నున్న ఆలయం డాబామీద కూర్చుని నేను పద్యాలు చదువుతూంటా. క్రింది పద్యం నాల్గవపాదం చదువు చుండగా పెద్దనార్యుడు పైనుండి దిగుతారు.]

నే: "హితుడవు చతురవచోనిధి
వతులపురాణాగమేతిహాసకథార్థ
స్మృతియుతుడ వాంధ్రకవితా
పితామహుడ వెవ్వ రీడు పేర్కొన నీకున్"

పె: మా పద్యమే చదువుతున్నావే.

నే: (లేచి నమస్కరిస్తూ) చదవడ మేమిటి. ఇగ్గ టనుంచి తమ కోసం తదేకధ్యానం చేస్తుంటే!

పె: ఎంత తొందరోయ్ నీకు! నీవు మంత్రం చదివి ఆహ్వానించిం దెక్కడ మేం వచ్చేటందుకు! రెంటికీ కొంచెమైనా అవకాశ ముండొద్దూ స్వర్గంనుంచి దిగి రావడానికి? అక్కడ బృహస్పతి సభలో నుండగా నీ పిలుపొచ్చె. వెంటనే వారి సెలవు పుచ్చుకుని బయల్దేరాం! ఏమిటీ వేగిరా నిక్కారణం?

నే: తర్వాత మనవి చేసుకుంటా. పినవీరభద్రయ్యగారు చెప్పారేదో కవిత్వవిషయ మక్కడ దుపన్యసిస్తారని. నే వినగూడింపైతే కొంచెం సెలవిస్తురూ. తమవంటివారితో సంభాషించడమన్నా, తమరు చెప్పేది వినడమన్నా నాకు పరమానందం.

పె: (ఆసీనులై, నన్ను కూర్చుండ నియమించి) ఏ ముందోయ్, మేం పదిమాటలవాండ్లం గాని, పది మాట్లనేవాండ్లంగాని కాం. ఏదైనా అంటే, ఆలోచించుంటామో, లేదో మాకే తెలీదుగాని, అది శిలాక్షరంలాగ శాశ్వతమైంది. ("కవిత్వమెట్లాగుండాలో చెప్పమని"అంతా అడిగితే) "బృహస్పతిగా రెదుటే"నని మేమంటే, "మీ భూలోకంలో నెట్లాగుండాలనుకుంటారో విన్నా"నని" వారంటే, "అయ్యా, తమవంటి సర్వజ్ఞుల కదిచెప్పాలా; ఐనా తమ సెలవైంది కాబట్టి చెప్తా"నని"అప్పుడు చెప్పిన ఉత్పలమాలిక చదివాం.

నే: ఏదండీ తమ కాంధ్రకవితాపితామహ బిరుదు నిప్పించిందేనా!

పె: ఔను.

నే: విని వారే మన్నారండీ, బృహస్పతి గారు?

పె: ఏమంటారోయ్? పెద్దలెవ రన్నా యేమైనా అనేట్టు మన మెప్పు డేం జెప్పా మేం జేసామోయ్? 'బాగుంది. వేమైనా అంతే చెప్పేవాండ్ల మన్నారు.

నే: వారూ అంతే చెప్పేవాండ్లమన్నారు! తమకు మల్లే శృంగారరసాన్నే పరిపించే వాండ్లమే నన్నారు?!

పె: ఏమి టీ వెర్రిప్రశ్న? మరొక రసంతో కవితాతత్త్వం దింపడమెల్లాగా? వారు దేవతలనా నీ సందేహం! దేవతలకుమటుకు శృంగారరస మంటే అభిమానం లే దనుకున్నావా?

నే: ఔనౌను. అప్సరసలు, నందనవనం వగైరా...

పె: ఇదుగో, నీకొంచెం కొంచెతెలనమున్న దనుకుంటాం! వారూ అంతే చెప్పేవాండ్ల మన్నారా అనడంలో మనకంటే వా రధికులని వ్యక్తీకరించావ్. అప్సరసలు వగైరా అనడంలో వారూవంటి వాండ్లన్నావ్. నీ వనుకుందే శృంగార రసమనుకున్నావ్.

నే: తమ మాలికలోదంతా శృంగార మైతే నేన న్నదానికంటే దే ముందండీ?

పె: అసలు మామాలిక నీ కర్థమైందీ? అనంతా వచ్చిబూ తనుకున్నావా? కవిత్వ మనుభవవేద్య మేగాని వర్ణించడానికి వీలైంది కాదని మాభావం. అనుభవవేద్య మంటే యెట్లాటిది అనేదానికి మన శరీరానుభవంలో నానందస్థాయి కందే శృంగారావస్థలాంటి దన్నాం. కేవల భౌతికానుభవమేనా అనుకోకుండా, ఆంధ్రంలో సంస్కృతం పచరించిన పట్టుల నిట్లాగుండా లన్నప్పుడు ధ్యాత్మికానంద స్థాయికూడా అంటుతూండా లనిసూచించాం. మరొక విశేష ముంది దాన్లో: భౌతికానుభవ మిట్లా గుంటుం దని అచ్చ తెలుగులో నిరూపించాం. ఆధ్యాత్మికానుభవ మిట్లా గుండా లని సంస్కృతంలో నిరూపించాం. ఇక దాన్లో పలుకుల పొంకాలు, గతుల పొంకాలు, రీతుల పొంకాలు పరస్పర ముంకువలుగా నుండా లని సూచించాం. ఈ సారస్య మంతా అంతర్గర్భితంగా నెందు కమర్చారంటే కవిత్వం గూఢతో తేటతనం గలిసుండా లని మరొక సందర్భంలో జెప్పాంగా!

నే: అబ్బా! ఇదంతా ఆ సభవారి కందరికీ అర్థమైందండీ భూలోకంలో జెప్పినపుడు?

పె: ఏమి టా ప్రశ్న? ఏదైనా ఉపన్యసించే టప్పుడు పట్టి పొడి మాటలందరికీ అర్థమౌతాయా? ఆనాడు రాయలసభలో కవులూ, పండితులూ, దొడ్డబుద్ధి అయిన వ్యవహర్తలు అనేకు లున్నారు. వా రందరికి సారస్య మంతా కాకపోయినా కొంతైనా తెలుసుంటుంది. అందరికి నన్నయభట్టన్నట్లు అక్షరరమ్యత ఆదరణీయమై వుంటుంది.

నే: అప్పుడేనాండీ, తమర్ని రాయలవారు బహూకరించింది.

పె: ఔను; నీవు పైనన్న బిరుదు, గండపెండేరం ఇచ్చారు.

నే: ఇచ్చారేమిటి? వారే స్వయంగా తొడిగారనుకున్నానే?

పె: తొడ గొచ్చినమాట వాస్తవమేగాని, మేం వారించి అందుకుని తొడుక్కున్నాం.

నే: తమ రన్నట్లా బహూకరించడ మందరికీ అంటే సభలో నెక్కువమంది, క్లిష్టమేనాండి?

పె: ఎంత క్లిష్టం నీ ప్రశ్న! సభలో నెంతమంది క్లిష్టమో ఎట్లా తేల్చేది? మీ కాలంలో లాగా చేతు లెత్తించడంగాని కాగితమ్ముక్కల మీద వ్రాయించడంగాని అప్పు డుండేదికాదు. ఏదైనా సభలో నెవరికైనా యిష్ట లేకుంటే లేచి,అడ్డం తగిలి వాదించేవారు. అప్పుడే వాక్యార్థమో, సమస్యాపూరణమో ఇత్యాది కలాపం జరిపి పదిమందీ నిర్ణయించేవారు. అట్లాటి వాదిన మేమీ జరగలేదు. ప్రభువు పండితుడు కవి. ఉన్నవాండ్లలో పల్వురు ఒకళ్ళొకళ్ళను తీసిపోయేవారు కారు. ఎవరూ అభ్యంతరపెట్టలేదు కాబట్టి మాకు స్వీకరింపక తప్పింది కాదు. ఇంతకూ మేం బిరుదులు కావా లన్నామా, పెండేరాలు కావా లన్నామా? ఏమిటో వాట్లో నే ముంది?

నే: అదేం తాతగారూ, మీ కవంటే నిరసనా?

పె: నిరసన నెట్లాగన్ను, స్వీకరించిన తర్వాత; నిర్లక్ష్య మనొచ్చు. అవి లేకపోతే నేం కవికి సమకాలంవారి గౌరవ మే మూలకోయ్. తాత్కాలికసుఖదాయకమైనా శాశ్వతసుఖమియ్యదు. వచ్చేతరాల్లో ఆంధ్రలోక మంతా గౌరవించే ఆదరంతో అట్లాటివి డెబ్భైవేల బిరుదులు, లక్ష పెండేరాలు తులతూగలేవు. వ్యాస వాల్మీకులు, కాళిదాసాది మహాకవులు, మన కవిత్రయంవారు, శ్రీనాథుడు మొదలైన మహామహులు వారి కొచ్చిన గౌరవం వారియాత్మల కెంత తృప్తిగా వుంటుందో! పైవారంతా తమ కాలాల్లో నేదో పేరుపడ్డవారేగాని తర్వాత వచ్చిన పేరే వారికింపుగా వుంటుందని నామతం.

నే: శ్రీనాథుడంటే జ్ఞాపక మొచ్చింది. వారు తమ కభిమానకవా?

పె: అభిమానకవంటే!

నే: వారి కవిత్వమంటే తమకున్న గౌరవ మితర్ల కవిత్వంమీద లేదా? అని

పె: ఆ విషయం నిర్ణయించే దెట్లా?

నే: అంతకంటే తేలికప నేముందండీ? వారి పోకళ్ళకు మల్లే పోకళ్ళు నవరించడం? వారి పద్యాలవంటి వాటినే గూర్చడం. కొన్ని కొన్ని చోట్ల వారి మాటల్నే వాడడం లోనైనవి.

పె: హలా, (కొంచెమునిండి) నీవన్న శ్రీనాథుడి పోకళ్లు, పద్యాలు, మాటలు మాలో గన్పించే మాట నిజమే కావచ్చుగాని, అట్లాటి పోకళ్ళు మేం బోలేక పద్యాల్లో యలేక మాటలు గూర్చలేక పోతే తప్ప మా యిద్దర్లో నెక్కువ తక్కువ లెట్లా నిర్ణయిస్తారు. ఒక్కొకసారి ఆయా విశేషాలు మే మనుకోకుండా దొర్లుండవచ్చు, దానికేం? కవిత్వం వాక్కుతో సంబంధించింది. మనిషిని బోలిన మనుష్యు లున్నట్లు వాక్కును బోలిన వాక్కుండకూడదు? ఇంతకు మాలో నాయా విశేషా లెట్లా వున్నాయ్? కొన్ని పట్ల వారివానికన్నా బాగున్నాయేమో? దీనికంతా కీలకం కేవలకల్పన మెవరితరం? బ్రహ్మకైన మేమో ముందు నిర్ణయించు. ఏవో అక్కరమాలిన పరిశోధనలు చేయకుండా గ్రంథాన్ని సమగ్రంగా జూచి దానిమీద స్వాభిప్రాయం దెల్పుకుని తగిందా, తగందా అని తేల్చాలికాని యెందుకోయ్ యీకుంటి సందేహాలు. మరొకటి: వారు మీ కభిమానకవా, అంటే, మిగతావారు కా రేమో ననే ధ్వనిలేదూ, మీ కాలం వాండ్ల కెందుకోయ్ యీ అనవసర ప్రయాస?

నే: అట్లాగంటే యెట్లాగండీ? అట్లాటి విమర్శ లేకపోతే భాషాప్రపంచ మెట్లా బాగుపడుతుంది; వృద్ధౌతుందండీ?

పె: (ఆశ్చర్యంతో) ఏమిటే! భాషాప్రపంచమెట్లా బాగుపడుతుంది, వృద్ధౌతుందీ! ఓరి, మీ విమర్శలు బంగారంగానూ! భాషాప్రపంచ మేమిటి? ఎక్కడిదీ సవిలాసం? ఎవడు దాన్ని మొదట వాడింది? సరే వాఙ్మయం గావాడేదు! సరే! పెద్దన్న శ్రీనాథుడి పద్యాల్లాటివి ఫలానా ఫలానా వ్రాసాడు, ఫలానా ఫలానా పోకళ్ళుపోయ్యాడు. ఫలానా ఫలానా మాటలు వాడాడు అని అవన్నీ పోగుచేసి ఒక గ్రంథం చేస్తారు! దాని ఉద్దేశం అట్లా చేయకూడదు, చేసిందానికి పెద్దన బండారం బైట బడెదికదా, అమ్మ నాయనో, మనగతి యింతే ఔతుందని మిందువాండ్లంతా హడలిపోయి జాగ్రత్తపడ్తారు? ఆ విధంగా వాఙ్మయం బాగుపడ్తుందీ? అట్లా కూర్చిన గ్రంథాలవెత్తో వాఙ్మయం వృద్ధౌతుంది?! ఔరా, ఔరా యెంత కట్టు తప్పిందాంధ్రం. అవును ఏమౌతుంది.: ప్రభు వెవ్వడూ లేడూ! ఎవడికి వాడే మొనగాడైనాడు!

నే: (గుటకమింగి) తెల్లవాండ్లంతా అట్లా విమర్శిస్తారు.

పె: పై పెచ్చొకటి! ఇకనో ఇట్లా చూడు. మీరంతా వాండ్ల చదువుల్జదివితే వాళ్ళతో వాండ్ల వాఙ్మయంమీదనే దండెత్తండి మీకు పుణ్య ముంటుంది మా మీదికి రాకండి ఔరా బాగుపడడం, వృద్ధికావడం!

నే: చిత్తం. తమకు కోప మొస్తూంది.

పె: ఇదొకటి! మాకేం కోపం, మేం విస్తుబోయి కొట్టుకుంటూంటే!

నే: సరే పోనీండి. (కొంచెముండి) తాతగారూ, మనుచరిత్రను రాయలవారు రాయమన్నారా, మీరే వ్రాస్తామన్నారా?

పె: (ఆశ్చర్యార్థకంగా చెయ్యెత్తి) యివ్వేం ప్రశ్నలోయ్! అవతారికలో నేమన్నాం?

నే: దాన్లో నేమంటేనేం. కవులంతా కల్లోచ్చాయన్నా?

పె: ఎట్లా! అట్లా గే మేమూ వ్రాసుంటామనా? మీ కాలంలో అబద్ధాలాడ్డానికి జంకరనుకుంటూ. మాకేం కర్మం? మానోట అబద్ధంరాదు. రాయలవారొకనాడు సభలో రాయమన్నారు రాసాం. అంతే జరిగింది. మిగతా కవులవిషయం ఎత్తావు కాబట్టి చెప్తా విను వారికొచ్చిన కలలవిషయం. అసలా సంప్రదాయ మారంభించి నాయన తిక్కనగారు. ఆయనకు కల నిజంగా వచ్చుంటుందని నా నమ్మకం. అదెట్లానో యిప్పుడే తెలుస్తుంది. ఎవరైనా కొందరు వారూ, వీరూ అట్లా వ్రాసారుకదా. బాసుంటుందని! వాసారేమో కాని చాలామంది కవి నిజమైయుండొచ్చు. కల లెప్పుడు అభూతకల్పనలు కాలేవు. అసలభూతకల్పన సృష్టిలో లేదు. ఏదో వ్రాద్దామని సంకల్పించుకున్నవారికి "తిక్కనమహానుభావుడు: ఆయనకు హరిహరనాథుడు కనబడ్డట్టు మనకూ కనిపిస్తాడా?" అనుకుంటూ నిద్రపోతే, ఆవాంఛే చీవలు పలవలు పెట్టుకుని అతని కిడేర్నట్లు కల రాగూడదూ? అట్లా వచ్చిందంటే అసత్యం లేదుగా? ఈసందర్భంలో నే నొక్కమాట చెప్తా విను: అబద్ధీకుడని తేలిందాకా ప్రతివాణ్ణి సత్యవంతు డనుకోడం మన గౌరవానికి మనశ్శాంతికి మంచి సాధనం. ఈసూత్రాన్ని నా కన్నలొచ్చిందనే ప్రతి కవిపట్లా పట్టించు.

నే: తమరట్లాగంటే సత్యాన్నాల్లే పాటించి మాకాల లో ప్రతిసంతానాక్కలొచ్చింది. వారు ప్రత్యక్షమన్యారు, వీరు ప్రత్యక్షమయ్యారు అంటాడుగా!

పె: అన్నివోయ్, నీ కేంబ్బాధ? వాడి కర్మానవాడు పోతాడు!

నే: చిత్తం, చక్కగా చలిసెండి. మారి, తమ గ్రంథానికి, మనచరిత్రకు కాలసిద్ధాంత మెంతండి?

పె: (అచ్చెరువుతో) ఏ సిద్ధాంతం?

నే: కాలసిద్ధాంతం.

పె: ఏ శాస్త్రానికి సంబంధించింనా సిద్ధాంతం?

నే: కవిత్వానికీ కావ్యాలకూ సంబంధించింది.

పె: నాయనా, మేమూ ఏవో వేదాలు, పురాణాలూ, తరుశాస్త్రాలూ, నేర్చాంగాని వాట్లో, వాటికర్థం కాబోలు, యేమనాలి, వాటి అపరిపూర్ణప్రజ్ఞాన ప్రబోధన్లో ఈ సిద్ధాంతం తాకలే! ఏమిటది? కొంచెం విపులం చెయ్ నాయనా!

నే: నన్ను ఎక్కిరిస్తున్నారో, నిజంగా అడుగుతున్నారో తెలీలా?

పె: నాయనా, నీకన్నా యెన్నో శతాబ్దాలు పెద్దవాణ్ణి: నిన్నెక్కిరిస్తానా? నిజంగా తెలీకే అడిగా. ఆ సిద్ధాంతాన్ని మాగ్రంథానికి పట్టించడుగు; బాగా అర్థమౌతుంది చూడు.

నే: షేక్స్పియర్ మహాకవని ఆంగ్లంలో నొక మహాకవుండేవాడు. ఆయన ముప్పైయారు నాటకాలు, కొన్ని కావ్యాలు వ్రాసాడు. ఆయన కవితావిమర్శకు లా నాటకాల్లో ప్రతి నాటకాన్ని తీసుకుని దీన్లో చిత్రించిన కాల

(18-వ పేజీ చూడుడు)

కథానిక :

'దూరపు కొండలు'

"కేరా"

ఎక్కడనో, దూరాన, కొండలలో బంగారం కనిపించిందని. ఆ ప్రాంతంలో అంతా చెప్పుకుంటున్నారు. అసలే అతికష్టం మీద, గోధుమలు పండించుకు తినే ఆ కొండ ప్రజలకు గొప్ప ఆశను కల్గించింది యీ కబురు. ఎక్కడ చూచినా అదేమాట. ఇక దరిద్రం వదలిపోయిందని, బంగారము త్రవ్వి తెచ్చుకుని, తరతరాల వరకూ హాయిగా తింటూ కూర్చుందామని ప్రతివాడూ అనుకోవడం ప్రారంభించాడు. తమకున్న గుర్రాలమీద అంతా అప్పటికప్పుడే ప్రయాణాలు కట్టేసారు.

కబురు తెలుసుకుని గంగులు గుర్రంమీద యింటికి పరుగెత్తుకు వచ్చాడు. గోధుమ పంట నాటే కాలం. నెమ్మదిగా వర్షాలు ప్రారంభమవుతున్నాయ్. నేల కొంచెంగా, తడిసింది. ఇక దున్నటమే తరువాయి.

వీథిగుమ్మంలో పెద్దకూతురు రంగి, పెళ్లాం, యిద్దరూ తనకోసం ఎదురుచూస్తున్నారు. చిన్న పిల్లలు యిద్దరూ కొండపిల్లలతో ఆడుకొంటూ దూరాన నవ్వుకుంటున్నారు, ఒకళ్లను ఒకళ్లు చూచుకొని. గుర్రం దిగాడు గంగులు. పెళ్లాం భుజం పట్టుకుని సంతోషంగా "వెళుతున్నా" అన్నాడు.

"ఎక్కడికి?" అంది పెళ్లాం. పాపం కొద్దిగా చూపు ఆనదు, దగ్గరకు వస్తేకాని మనిషిని సరిగా గుర్తుపట్టలేదు.

"ఇంకా తెలియదా.... అంతా వెళ్ళిపోతున్నారు. మన ప్రాంతాలలో ఒక్కమగపురుగు కూడా ఉండటంలా "

"ఏం.... వచ్చింది.... పోయేకాలం; వాళ్ళందరికీ?" అంది.

"పోయే కాలం వచ్చింది దరిద్రానికి.... ఇన్నాళ్లకి. అదృష్టం పండింది. నీ వళ్ళంతా బంగారమే .. అమ్మాయికి ఎన్నోనగలు. మనం యిక ఎండలో, యీ రాళ్ళమధ్య కష్టపడనక్కరలేదు. ఏం కావలసివచ్చినా బంగారం పారవేసి కొనుక్కోవచ్చు" సంతోషంతో ఎగిరి గంతులు వేస్తున్నాడు గంగులు.

గంగులు భార్య మొగాన సంతోషచిహ్నాలు ఎక్కడా కనపడనేలేదు. దీర్ఘంగా, ఆలోచిస్తున్నట్టుగా నిశ్చలంగా నిలబడే ఉంది.

రంగి నోరు తెరచుకుని, తల్లి తండ్రీ వైపు చూస్తోంది. నిజానికి బంగారం ఊరికే దొరుకుతోందంటే, తెచ్చుకోవలసిందే.... కాని నాన్న తమల్ని వదలి వెళ్లిపోతాడు.... ఎక్కడికో... కొండలలోకి ...

గంగులు భార్య మాట్లాడకుండా యింట్లోకి వెళ్లిపోయింది.... తిండికి అందరికీ కంచాలు పెడుతూ "రంగీ.... అందర్నీ తిండికి రమ్మను" అని కేక వేసింది.

గంగులు యింట్లోకి వెళ్ళాడు. "ఏయ్ ...పిల్లలు, అన్నానికి రండి" అంది బయట ఆడుకుంటున్న పిల్లల్ని ఉద్దేశించి. వాళ్ళిద్దరికన్నా వయస్సులో, తను బాగా పెద్దది కానప్పటికీ, ఆ పెద్దరికాన్ని తనంతట తానే తెచ్చిపెట్టుకుని, తమ్ముళ్ళను అలా పిలవటం, రంగికి అలవాటు!

అంతా తిండికి కూర్చున్నారు. పళ్ళాన్ని వడ్డిస్తూ, గంగుల పెళ్ళాం మొగుడితో "ఏమైనా నువ్వు వెళ్ళవద్దు. మనకి బంగారం లేనంత మాత్రాన నష్టం లేదు"

"ఏం?...." మొరాయించాడు గంగులు.

"మనం యిక్కడనే సంపాదించుకుందాం. పంటకు పొలం దున్నాలి. ఇక్కడ కష్టపడితే....ఆ బంగారం మనకు యిక్కడనే దొరుకుతుంది."

తీవ్రంగా చూసాడు పెళ్ళాం వైపు. మొగం ముడుచుకొని, "నే వెళ్ళితీరుతాను....నా యిష్టం" అన్నాడు.

ఆరాత్రి ఎవళ్ళకు వాళ్లు మాట్లాడకుండా పడుకున్నారు. గంగులు దృష్టిపథంలో బంగారం తళతళ మెరసిపోతోంది. ఎంత ఉందో లెక్కలేదు. ఎక్కడ చూచినా అదే బంగారం. తను బస్తాలకొలది పోగు చేసుకుని, గుర్రంమీద వేసుకున్నట్టు, యింటికి తిరిగి రావడానికి ప్రయాణమయినట్టుగా, కూడా కలలు కంటున్నాడు.

తెల్లవారినట్టుగా, ఆయింటిలో పుట్టి పెరిగిన కోడిపుంజు తెలియజేసింది. గంగులు లేచి గుర్రాన్ని, సిద్ధపరచుకున్నాడు. రొట్టెలమూట చేతికి యిచ్చింది పెళ్ళాం. గంగులు వెళ్ళిపోయాడు. కనపడినంత వరకు తల్లి, కూతురు వెళ్ళిపోయే ఆ వ్యక్తివైపే చూస్తున్నారు....

* * *

ఆ చుట్టుపక్కల గ్రామాల నుంచి తనలాగా బయలుదేరిన తీర్థప్రజ గంగులుకు కనపడింది. ఐతే అందరికీ తెలిసిపోయిందన్నమాట. ఇరుగు పొరుగు పొలాలవాళ్లు కూడా కనిపించారు. ఒకళ్ళనొకళ్లు పలకరించుకుని ఆరుగురు కలిసి ఒక ముఠాగా తయారయ్యారు.


పైన నెత్తిమాడుతోంది. ఎక్కే కొండలు, దిగే కొండలు. అంతులేని జనప్రవాహం. కాస్తంత బంగారపు ఛాయలు కనబడితేచాలు, కొండంతా త్రవ్వినంత పని చేస్తారు. గంగులు కంటిముందు పోయిన జనం అప్పుడే కొంతప్రాంతాన్ని ఆక్రమించివేసారు. అందుచేత గంగులు ముఠా మరికొంత ముందుకు పోవలసివచ్చింది.

ప్రయాణం సాగినకొద్దీ, జనంలో ఉత్సాహం కూడా సన్నగిల్లుతోంది. దూరాన శరీరానికి సరిపోని వాతావరణం. తెచ్చుకున్నదానిలో సరిగ్గా సరిపోని తిండి. చాలామందికి ఆరోగ్యం చెడిపోయింది. ఐనా వాళ్లపట్టుదలతో, యింకా ముందుకు పోతూనే ఉన్నారు.

అదృష్టం పండింది! పెద్ద ప్రదేశంలో ముందుగా చేరుకున్న గంగులు ముఠాకు బంగారం కనిపించింది. త్రవ్వడానికి పూనుకున్నారు. ఎంతో శ్రమ అయిన పని. మట్టి ముద్దలు వాగులలో కడగటం,—అంతా కరిగిపోయి, మెరసే ఆ వస్తువును అతి ఆప్యాయంగా సంచిలో దాచుకోవడం...

అంతులేని వాళ్ళ పరిశ్రమకు, చావులేని ఆశ ఎంతో తోడ్పాటును కలిగించింది.

* * *



పాపికొండలు

(ఫొ. చి. మాదేటి సత్యనారాయణ)

గంగులు వెళ్లిపోయాక అటు పెళ్లాం, కూతురు ఆలోచించారు. ఈ సంవత్సరం పంటకు పొలం దున్నకపోతే తిండిలేక అందరూ మాడి చావాల్సిందే.

"ఎలాగే.. అమ్మా" అంది రంగి.

"మనమే కష్టపడాల"

కష్టపడాలి ..లేకపోతే జీవించటమే కష్టం. ఇంటికి ఉన్న మొగదిక్కు కాస్తా దూరమయి పోయినది. వ్యవసాయానికి కావలసిన ఆ ఒక్క గుర్రాన్ని కూడా వెంట తీసుకు పోయాడు.

చుట్టుపక్కల పొలం ఆసాములు ఆస్తిపాస్తులు వదిలి బంగారంకోసం వెళ్లిపోయారు. 'నాది' అంటూ, అన్యాయంగా ఆక్రమించి పొలం సాగు చేసుకున్నా అడ్డంవచ్చే వ్యక్తి ఒక్కడూ లేడు. సాగు చేయటం దేనితో?... మిగిలిన కోళ్లతోనా?....తల్లి కూతురు యిద్దరూ ఆలోచించారు.

"మరి ఎట్లాగు అమ్మా" అంది కూతురు.

"ఏమిటి?".

"అయ్య గుర్రాన్ని తీసుకుపోయాడుగా...."

ఒక్కసారిగా నిట్టూర్చింది తల్లి....ఉండాలి. ... ఆలోచించాలి. "ప్రక్కనున్న నరసమ్మ గారిని అడుగుదాం" అని తల్లి జవాబు చెప్పింది.

నరసమ్మగారి యింటి దక్షిణపు గోడ వర్షానికి తడిసి, నానిపోయి పడిపోవటానికి సిద్ధంగా ఉంది యింటిగోడ కట్టాలని ఆవిడ ఉద్దేశ్యం. కాని కూలీలంటూ దొరకలేదు. తనకు గోడ విషయంలో, సాయం చేస్తే తన యెద్దులను యిస్తానంది నరసమ్మగారు.

తల్లీ కూతురూ కలిసి అతికష్టంమీద వారంరోజుల్లో నరసమ్మగారి యింటికి గోడ కట్టి పెట్టారు ఆవిడ మాటప్రకారం తన రెండు ఎద్దుల్ని ఎరువుయిచ్చింది. ఆ యిద్దరు ఆడవాళ్లు ముందుగా, ఎండలో కష్టపడి. వానలో తడిసి తమ పది ఎకరాలు దున్ని విత్తనాలు నాటారు.

"అయిందమ్మా" అంది తల్లి.

నుదుటి మీద ముంగురుల్ని పైకి తీసుకుంటూ, రంగి గట్టిగా శ్వాస పీల్చింది. ఆలోచించి 'అమ్మా' అంది.

"ఆఁ ..."

"నరసమ్మగారింట్లో ఎవ్వరూ లేరు. వాళ్ళ పది ఎకరాలు మనమే దున్నుకుంటే...."

తల్లి మాట్లాడలేదు. ఆ పొలం కూడా దున్నుకుంటే బాగానే ఉంటుంది కానీ. ..

"ఏం. ..అమ్మా... మాట్లాడవ్" అంది రంగి.

"మళ్ళీ విత్తనాలు కొనడానికి డబ్బు?...."

డబ్బు కావాలి. ఎవరిస్తారు. అప్పు పొందుదామన్నా, యింట్లో చిల్లిగవ్వ కూడా కనపడలేదు. ఐదారురోజులు తల్లీ కూతురూ ఆలోచనలోనే గడిపివేశారు.

"నరసమ్మగారినే అడుగుదాం" అంది రంగి.

"ఇప్పటికే ఆవిడ ఎద్దుల్ని...."

"ఇవొక్కటేగా.... అమ్మా" అంది కూతురు.

ఈ సారి కూడా నరసమ్మగారు కాపాడిందనే చెప్పాలి. నరసమ్మగారి పది ఎకరాలు కూడా, తల్లీ కూతురు యిద్దరూ, యితరసహాయం లేకుండానే సాగుచేశారు.

కొన్ని నెలలుకూడా గడచి పోయాయ్. పంట కోతకు సిద్ధంగా ఉంది. ఐనా యింతవరకు గంగులు జాడలేదు.

ఒంటరిగానే, తల్లీ కూతుళ్ళు కలిసి కోతలు కోసారు. విపరీతంగా పండింది. జాగ్రత్తగా పంట యింటికి చేర్చుకొని, పండుగ కూడా చేసుకొని కూర్చున్నారు.

తల్లికి మాత్రం మొగుడు ఏమైపోయాడో, అనే బెంగమాత్రం పట్టుకుంది. తిరిగివచ్చే జనం కావలసినంత బంగారం తెచ్చుకుంటున్నారు. అందరీ అడిగింది కాని ఎవ్వరూ గంగులు విషయం చెప్పలేకపోయారు.

* * *

గంగులుకు అదృష్టం లేదనే చెప్పాలి. బంగారం కోసం బయలుదేరిన వాళ్ళల్లోకి అదృష్టవంతులు వాళ్ళు, లేనివాళ్ళుకూడా ఉన్నారు. ఈ కష్టపడలేని వ్యక్తులు, సంపాదనకు సులభంగా ఒకదారి త్రొక్కారు. ప్రతి రాత్రి పూటో బాగా బంగారం సంపాదించిన వ్యక్తుల మీద పడి దోచుకోవటం ప్రారంభించారు.

ఈ రకం అంతా పెద్ద గుంపు తయారయింది. గంగులు ముఠాను పూర్తిగా దోచుకున్నారు. వాళ్ళు పడిన కష్టాన్ని చూడలేరు. దయతలచి కొంత తీసుకొని, కొంతయినా వదలి పెట్టలేరు.

గంగులుకు ఏడుపు వచ్చింది. తన శ్రమ అంతా వృథా అయిపోయింది. తాను ఒంటి అనుకుంటే దేవుడు యింకొకటి చేశాడు. ఇంతకూ తమ ముఠాలో అదృష్టంగలవాడు ఒక్కడూ లేకపోయాడు.

అంతా కలిసి యింకా ముందుకు పోయారు. ఇంత వరకూ ఎవ్వరూ పోని కొండప్రదేశానికి చేరుకొని, అదృష్టాన్ని పరీక్షించారు. మళ్ళీ చిన్నగని కనిపించింది. నశించిపోయిన ఆశ మళ్ళీ అంకురించింది. ఖాళీ అయిన సంచులు మళ్ళీ పూర్తిగా నిండాయి.

కాని గంగులుకు జ్వరం పట్టుకుంది. కొండ జ్వరం. కొద్ది రోజుల్లోనే, మనిషి సగం అయిపోయాడు. తను పనిలోకి పోవటం లేదు. అప్పుడప్పుడు స్పృహకూడా తప్పిపోయేది.

తీవ్ర జ్వరముతో, గంగులు తెలివి తెచ్చుకొని చూసేసరికి, చలిగాలి చంపుకు తింటోంది. పీథులు, చిన్న చిన్న లైట్లు కనిపిస్తున్నాయ్. ఆశ్చర్యపోయాడు. తన సంచులు చూచుకున్నాడు..... లేవు .....చుట్టుప్రక్కల చూసాడు. తను చిన్న పల్లెటూరు వీథిలో పడి ఉన్నాడు.

వెధవలు....పందులు....మిత్రుడికే ద్రోహం చేశారన్నమాట, తన దగ్గరనున్నది అంతా లాక్కొని జ్వరంలో, యిక్కడ పారవేసి పోయారు. ఒక్కసారిగా బావురుమన్నాడు. ఐనా వినేదిక్కు.... చిరిగిపోయిన బట్టలు....కృశించిపోయిన శరీరం....తను బంగారంతో, లక్షాధికారి అవుదామనుకున్న గంగులేగా....గంగులు....

ఓపిక తెచ్చిపెట్టుకుని యింటిదారి పట్టాడు. తూలుతూ, లేస్తూ....

* * *

తెల్లవారింది, సూర్యుడు నెమ్మదిగా పైకి వస్తున్నాడు. రంగి గుమ్మంలో నిల్చుని తండ్రి వెళ్ళిన వైపున చూస్తోంది. దూరాన పోయనో, ఎవరో వ్యక్తి పడుతూ, లేస్తూ వస్తున్నాడు. 'ముష్టివాడు అయి ఉంటాడు' అనుకుంది,

'అమ్మా' అంది రంగి.

తల్లివచ్చి వెనకనే నిలబడింది. "ఎవరో వస్తున్నారమ్మా . . మనయింటి వైపే!".

"రానీ రమ్మా" అంది తల్లి.

జీర్ణించిపోయిన ఎముకల పోగు యింకా దగ్గరకు వచ్చింది రంగి గుర్తుపట్టింది. "అయ్యా" అంటూ ఒక్కసారిగా అరచింది. పరుగెత్తుకుపోయి తండ్రిని యింటికి చేరవేసింది.

గంగులు పెళ్లాం కళ్లవెంబడి రెండు నీటి బిందువులు రాలాయి....

"అమ్మీ" అనబోయాడు గంగులు,

మాట్లాడవద్దని యిద్దరూ సంజ్ఞ చేశారు, తిండి తిని పడుకున్నాడు గంగులు. సాయంకాలానికి కొద్దిగా సత్తువ వచ్చింది. నెమ్మదిగా లేచివెళ్లి, గుమ్మంలో కూర్చున్నాడు. పెళ్లాం కూతురు ప్రక్కకు వచ్చి కూర్చున్నారు.

"బంగారం తేలేకపోయా" గంగులు అన్నాడు,

"మన కేం వద్దు" అంది పెళ్లాం.

"ఉన్నది చాలులే అయ్యా" అంది కూతురు.

ఆశ్చర్యపోయాడు గంగులు. కూతురు వెళ్ళి నాలుగు సంచులూ తెచ్చి ముందు పోసింది. అంతా బంగారం తను అక్కడ చూచిన బంగారం.

"ఎక్కడిది! అన్నాడు" ఒక్కసారిగా....

"సంపాదించాం" అంది పెళ్లాం....

గంగులుకు అర్థం కాలా. కూతురు అంతా చెప్పింది. "ఇంకా నాలుగు గుర్రాలు, రెండు ఆవులు, మేకలు కొన్నాం....రా చూద్దువుగాని" అంది కూతురు.

అన్నీ చూసి వచ్చాడు. పెళ్లాం, పిల్లని కావలించుకుని ఒక్కసారిగా ఏడ్చాడు.

"నే చెప్పలా....మన పొలమే మనకు బంగారం. ఇక్కడ ఉన్నదాన్ని వదలి అక్కడికి పోవటం...." అంది పెళ్లాం.


గంగులు పెళ్లాం కూతురుతో, "పిల్లల్ని పిలు, తిండి తింటారు" అంది.

"ఏయ్ పిల్లలూ, తిండికి రండి" మామూలుగానే పిలిచింది రంగి.

మామూలుగా యిదివరకు యింటివద్ద తినే తిండినే ఆప్యాయంగా తిన్నాడు గంగులు....

(ఇంగ్లీషునుంచి కథాంశం)





(1) ఉదకమండల ప్రకృతి సౌందర్యం (C. G. J)




(౨) భ్రమర విలాసము (C G. J)



(2) కుసుమకోమలులు (C. G. J.)

❋



(4) పుష్పాడినాను తుమ్మెద (C. G. J.)

బాలానందం

పిల్లల నవల:



పెళ్లాడే బొమ్మ

శ్రీ సత్యనారాయణ శ్రీవాత్సవ

13

త్రానూ, తనన్నే హితులూ చేసిన భోజనాలకీ దానికీ ఒక బంగారు మొహరీ యిచ్చి, ఆ సత్రం వదలి వెళ్లిపోయాడు పినాకం. బయట బాఢ చీకటి. కన్నూ మిన్నూ కనిపించడం లేదు. దారి తడుముకొంటూ పోతున్నాడు. చుట్టు ప్రక్కల ఆకుకూడా అల్లాడటం లేదు. ఎక్కడైనా గబ్బిలాలూ, చీకటి పక్షులూ మాత్రం, కొమ్మ మీంచి కొమ్మకి ఎగురుతూ, రెక్కలతో పినాకయ్యని తాకుతూ పోతూ వున్నాయి. ఆ చీకటిలో హడలిపోయి ఏడవడం మొదలుపెట్టాడు.

ఆ రాత్రి-"ఎవరు వారు?" "ఎవరు వారు?" అని పిలుస్తూన్నట్టయింది. అలాగ చీకటిలో కాళ్లు ఈడ్చుకొంటూ పోతూవుంటే, ఒక చెట్టు కొమ్మమీద బుల్లి జంతువు కనిపించింది. అది తెల్లటిబుడ్డిలో వెలిగే దీపంలాగ మినుకు మినుకుమంటూ మెరుస్తోంది.

"ఎవరు నువ్వు"? అని పినాకయ్య అడిగాడు.

"నేను చచ్చిపోయిన బొద్దింక దెయ్యాన్ని"

ఆ మాట ఏదో లోకంనించి వచ్చే మూలుగులాగు వినిపించింది. "నీకేం కావాలి?" అని పినాకయ్య అడిగాడు. "నా కేమీ వద్దు; నీకు చిన్న సలహా చెప్పాలని వచ్చాను. ఇంటికి వెళ్లిపో, నీదగ్గర ఉన్న నాలుగు బంగారు మొహరీలయినా మీ నాన్న కియ్యి. మీ నాన్న నీకోసం ఏడుస్తూ, ఎప్పుడు చూస్తానో యని కనిపెట్టుకొని ఉన్నాడు."

"రేపటివరకు ఆగమను మా నాన్న ఎంత గొప్పవాడైపోతాడో! ఈ నాలుగు మొహరీలూ రెండువేల బంగారుమొహరీ లయిపోతాయి. అందుకే."

"నాయనా, ఒక్క రోజుతో నిన్ను భాగ్యవంతుణ్ణి చేస్తా మని చెప్పే వాళ్లని ఎన్నడూ నమ్మకు. వాళ్లు పిచ్చివాళ్లుగాని, దొంగవాళ్లుగాని అవుతారు. నామాట విని, ఇంటికి వెళ్లిపో అబ్బాయి!"

"ఊహూ, నే ముందుకి వెళ్లాలిసిందే"

"చాలా ప్రొద్దుపోయింది సుమా!"

"అయితే నేను ముందుకి వెళ్తాను"

"చీకటి రాత్రి"

"అయినా వెళ్తాను"

"చాల కష్టమైన దారి సుమా!"

"అయినా వెళ్తాను"

"చెప్పినమాట వినక తమ యిష్టం వచ్చినట్టు చేసేవాళ్లకి, ఎప్పటికైనా చేసినదానికి విచారించక తప్పదు సుమా! జ్ఞాపకం ఉంచుకో!"

"అదంతా నాకు తెలుసు. వెళ్లొస్తాను మరి"

"వెళ్లిరా; దుష్టులు, రోష్ఠులూ నిన్ను ఏమీ చెయ్యకుండా భగవంతుడు రక్షించాలని కోరుతున్నాను" అని చెప్పి, ఆ బొద్దింక వెలుగు ఆరి పోయింది. ఒక కొవ్వొత్తిదీపం, మెల్లిగా వూది ఆర్పివేసినట్టు అయింది. మళ్లీ ఎప్పటిలాగ దారంతా కటికచీకటి.

"నిజంగా పిల్లల బ్రతుకు ఎంత కష్టం! ప్రతివాళ్లూ నీతులు చెప్పేవారే! ప్రతివాళ్లూ దెప్పేవాళ్లే! ప్రతివాళ్లూ సలహా యిచ్చేవారే!" అనుకొంటూ ముందుకి సాగుతున్నాడు పినాకరావు.

"ఈ చెప్పేవాళ్లని చూస్తే, వాళ్లంతా మన తండ్రులనో, గురువులనో తోస్తుంది. ప్రతివాళ్లూ అంతే, ఆఖరికి — మాటలాడే బొద్దింకలు కూడా అంతే చూడు, ఈ బొద్దింక చెప్పినమాట విననందుకు ఎటువంటి కష్టాలు వస్తున్నాయో! ఇంతకంటె బూచివాళ్లని చూచినా భయంలేదేమో! అసలు బూచివాళ్లు అనేవాళ్లు ఎవరైనా వుంటారా? నాకు నమ్మకం లేదు. పిల్లల్ని భయపెట్టడానికి తండ్రులు ఇలాంటి బూచివాళ్లని కల్పించారేమో? రాత్రిళ్లు, పిల్లలు, బయటికి పోకుండా అదిగో బూచి అని యిలాగ చేస్తే బయటికి వెళ్లరని పోనీ, వాళ్లు కనిపిస్తారే అనుకో — నా కేం భయం? వాళ్ల దగ్గరకి వెళ్లి "ఏయ్! బూచీ, నీకేం కావాలి? నాతో ఏం వేషాలు పనికిరావు. నీదారిని నువ్వు పోతావా? లేక నన్ను తన్నమంటావా? అని ఒక్క కేక వేసేటప్పటికి, ఈ బూచివాళ్లు తోక జాడించి పరుగులెత్తరూ? పోనీ, వాళ్లో నేళ పారిపోకపోయినాగాని, నేనలాగ కేకలేస్తాను. దానితో ఆ భయం పోతుంది" అని యిలాగ ఏదో అంటున్నాడు. అపుడే చెట్ల ఆకుల గలగల వినిపించింది. ఎదురుగా చూచేటప్పటికి రెండు నల్లటి ఆకారాలు బొగ్గుసంచులు కట్టుకొని తన వైపు దెయ్యాలలాగ గంతులేసి వస్తూవుండటం కనిపించింది. "అరుగో బూచివాళ్లు" అని గుర్తుపట్టి, నాలుగు మొహరీలూ ఎక్కడ పెట్టాలో తెలియక, చటుక్కున నోటిలో వేసుకొని నాలుక క్రింద దాచివేశాడు. దాచి పరుగుచ్చుకున్నాడు. కదిలేలోపున అతని రెండు చేతులూ పట్టేసుకొన్నారు ఆ దొంగలు.

"నీ డబ్బు ఇస్తావా, చస్తావా?" అని ఇద్దరూ క్రూరమైన కంఠాలతో అడుగుతున్నారు.

పినాకరావుకి నాలుక క్రింద నాణా లుండటంచేత మాటాడలేకపోయాడు. వెయ్యి నమస్కారాలు పెట్టి, 'నేను పేదవాణ్ణి; నాదగ్గర డబ్బు లేదు; వదిలి వెయ్యండి' అన్నట్టు సైగ చేశాడు.

"ఈ అబద్ధాలకేంలే. నీ దగ్గర డబ్బు అక్కడ పెట్టు!" అని గద్దించారు.

పెళ్లాడేబొమ్మయ్య మాత్రం తన దగ్గర ఒక పైసకూడా లేదని తలా చేతులూ ఆడించి చూపించాడు.

"ఇస్తావా, చస్తావా"? అని అడిగాడు పెద్దవాడు. "చస్తావా?" అని రెండోవాడు అన్నాడు.

"నిన్ను చంపి, మీ తండ్రినికూడా చంపుతాము" అని మొదటివాడు అన్నాడు.

"నీ తండ్రినికూడా చంపుతాము" అని రెండోవాడు.

"అయ్యో! వద్దు - మా నాన్నని చంపవద్దు, నన్ను చంపినా సరే" అని పినాకయ్య మొత్తు పెట్టుకున్నాడు. ఈ గోలలో నోటిలోని మొహరీలు ఘల్లుమన్నాయి.

"అదా సంగతి! యీ సొమ్ము నోట్లో నాలుక క్రింద పెట్టావా? ఉమ్మెయ్యి వెంటనే; ఊఁ--"

పినాకయ్య అది వినిపించుకోనేలేదు.

"వినిపించుకోవూ? ఉండు, క్షణంలో కక్కిస్తాం" అని ఒకడు బొమ్మను ముక్కుపట్టుకొని లాగాడు. రెండో వాడు గెడ్డం పట్టుకొన్నాడు. ఏమీ దయాదాక్షిణ్యాలు లేకుండా ఒకడటూ, ఒకడిటూ లాగారు. చివరికి నోరుతెరపించారు. కాని ప్రయోజనం లేకపోయింది. ఈబొమ్మ తన నోరు తాళంవేసినట్టు మూసి వేసుకుంది. చిన్న బూచి ఒక కత్తి తీసి, పెదవుల మధ్య గుచ్చబోయాడు. పినాకయ్య మాత్రం మెఱుపులాగ వాడిచెయ్యి కఱచి వేశాడు. విచిత్రం తాను కఱచింది మనిషి చెయ్యి కాదు; పిల్లిపంజా!

మొదటియెత్తు ఫలించినందుకు బూచిగాడి చేతుల్లోంచి విడిపించుకొని కొమ్మమీదకి గెంతువేశాడు పినాకం. అవతలికి దూకి పరుగుపెట్టున్నాడు. అతనివెంట ఆబూచిగాళ్లిద్దరూ తరుముతున్నారు. చిన్నవాడి పంజా విరగడం వల్ల, ఒంటికాలుమీదే పరుగెత్తుతున్నాడో మాత్రం దేవుడికే యెరుక!

తొమ్మిది మైళ్లు పరుగెత్తేటప్పటికి, పినాకయ్య పూర్తిగా డస్సిపోయాడు. ఇంక లాభం లేదనుకుని ప్రక్కనే వున్న ఒక పెద్దసంగీతంచెట్టు ఎక్కి, ఒక చివాగు కొమ్మలో కూర్చున్నాడు. బూచివాళ్లు అతని వెనక చెట్టు ఎక్కబోయారు. సగం ఎక్కగానే జారి క్రిందపడ్డారు. కాళ్లూ చేతులూ కొట్టుకుపోయాయి.

అయినాగాని, అంతటితో వాళ్లు వదలలేదు. ఎండుపుల్లలూ ఆకులూ చెట్టు మొదట పోగుచేసి మంట పెట్టారు. వెంటనే సంగీతంచెట్టు నిప్పంటుకొని, కొవ్వొత్తిలాగ గాలిలో కాలుతోంది. మంటలు అంతకంతకి పైకి పాకడం చూచి, పినాకయ్య, పై కొమ్మ మీంచి ఉరికి, ఆ పొలాలలోంచీ, తోటలలోంచీ కాళ్లకొద్దీ పరుగెత్తాడు. బూచిగాళ్ళు వెనకాతలే తరుముతున్నారు. వాళ్లెక్కడా అలసిపోలేదు. తెల్లారుతూనే వుంది. వాళ్ళు ఇంకా పరుగెత్తుతూనే వున్నారు. ఇంతలో ఒక కుళ్ళు గొయ్యి కనిపించింది. దానినిండా

బురద కాఫీ, పాలూ కలిపి ఒలకబోసినట్టుంది. ఏం చేస్తాడు? ధైర్యం కావాలి.

ఒకటి, రెండు, మూడు.

ఒక్క గంతులో గొయ్యి అవతలికి చేరుకున్నాడు. బూచిగాళ్లు కూడా ఉరికారు. కాని ఎంతదూరమో చూచుకోలేక గొయ్యిమధ్య పడిపోయారు, ఆకుళ్ళకూపంలో. దబాలుమని నీళ్ల చప్పుడు పినాకయ్య విన్నాడు. విని ఆతను నవ్వుతూ, "ఏయ్! బూచిగాళ్లా ఈ మాటు బాగా స్నానం చెయ్యండి" అని ఎత్తి పొడిచాడు నవ్వుతూ. వీళ్ళు ఆ కుళ్లు గోతిలో మునిగి పోయారేమో అనుకున్నాడు. ఇంతలో వాళ్ళు, ఆ సంచిముసుగులు కట్టుకునే వెంట దొర్లుకుంటూ వస్తున్నారు.

౧౪

ఈమాటు తన కింక లాభం లేదనుకున్నాడు పినాకం. క్రింద పడిపోయి పట్టుబడి పోదామనుకున్నాడు. కాని యింతలో ఆ పచ్చని చెట్లమధ్య తెల్లని మంచుకొండలాంటి యిల్లుకనిపించింది. ఆ యిల్లుగనక చేరుకుంటే బ్రతికి పోతానేమో అనుకొన్నాడు. ఇంకేమీ ఆగకుండా, ఆ తోటకేసి నఖ్వ కొద్దీ పరుగెత్తాడు. ఆ బూచివాళ్లు వెంట తరుముతునే వున్నారు. మొండి పరుగుతో రెండుగంటలు పరుగెత్తి, ఆ చిన్న యింటికి, అలసి హాతమారి పోయి చేరుకొన్నాడు. తలుపు కొట్టాడు.

ఈమాటు గట్టిగా, యింకా గట్టిగా కొట్టాడు. తనవెంట తరిమే దుర్మార్గుల అడుగుల చప్పుళ్లు వినిపిస్తున్నాయి. వాళ్లు వచ్చివేశారు. ఇంకేముంది! తలుపుకొట్టినాగాని ఎవరూ తియ్యడం లేదే! ఇంక లాభం లేదనుకొని, తలుపు కాలితో తన్నాడు. ఉఁ హుఁ, లాభం లేదు. మెల తలుపుమీద కొట్టాడు. వెంటనే ఒక అందమైన పిల్ల కిటికీ దగ్గరికి వచ్చింది. ఆ అమ్మాయి ముఖం కొవ్వొత్తిలాగుంది. నీలాల తల. కళ్లు మూసి ఉన్నాయి. చేతులు రెండూ అటుయిటూ వేసుకొన్నది. పెదవులు కదల్చకుండా, చిన్న గొంతుకతో, ఏదో యింకో లోకంనించి మాటలాడుతూ వున్నట్లు ఉంది.

"ఈయింట్లో ఎవరూ లేరు. అంతా చచ్చిపోయారు"

"పోనీ నువ్వైనా నన్ను లోపలికి రానియవ్వూ?" అనిదీనంగా బ్రతిమాలుకున్నాడు.

"నేనూ చచ్చిపోయాను"

"చచ్చిపోతే, నువ్వికిటికీదగ్గర ఏం చేస్తున్నావు?"

"నేను దేవత వచ్చేవరకు కనిపెట్టుకునిఉన్నాను" ఇలాగఅంటూ ఉండగానే, యీ అమ్మాయి మాయమై పోయింది. కిటికీ దానంతట అదే చడా చప్పుడూ లేకుండీ మూసుకొని పోయింది.

"ఓ అమ్మాయి! నీలితల అమ్మాయి. దయచేసి, తలుపు తియ్యవూ? బూచివాళ్లుతరుముకొనివచ్చే యీ పిల్లవాడిని కాస్త యిక్కడ తలదాచుకోనియ్యవూ? తలుపు తియ్యవూ?" అయ్యో!" ఇలా అంటూ ఉండగానే ఎవరో గొంతుక నొక్కివేసినట్లు అయింది. మళ్లీ ఆ దుర్మార్గుల కేకలు వినిపిస్తున్నాయి.

"ఈమాటు ఎక్కడికి తప్పించుకొని పోతావు. హహ్హహా!" అని అంటున్నారు. ఈ వేళతో తన అంతుకాకతప్పదని పినాకయ్య వణకి పోతున్నాడు. ఆ ఒణుకులో అతని కత్తకాళ్లు కీచుమంటున్నాయి. నోటిదవడలక్రింద మోకీలు నాలుగూ ఘల్లుమంటున్నాయి. "అయితే, నీ నోరు తెరుస్తావా? తెరవ్వా? జబాబుచెప్పవు కదూ? సరేలే, తెరపిస్తాముండు నీ నోరు!?" అలాగని రెండు పెద్ద కత్తులు తీసి, సాఫ్! అతన్ని పొడిచేశారు.

కాని అదృష్టవశాత్తూ, పినాకయ్యని చాల గట్టి కఱ్ఱతో చేశారు. అందుచే ఆ కత్తు లన్నీ ముక్కలయిపోయాయి. ఆదుర్మార్గుల చేతుల్లో కత్తి పిడులు మాత్రం మిగిలాయి. వాళ్లు ఒకళ్ల మొగం ఒకళ్లు చూచుకొన్నారు. "పీడి నిలాగ కాదు. పీక నులిపి, ఉరి తీద్దాం" అలాగని, పీకకి తాడుకట్టి, ఒక పెద్ద మఱ్ఱిచెట్టు కొమ్మకి కట్టివేశారు. తరువాత వాళ్లు గడ్డిమీద కూర్చుని, గిలగిల తన్నుకొనే కాళ్లు ఎప్పుడు ఆగుతాయో అని చూచారు. మూడుగంటల తర్వాత బొమ్మ కళ్లు తెరచాడు. మునపటికంటె ఎక్కువగా కాళ్లు తన్నుకొంటున్నాడు. ఆగిఆగి, పినాకయ్యవైపు తిరిగి, చివరకి "మేం పోయి మళ్లా రేపు వస్తాము. అప్పటికి చచ్చుపీనుగులాగ వేలాడుతూ నోరు వెళ్లబెట్టుకొని ఉండు" అని చెప్పిపోయారు.

ఈలోపున పెద్దహోరుగాలి మొదలు పెట్టింది. హో హో యని అది వీచి పినాకయ్యని అటూయిటూ ఊపివేసింది. దానితో పినాకయ్య వళ్లు హూనం అయిపోతోంది. మెడచుట్టూ ముడి బిగుసుకొనిపోయి ఊపిరి సలప నియ్యడంలేదు. అంతకంతకి కళ్లు మసకలు కమ్ముతున్నాయి. అంతకంతకి చావు దగ్గరపడుతున్నా గాని, ఎవరైనాధర్మదాత వచ్చి, తన్ను విడిపిస్తాడేమో అనుకొంటున్నాడు. ఎంత సేపో చూచాడు. ఎవ్వరూ రాలేదు. ఒక పిట్ట కూడా లేదు. అప్పుడు తండ్రి జ్ఞాపకం వచ్చాడు.

"నాన్నా, నువ్వే యిక్కడ ఉంటేనా?" అనుకొన్నాడు. ఇంక మాట రాలేదు. కళ్లు మూశాడు; నోరు తెరచాడు; కాళ్ళు చాపి, కొయ్యబారి పోయాడు. గడ్డకట్టినట్టు అలాగ బిఱ్ఱ బిగిసిపోయాడు.

పిల్లలు వ్రాసిన కథలు ●

కడుపులో కలకలం

అనగా అనగా, 'పొట్ట' రాజ్యంలో 'జీర్ణకోశ' పట్టణం వుంది. అదే పొట్టా రాజ్యాని కంతటికీ రాజధాని. దానిలో ఆ రాజ్యా న్నంతా పరిపాలించే 'పెద పేగు రాజు' నివసించేవాడు. 'ఆకలయ్య' నే మహామంత్రి, 'అన్నంరాజా' అనే సేనాధిపతులుకూడా రాజుకు అండగా నుండి పొట్టా రాజ్యాన్ని నిర్భయంగా యేలుతున్నారు. ఇట్లా వుంటుండగా ఆ రాజ్యంలోకి 'కాఫీదొరగా' రనేవాడు ప్రవేశించాడు. వాడు పెదపేగు రాజుగారిదగ్గఱకొచ్చి "మేము నర్తకము చేస్తానికి తమ దేశం వచ్చాం. కాబట్టి మావద్ద నున్న వస్తువులను చూచి, మాకు కొంత స్థల మివ్వవల్సిన" దని ప్రార్థించారు. అప్పుడు రాజుగారా వస్తువులను చూచి సంతోషించి వారికి కొంత స్థల మిచ్చారు. ఇట్లా రోజురోజుకీ కాఫీదొరలు వచ్చి అనేక స్థలా లాక్రమిస్తున్నారు. అప్పుడు ఆకలయ్యమంత్రి రాజుగారితో "అట్లా కొత్తవారికి చోటిస్తే ప్రమాదం" అని చెప్పాడు. రాజుగారికి కోపం వచ్చి "నాకు నీతులు చెప్తానికి నువ్వెవరు? నా రాజ్యంనుంచి వెళ్ళు" అన్నారు. అప్పుడు మంత్రిగారు చేసేది లేక ఇంకో రాజ్యంలోకి వెళ్ళారు. ఇంకేం! కాఫీదొరలు ఆడించేదె ఆట, పాడించేదే పాటగా వుంది. కాని, మధ్యమధ్య 'అన్నం రాజా' అడ్డు తగుల్తున్నాడు. అందుకని కాఫీదొరలు పెదపేగు రాజుకి అన్నం రాజుకి పోట్లాట పెట్టారు పాపం! అన్నంరాజుని వెళ్ళగొట్టారు. అన్నంరాజు ఆకలయ్యగారిని కల్సుకొని తనకు జరిగిందంతా చెప్పాడు. ఇద్దరూ కల్సి యుద్ధసన్నాహాలు చేస్తున్నారు. ఇక్కడ మన కాఫీదొరలు పెదపేగు రాజుగారిని జైల్లో పెట్టి పొట్టారాజ్యాన్ని అల్లకల్లోలం చేస్తున్నారు.

రోజురోజుకీ వారి దుండగా లెక్కువవుతున్నాయి. రోజు కొక గ్రామం దోచేస్తూ, అందుండే ప్రజలను అన్యాయంగా చంపుతూ, స్త్రీలను నరుకుతూ, అక్కడ దొరికిన డబ్బంతా తీసు కెళ్ళుతున్నారు కాఫీదొరలు. ఇవన్నీచూచి, సహించలేక ఆకలయ్యగారిదగ్గఱ కెళ్ళి మొర పెట్టుకున్నారు ప్రజలు. అప్పడు ఆకలయ్యగారు పెద్ద సైన్యంతో కాఫీదొరలమీదికి యుద్ధాని కెళ్ళారు. వీళ్ళ రాక విని, కాఫీదొరలు భయపడి రహస్యంగా 'వాంతి' అనే రహస్య మార్గంగుండా పారిపోయారు.

తీగెల గోపీచెంద్.

వయస్సు 16 ఏండ్లు 5-వఫారం. సి.

బాలగేయాలు

శ్రీ చింతా దీక్షితులు

(సంపాదించినవి)

15

అయివారింటికే పోయి వద్దాము
అరటిపళ్ల అత్తాలు అడిగి వత్తాము.

16

చందామామా చేరే కట్టి
సన్నా బియ్యం ఒళ్లో పోసి
అమ్మా నేను చిన్నదాన్ని,
అల్లుడు వస్తే అంపా బోకు,
మామా వస్తే మళ్లీ రమ్మను,
చడ్డీ కట్టా గుడ్డా లేదు,
సాగనంపా బొట్టూ లేదు
ఇరుగు పొరుగు అక్కల్లారా
ఒకటే తుమ్ము అ......చ్!

17

వద్దాది కొండమీద వల్లెంక బోసి
రా చిలుక పో చిలుక వద్దు
దంచుదాము
అల్లవారి కుక్క వచ్చి కూడు ముట్టంగ
కూడు ముట్టినచోట కలికమ్మ రాలు
సుసము తిన్న కూడు ముత్యాల్లు రాలు
రా చిలుక పో చిలుక వద్దు
దంచుదాము
పోదాము మన యింక ప్రొద్దు పోయింది.

18

ఎద్దెద్దు పట్టెడ
ఎద్దురాయ పట్టెడ
మోగన్న మూగచే
మాయదారి కెన్నెర.

19

జోలలకు పొడంగ బాలలకు నిద్ర
నాగస్వరం పట్టంగ నాగులకు నిద్ర.
రాజనం పండింది రాజు కోరిగింది
మూతంలసి పండింది భూమి కోరిగింది
చిలుకల్లు చెలరేగి జీడీకొ మ్మెక్క
మాయమ్మ చెలరేగి మామభుజ మేక్క
మామ భుజ మెక్కతునె
మా మనేమడుగు?;
పాల డుగు, గిన్నడుగుపాలావునడుగు
ఊరలేని పాటిమీద ఉయ్యాల గట్టి
ఊపమని మీమామ కుత్తరాల పంపు.
(మేడపి)

20

గోవమ్మ నీళ్లాడె గొల్లోడు వడికట్టె
ఒడ్డోడుచెలమునెడి వసలోడు పారదీసె.
నిన్నొక్క దూడ వచ్చె
మొన్నొక్క దూడ వచ్చె
పోయే పున్నమ నాడు
పొయిమీద రొట్టాలు
బుడిరోటి గిట్టాలు
గుజ్జు కోని తిన వోయి
బుల్లి నాసరయ్య.
(రెంట పాళ్ళ)

21

ఒక్కింద
బికికీలు ఐదు రెంట్ల
ముక్కు మల్లె అష్టదాళి
నక్క నాంచి ఇస్తివేళ్లు (మేడపి)


నిజాం-భారత అధినివేశాలమధ్య ఒడంబడిక

నిజాం లేఖ

నిజాం నవాబ్ 1947 వ సం. నవంబరు 29 వ తేదీన, ఇండియా అధినివేశ గవర్నర్ జనరల్‌కు వ్రాసిన లేఖ —

"హైదరాబాద్ సంస్థానానికీ, ఇండియా అధినివేశానికీ వుండవలసిన సంబంధాల స్వరూపాన్ని గూర్చి అంతిమ ఒడంబడిక కుదుర్చుకొనలేక పోయినందుకు నేను చింతించుచున్నాను. ఏ అధినివేశములోను జేరిపోవుటకు నే నిష్టపడననీ, అధికారమును దఖలు పరచటం గాక, మరే ఇతరమైన ఒడంబడిక చేసుకొనటానికైనా సంప్రదింపులు జరపటానికి నేను సిద్ధమనీ మీకు తెలియును. మీ ప్రభుత్వం అంగీకరిస్తే, నేనూ అంగీకరించటానికి సిద్ధంగా వున్న యధాతథపు ఒడంబడిక ముసాయిదాను ఇందుతో పంపుచున్నాను. ఇంత దీర్ఘకాలము సంప్రదింపులు జరిపిన తరువాత, సార్వభౌమత్వం తొలగిపోవటం వలన అవసరమైన మార్పులతో ఇదివరకటి ఏర్పాట్లనే సాగించటం కన్న, మరొక ఒడంబడిక చేసుకొనలేక పోయినందుకు నే నాశాభంగము జెందితిని. అయితే, ప్రస్తుతపు సందిగ్ధ పరిస్థితిని అంతమొందించి, ఒక సంవత్సరకాలం అమలులో వుండే ఒడంబడిక చేసుకోవటం వలన, ఈ సంవత్సర కాలంలో రాజ్యాంగ సంప్రదింపులతోనే కాలం గడిపివేయకుండా, పరిపాలనా విధులకు కొంతకాలం వినియోగించటానికి అవకాశం దొరుకుతున్నది. మన భవిష్యత్సంబంధాల విషయమై తిరిగి ఒడంబడికలు జరుగవలసియున్నవి.

అయితే ఈ యథాతథపు ఒడంబడిక అమలులోవున్న సంవత్సరకాలం లోపున సంబంధాలు సౌభ్రాత్ర్య పూరితంగా వుంటే, దీర్ఘకాలమునకు సంబంధించిన సంతృప్తికరమైన ఏర్పాట్లు మనం తేలికగానే చేసుకొనవచ్చును. కాబట్టి ఈ యథాతథపు ఒడంబడికను పొరుగు రాజ్యముపట్ల సుహృద్భావముతో చేసుకుంటున్నట్లు నేను భావిస్తున్నాను. మీరు మీ ప్రభుత్వం కూడా అదేవిధంగా భావిస్తున్నారని నే ననుకుంటున్నాను. ఈ యధాతథపు ఒడంబడికకు అంగీకరించటంవల్ల సర్వ స్వతంత్ర రాజుగా నాహోదాకు ఎట్టి భంగము కలుగదని నేను భావిస్తున్నాను. అయితే ఈ ఒడంబడిక అమలులోవున్న సంవత్సరము పాటు నా అధికారములలో కొన్ని ముఖ్యాధికారములను నేను తాత్కాలికంగా మాత్రమే వదలుకుంటున్నానన్న విషయం నేను గ్రహించాను. ఇటువంటి క్లుప్త ఒడంబడిక చేసుకోవటంవలన, ప్రత్యేక ఏర్పాట్లనుగురించి అనేక సంప్రదింపులు జరుగవలసివస్తుంది. నా సంస్థానం లోని తంతి, తపాలాలు, ప్రత్యేకశాఖగా అధినివేశశాఖతో సమన్వయపరుస్తూ, నిర్వహిస్తూ వుండేవిషయమై త్వరలోనే నా ప్రభుత్వముతో మీ ప్రభుత్వము సంప్రదింపులు జరుపుటకు అంగీకరించినదని తెలిసినది. ఇదిగాక హైదరాబాదు సేనల సంఖ్య, సామగ్రికి సంబంధించిన ప్రశ్నలున్నవి. వీనిని మన ప్రభుత్వాలు చర్చించేటప్పుడు, ఆగస్టు 15 తేదీ నుండి ఆంతరంగిక శాంతిని కాపాడుటలో నాసేనలకు, పోలీసులకు సార్వభౌమత్వాధికారం ప్రకారం వుంచబడిన సేనల సహాయం ఉండేదన్న విషయం జ్ఞాపకముంచుకోవలెను. ఈవిషయమై ఇదివరకు మీకు సైనికసలహాదారుగా ఉన్న వారితోను ఆయన తర్వాత ఆయన పదవిలో వున్న వారితోను, కొంతవరకు సంప్రదింపులు జరిగినవి. ఈవిషయమైయున్నా, సార్వభౌమత్వాధికారం రద్దయిపోవటంవల్ల ఉత్పన్నమౌతున్న ఇతర విషయములను గురించియున్నా, ఈ ఒడంబడిక లోని 1 వ షరతువల్ల ఉత్పన్నకాగల విషయములను గురించిన్నీ సంప్రదింపులు జరపటానికి మీ ప్రభుత్వం అంగీకరిస్తుందని నేను భావిస్తున్నాను. ఆయుధసామగ్రికి సంబంధించినంతవరకు, మాకు కావలసిన సామగ్రినంతను, సముంజసమైనంత త్వరలో, మీ ప్రభుత్వమే సరఫరా చేస్తుందనీ ఆవిధంగా మీ ప్రభుత్వం చేయకపోతే, మీ ప్రభుత్వానికి ముందుగా తెలియపరచి విదేశాలలో నేరుగా నా ప్రభుత్వమే కొనటాని అవకాశమున్నదనీ నాకు తెలిసినది.



3. విదేశాలలో హైదరాబాద్ తరఫున రాజకీయ ప్రతినిధులు, వాణిజ్య ప్రతినిధులు నియమింప బడటాన్ని గూర్చి కూడా మీ ప్రభుత్వప్రతినిధులతు, నా ప్రతినిధులకు సంప్రదింపులు జరిగినవి. బ్రిటన్‌లోగాని, మరే ఇతర దేశములోగాని హైదరాబాద్ ఒక ప్రత్యేక ప్రతినిధిని నియమించుకోటానికి ఆటంకమేమీ లేదనే షరతుపైన నే నీ ఒడంబడికను అంగీకరిస్తాను. ఈ దేశాలలో వున్న మీ రాజకీయ ప్రతినిధులతోను, వాణిజ్య ప్రతినిధులతోను మా ప్రతినిధి కలిసి సమన్వయముగా కృషిచేయునట్లు నే నేర్పాటు చేస్తాను. అంతేగాక నేను నియమించే ప్రతినిధి పేరు మీకు ముందుగానే తెలియజేస్తాను. ఎగుమతి, దిగుమతి వ్యాపారాల విషయంలో నా ప్రభుత్వంతో మీ ప్రభుత్వం సహకరిస్తుందని నే నాసిస్తున్నాను.

4. ఇంతవరకు పరిష్కరింప బడకుండ మిగిలివుండి, ఈ ఒడంబడిక అమలులోనికి రాగానే త్వరలో పరిష్కరింప బడగలవని నే నాసిస్తున్న విషయాలు చాల వున్నవి:



1. సార్వభౌమత్వాధికారం రద్దయిపోయింది. కాబట్టి ఇక సార్వభౌమత్వాధికారం నిర్వహించవలసిన విధులేమీ లేవు. అయినా అభవంతి రెసిడెంటు వున్నంతకాలం ఆయన ఆక్రమణలోవున్నది. ఇప్పుడాయనకూడా వెళ్లిపోయాడు కాబట్టి ఆ భవనం తిరిగి మాకు వప్పజెప్పవచ్చును. ప్రస్తుతం ఆభవంతిలో వున్న మీ ఖజానా, ఖజానాశాఖ అధికారులు వేరొక చోట బస చేయటానికి ఏర్పాట్లు చేయబడవచ్చును.

2. ఆయుధములు, ఆయుధ సామగ్రి, ముఖ్యముగా తుపాకిమందు, హైదరాబాద్‌కు అత్యవసరముగా అందజేయవలెను. ఈ సామగ్రి జూలైనుంచి కొరతగా వున్నందున హైదరాబాద్ సైన్యానికి తర్ఫీదు యిచ్చుటకు వీలులేక పోతున్నది.

3. సైన్యమును రవాణా చేయుటకు కావలసిన 'మోటరు' శకటములు దొరకక చాల యిబ్బందిగావున్నది హైదరాబాదు సంస్థాన విస్తీర్ణమును బట్టి, ఈ శకటముల ఆవశ్యకతను మీరు గుర్తించగలరు.

4. హైదరాబాద్‌లో వున్న అధినివేశ సేనలన్నీ వచ్చే నెలాఖరులోగా ఉపసంహరిస్తాయని నాకు తెలిసింది. ఈ విషయమై కూడా మీరు హామీ యిస్తే సంతోషిస్తాను.

5. హైదరాబాదు సరిహద్దులలో, సర్వాధికారములు హైదరాబాద్‌కేవుండవలెనన్న సూత్రం యిదివరకే ఆమోదింపబడినది. ఆగస్టు 15 వ తేదీవరకు చాల అధికారములు హైదరాబాదుకు వప్పజెప్పబడినవి; అతరువాత కూడా వప్పజెప్పబడుతున్నవి. సంస్థానంగుండాపోయే రైళ్వేలలోని పోలీసులపై అధికారమును కూడా నాకు వప్పజెప్పవలసియున్నది. ఈ అధికారముకూడా త్వరలోనే నాకు వప్పజెప్పబడునని ఆశిస్తున్నాము.

5. ద్రవ్యము, చలామణీ, తపాలా అధికారముల విషయంలో, ఈఒడంబడికవలన నాఅధికారము లేమీ సంకుచితపరుపబడవని తెలుస్తూవున్నది. ఈ అధికారము లేమీ సంకుచితపరుపబడవని మీరు హామీయిస్తే, సంతోషిస్తాను.

6. ప్యాస్‌పోర్టు విషయంవలో, హైదరాబాదు ప్రజలకు, నా ప్రభుత్వప్రధాన కార్యదర్శిగాని మరేయితర అధికారిగాని సంతకంచేసి యివ్వటం సరియైన ఏర్పాటని నేను భావిస్తున్నాను. అది అత్యవసరమైన విషయమైయుండుటవలన త్వరలోనే ఒక ఏర్పాటు జరుగుగలదని ఆశిస్తున్నాను.

7. యీ ఒడంబడికకు అంగీకరించుటం ద్వారా ఒకరి ప్రాంతంలో మరొకరిపై దుష్ప్రచారము జరుగకుండునట్లు చూస్తారని నేను భావిస్తున్నాను.

8. మత సంక్షోభమును తొలగించటానికి మీ ప్రభుత్వంచూపిస్తున్న ఆసక్తి నే నెరుగుదును. నేనిదివరకు చేసినప్రకటనల ప్రకారమే, జాతిమత వివక్షత లేకుండాను ప్రజలందరి ప్రాణ మానధనములను రక్షించటానికి నానిశ్చయాన్ని ప్రకటిస్తూ త్వరలోనే ఒక ఫర్మానా జారీచేయదలచియున్నానన్న విషయం మీకు తెలియజేస్తున్నాను.

గవర్నర్ జనరల్ లేఖ

ఇండియా అధినివేశ గవర్నర్-జనరల్ 1947 వ సం. నవంబరు 29 వ తేదీన నిజాం ప్రభువుకు వ్రాసిన ప్రత్యుత్తరం :

29 వ తేదీన మీరు వ్రాసిన ఉత్తరము, ఒడంబడిక అందినది. కృతజ్ఞుడను. పాకిస్తాన్‌లో జేరవలెననే ఉద్దేశం మీకు లేదని విన్నందుకు సంతోషించినా, అధికార దఖలు పత్రముపై సంతకంచేసి, భారత యూనియన్‌లో జేరటానికి మీరు నిశ్చయించనందుకు నేను, నా ప్రభుత్వము విచారించుచున్నాము. ఇండియా అధినివేశములో జేరిన సంస్థానములతో, అధికారము దఖలు పరచిన మూడు విషయముల లోను సఖ్యతతో అధికారము వహిస్తూ, ఆ సంస్థానముల సర్వస్వతంత్రతను కాపాడుతుండటమే మా ప్రభుత్వ విధానమని మా సంస్థానశాఖమంత్రీ, నేను జూలై 25 వ తేదీన సంస్థానాధీశ్వరుల ప్రతినిధుల సభలో తెలియజేసియే వున్నాము. ఈ యథాతథపు ఒడంబడిక చక్కగా అమలు జరిగినచో, దీర్ఘకాలపు ఒడంబడిక సంతృప్తికరముగా జరుగగలదని మీరు ఆశించినట్లే మేమున్నూ ఆశిస్తున్నాము. హైదరాబాద్ నైసర్గిక స్వభావమునుబట్టి భారతయూనియన్‌తో ముడిబెట్టబడియున్నది. అందువలన ఈ యథాతథపు ఒడంబడిక రద్దయిపోయేలోగా, హైదరాబాద్ భారత యూనియన్‌లో జేరుతుందని మేము ఆశిస్తున్నాము.

2. తంతి, తపాలాలు మీకు వప్పగించే విషయమైయున్నా, మీ సంస్థాన సేనల సంఖ్య, సామగ్రి విషయమైయున్నా, మీ ప్రతినిధులతో సంప్రదింపులు జరుపుటకు మా ప్రభుత్వం సిద్ధంగా వున్నది. మీ సైన్యముకు న్యాయతః కావలసిన ఆయుధములు, సామగ్రి మా ప్రభుత్వం సరఫరా చేస్తుంది.

3. లండన్‌లోగాని, మరెక్కడనైనగాని మీ ప్రతినిధులను నియమించుకోవటానికి మా ప్రభుత్వంఅభ్యంతరం చెప్పదు. మీ ప్రతినిధి కార్యక్రమమంతయు మా ప్రతినిధుల కార్యక్రమంతో సమన్వయపరచి జరుపబడుననీ, మీ ప్రతినిధి వర్తక వ్యాపారముల విషయమై మాత్రమే వ్యవహరించునని మీరు చెప్పినందుకు మా ప్రభుత్వం సంతోషిస్తున్నది. ఆ విషయానికి మేము చాల ప్రాముఖ్యత యిస్తున్నాము. హైదరాబాద్ ఎగుమతి దిగుమతి వ్యాపారాలను గురించి మీకు సంపూర్ణ సహాయం చేయటానికి మా ప్రభుత్వం సిద్ధంగా వుంది.

4. మీ ఉత్తరంలో, 4 వ పేరాలో పేర్కొనబడిన ప్రత్యేక విషయాలను గురించి, ఈ విధంగా సమాధానా లిచ్చుటకు నాకు మా ప్రభుత్వం అధికారమిచ్చినది:

1. మా ఖజానాకు, ఖజానా ఉద్యోగులకు వేరే బస ఏర్పాటుచేస్తామని మీరు వాగ్దానంచేసిన ప్రకారం బస ఏర్పాటు జరగగానే రెసిడెన్సీ భవంతి మీకు వప్పగించటానికి మా ప్రభుత్వం అంగీకరిస్తున్నది.

2. ఆయుధములు, ఆయుధ సామగ్రి కావలెనని మీరు పంపిన అంచనాలప్రకారం త్వరలోనే మీకు ఆయుధములు అందజేయబడును.

3. మీకు కావలసిన శకటములు కొను

సంప్రదింపులు. షరతులు, వివరణలు

ఇండియా యూనియన్‌కూ, హైదరాబాదు సంస్థానానికి జరిగిన యథాతథపు ఒడంబడిక పత్రం మీద గవర్నర్ జనరల్ లార్డు మౌంట్ బాటెన్ నవంబరు 29: మధ్యాహ్నం 12 గ.ల 40 ని.కు ఇండియా తరఫున దస్కతు చేశాడు.

హైద్రాబాదు రాయబారవర్గంవారు ఒడంబడికమీద నిజాం చేత సంతకం చేయించి, నాటి ప్రొద్దున్నే ఢిల్లీకి ఒడంబడిక పత్రాన్ని తమతోకూడా తీసుకువెళ్లారు.

నవాబ్ మోయిన్ నవాజ్‌జంగ్ నాయకత్వాన రాయబార వర్గ సభ్యులు అబ్దుర్ రహీమ్, పింగళి వెంకటరామ రెడ్డి గారలు ప్రభుత్వ భవనంలో గవర్నర్ జనరల్‌తో సమావేశమయినారు. సంస్థానాల శాఖ మంత్రి సర్దార్ పటేలు, సంస్థానాల శాఖ కార్యదర్శి అయిన వి. పి. మీనన్‌గారలు కూడా సమావేశానికి హాజరైనారు.

సర్దార్ పటేల్ ప్రకటన



"హైదరాబాదు సంస్థానానికి భారత ప్రభుత్వానికి ఉండవలసిన భవిష్యత్ సంబంధ బాంధవ్యాల విషయమై హైద్రాబాదు ప్రభుత్వంతో భారత ప్రభుత్వం జరిపిన రాయబారాలయొక్క ఫలిత పర్యవసానాలను గురించి మీ అనుమతితో నే నిప్పుడొక ప్రకటన చేయగోరుతున్నాను. కొన్నిరోజులక్రితం, హైద్రాబాదు ప్రభుత్వంతో జరుపుతున్న రాయబారాలు అంతిమఘట్టంలో ఉన్నవని, ఈ సభలో నేను ప్రకటించిన విషయం సభికులందరికీ జ్ఞాపకం ఉండి ఉంటుంది. ఎట్టకేలకు ఆ రాయబారాలు ఫలప్రదమై ఒడంబడిక కుదిరిందని ఈ సభలో నేనిప్పుడు తిరిగీ ప్రకటించ గలుగుతున్నందుకు నాకు చాలా సంతోషంగా ఉన్నది. ఇవాళ ప్రొద్దున ఉభయపక్షాలు సంతకంచేసిన ఒడంబడిక పత్రం ప్రతీ, నైజాంకూ గవర్నర్ జనరల్‌కూ జరిగిన ఉత్తర ప్రత్యుత్తరాలు సభికుల ఎదుటనే ఈ బల్లమీద ఉంచాను.

ఇండియా డొమీనియన్‌లో సంస్థానాల ప్రవేశం విషయమై, సంస్థానాలతో మేము గత జులై మాసంలోనే రాయబారాలు ఉపక్రమించామని మీకు తెలుసును. రాయబారాలలో ఆయా నరేంద్రులు ప్రదర్శించిన సహకారభావం వల్ల, ఒక్క హైదరాబాదు, కాశ్మీర్, జూనాగఢ్‌లు తప్ప మిగతా సంస్థానాలన్నీ ఆగస్టు 15 వ తేదీలోగానే ఇండియా డొమీనియనులో చేరిపోవడానికి పిలుపబడ్డది. మహోఘనత వహించిన నిజాంయొక్క ప్రతినిధులతో కూడా మేము ఆ సమయంలోనే రాయబారాలు ప్రారంభించాము. రాయబారాలు ఎలా ప్రారంభమైందీ, ఏ ఏ ఘట్టాలగుండా నడిచిందీ మొదలైనవివరాలన్నీ నే నిప్పుడు ఏకరువు పెట్టగోరడం లేదు. ఏమైతేనేమి, చిట్టచివరకు ఆగస్టు 15 వ తేదీ సరికే ఉభయపక్షాలకు ఒడంబడిక కుదరలేదు.

కానైతే, రాయబారాలు అంతటితో విరమించకూడదనీ, ఇంకా కొంతకాలం పాటు సంప్రతింపులు సాగించవలసిందనీ, నిజాం కోరాడు. ఆ కోరిక ప్రకారం, ఆయనకు తన ఆఖరి అభిప్రాయం తేల్చుకోవడానికి రెండు నెలల గడువు ఇవ్వడం అయినది. రాయబారాలు పునఃప్రారంభమైనప్పుడు గవర్నర్ జనరల్ లార్డు మౌంట్ బాటెన్ ఇండియా తరఫున మంత్రివర్గం అనుమతితో స్వయంగా చర్చలలో పాల్గొన్నాడు. నిజాంయొక్క రాయబారవర్గంతో ఆయన అనేక పర్యాయాలు సమావేశాలు జరిపి, ఒక నెలరోజుల క్రిందట అన్ని విషయాలమీద సంపూర్ణ సమాధానం సాధించ గలిగాడు. కాని అప్పటి రాయబారవర్గం దరిమిలాను ఎందుకు రాజీనామా ఇవ్వవలసివచ్చిందీ, వారిస్థానే కొత్త రాయబారవర్గం ఎందుకు నియమించబడినదీ మొదలైన విషయాలన్నీ ఇప్పుడు మళ్లీ నేను మీకు పునశ్చరణ చేయవలసిన అవసరం లేదు.

ఈ నూతన రాయబారవర్గంతో జరిపిన సంప్రతింపులలోకూడా మేము ఏమాత్రమూ పట్టివ్వకుండా మా పూర్వనిశ్చితమైన వైఖరికే అంటిపెట్టుకున్నాము. ఏతత్ఫలితంగా, పూర్వ రాయబార వర్గంతో చేసుకున్న ఒప్పందాన్నే నూతన రాయబారవర్గంవద్ద సాధించగలిగాము. ఇప్పుడు సంతకాలు అయిన ఒడంబడిక పత్రం పూర్వము సాయిదాకు అచ్చంగా నకలు; ఏ అంశాలలోనూ రెంటికీ ఈషన్మాత్రమైనా వ్యత్యాసం లేదు.

ఈ ఒడంబడిక ప్రకారం, పూర్వం రాజప్రతినిధికీ హైద్రాబాదు సంస్థానానికీమధ్య సమిష్టి విషయాలపై ఏవిధమైన ఒడంబడికలూ ఏర్పాట్లూ అమలులో ఉండేవో, సరిగా ఆ ఒడంబడికలూ ఏర్పాట్లే ఇక ముందుకూడా సంస్థాన ప్రభుత్వానికీ భారతప్రభుత్వానికీమధ్య ఒక ఏడాదిపాటు వర్తిస్తవి. అయితే సంస్థానంపై సార్వభౌమాధికారంమాత్రం భారతప్రభుత్వానికి ఉండదు.

మిగతా అన్నిసంస్థానాలు భారతప్రభుత్వానికి ఏఏశాఖలపై అధికారం దాఖలు పరిచినవో, ఆశాఖలపైననే అనగా, రక్షణ విదేశ వ్యవహారాలు, రాకపోకలు మొదలైన అనేకవిషయాలపై హైద్రాబాదు సంస్థానంకూడా భారతప్రభుత్వానికి అధికారం అర్పించింది. ఈ దీర్ఘ సమాలోచనల ఫలితంగా హైద్రాబాదు సంస్థానం ఇండియా యూనియన్‌లో శాశ్వతంగా ప్రవేశించి ఉంటే, మీకు ఇప్పటికంటె ఎక్కువ సంతృప్తికలిగేదని నేను ఎరుగుదును. హైద్రాబాదు సంస్థానం ఇండియా డొమీనియన్‌లో శాశ్వతంగా చేరిపోవాలన్నది మనఅందరి చిరవాంఛిత మనోభీష్టం. అది ఉభయపక్షాల యోగక్షేమాలకు సమాన లాభకారి అనే విషయం కూడా మనం గమనించవలసిఉన్నది. కాని సంస్థానం అంతరంగికంగా ఎదుర్కోవలసిన విషమసమస్యలను మేము సంపూర్ణంగా గుర్తించి ఉండబట్టిన్నీ, ఏదైనంతవరకూ సౌమనస్యం చెడకుండా స్వచ్ఛందంగా ఒడంబడిక కుదుర్చుకోవాలని మేము ఆది నుంచీ కాంక్షిస్తుండబట్టీ, దేశమొత్తంమీద ఉన్న స్థితిగతులను దృష్టిలోఉంచుకొని మేము అసలు ఒడంబడిక అనేది లేకపోవడంకన్న ఇటువంటితాత్కాలికఒడంబడిక అయినా చేసుకోడం శతవిధాలనయమని భావించాము.

ఈ ఒడంబడికకు పెట్టిన ఏడాది గడువులోనూ, ఉభయపక్షాలకు సాహచర్యంవల్ల సన్నిహితమైన సంబంధ బాంధవ్యాలు ఏర్పడి శాశ్వత అధికార ప్రదాన ఒడంబడికకు దారితీయగలవని ఆశిస్తున్నాము. హైద్రాబాదు పాకిస్తాన్‌లో చేరగోరడం లేదని ఒడంబడికలో స్పష్టపరచడం అయినది. ఇది చాలా సమయముగా సముచితమునూ అయిన ప్రకటన అని చెప్పక తప్పదు. ఎందుచేతనంటే, భౌగోళిక పరిస్థితినిబట్టి, తదితర స్థితిగతులను బట్టి, హైద్రాబాదు భవితవ్యానికీ, ఇండియా భాగధేయానికీ అవిచ్ఛేద్యమైన అవినాభావ సంబంధం ఉన్నది. గడచిన కొలదిమాసాలుగా సంస్థానంలో జరుగుతున్న సంఘటనలవల్ల ఇక్కడ మీరూ, బైటప్రజలూ చాలా ఆందోళన చెందుతున్నారన్న విషయం నేను యెరుగుదును. ఇప్పుడు ఉభయపక్షాలకూ ఒప్పందం కుదిరింది కాబట్టి, ప్రస్తుత పరిస్థితి త్వరలోనే చక్కబడగలదనీ, సం

21 వ పేజీ చూడుడు

టలో మీకు మా ప్రభుత్వం సహాయం చేస్తుంది.

4. హైదరాబాద్ సంస్థానంలోవున్న మా సేనలను, అంగీకృతమైన ఒక విధానంలో, 1948 వ సం. ఫిబ్రవరి నెలాఖరు లోగా సైన్యమునంతనూ ఉపసంహరించుటకు మా ప్రభుత్వం నిశ్చయించినది.

5. మీ సంస్థాన ప్రాంతంలో మీకు సర్వాధికారములు యిచ్చుటలో ఇంకా కొరతపడివున్న విషయాలపై, ఢిల్లీలో మీ ప్రతినిధి నియమింపబడగానే సంప్రదింపులు జరుపవచ్చును.

6. ద్రవ్యము, చలామణీ, తపాలాల విషయంలో మీ అధికారమును ఏవిధముగాను తగ్గించబోవటం లేదని ఖచ్చితముగా చెప్పుటకు నాకు అధికారమివ్వబడినది.

7. ప్యాస్‌పోర్టుల విషయమై మీరు వ్రాసిన సంగతి మా ప్రభుత్వం ఆలోచించి, మీకు తగుసహాయం చేస్తుంది.

8. మీ ఉత్తరంలో 7, 8 పేరాల విషయంలో, మత సామరస్యత కాపాడుటయే తమ కోరికయనీ ఈ విషయంలో మీకు సంపూర్ణ సహకారం చెయ్యగలమనీ మా ప్రభుత్వం మీకు హామీయిస్తున్నది.

9. నేను చేవ్రాలుచేసిన ఒడంబడికను ఇందుతో పంపుతున్నాను."

ఒడంబడిక షరతుల పూర్తి పాఠం

"1947 వ సం. నవంబరు 27 వ తేదీన ఇండియా అధినివేశమునకూ, హైదరాబాదు బీరార్‌ల నిజామునకు జరిగిన ఒడంబడిక :

ఉభయుల శ్రేయస్సుకొరకు సన్నిహిత సంబంధ సహకారములతో వ్యవహరించవలసియుండటం ఇండియా అధినివేశము, హైదరాబాద్, బీరార్‌ల నిజామ్‌ల లక్ష్యము, ధ్యేయము అయినప్పటికీ, ఈ సంబంధాల స్వభావము, స్వరూపము గురించి ఉభయ పక్షములకు ఇంతవరకు అంతిమ ఒడంబడిక జరిగియుండకపోవటం వలననూ ఉభయపక్షములకు సంబంధించిన విషయములలో ప్రస్తుతం అమలులోవున్న ఒడంబడికలు, పరిపాలనా ఏర్పాట్లు, అంతిమ ఒడంబడిక జరిగేటంతవరకు సాగిస్తూండడం ఉభయపక్షములకు శ్రేయస్కరమై యుండటం వలననూ, ఇప్పుడు, ఈవిధంగా ఒడంబడిక చేసుకోవడమైనది :—

1 వ షరతు : విదేశ వ్యవహారములు, రక్షణ, రాకపోకల సౌకర్యములతో సహా ఉభయపక్షములకు సంబంధించిన విషయములలో, 1947 వ సం. ఆగస్టు 15 వ తేదీకి ముందు సార్వభౌమ ప్రతినిధికి, నిజాంకు మధ్య అమలులోవున్న ఒడంబడికలు, పరిపాలనా ఏర్పాట్లు, అవసరమైనంతవరకు ఆవిషయములలో క్రొత్త ఒడంబడిక చేసుకొనబడునంతవరకు, ఇండియా అధినివేశము (లేక దానిలో ఏభాగమునైనా సరే) నిజాంలమధ్య ఇప్పటివలెనే అమలులో వుంటవి; అయితే,

1) అంతరంగిక శాంతిభద్రతలు రక్షించటానికి నిజాంకు సహాయపడుటకు సైన్యములు పంపుటకుగాని,

2) యుద్ధ కాలములో, నిజాం అంగీకారముతో ఇందుకు అంగీకరించుటకు నిజాం అసమంజసముగా నిరాకరించరాదు—మరియు శాంతిసమయముగా వుంచబడిన సేనలు యుద్ధకాలము గడచిపోయిన ఆరు నెలలలోగా ఉపసంహరింపబడవలెను—తప్ప హైదరాబాద్ సంస్థానములో సైన్యములను నిలువ వుంచుటకుగాని, ఈ ఒడంబడికవలన అధినివేశమునకు ఏహక్కు, బాధ్యత లేదు.

2 వ షరతు: ఈ ఒడంబడిక ప్రయోజనములను సక్రమముగా అమలు జరుపుటకు హైదరాబాద్, ఢిల్లీలలో పరస్పర ప్రతినిధులను నియమించుకొని, వారు తమ కర్తవ్యమును సక్రమముగా నిర్వహించుటకు అన్ని సౌకర్యములు కలుగజేయుటకు భారత ప్రభుత్వము అంగీకరించుటమైనది.

3 వ షరతు: (1) ఇందులో ఏభాగములోగాని సార్వభౌమత్వాధికార విధులు కలిసియుండుటగాని, కలుపబడుటకు అవకాశముగాని, సార్వభౌమత్వసంబంధములు ఏర్పాటుచేయుటకుగాని, ఏమాత్రము వీలు లేదు.

2 ఇందులో. ఏభాగమువలనగాని, దీని ప్రకారము చేయబడే ఏకార్యమువలనగాని, ఈ ఒడంబడిక రద్దయిపోయిన తేదీ తరువాత, ఏపక్షమునకు ఎటువంటిహక్కులు సంక్రమించవు, మరియు, ఇందులో ఏ భాగమువలనగాని, దీనిప్రకారము చేయబడే ఏకార్యమువలనగాని, ఈ ఒడంబడిక లేకపోయినచో, ఉభయపక్షములకున్నహక్కులలో ఈఒడంబడిక రద్దయిపోయిన తరువాత ఏమాత్రము తగ్గించబడవు.

4 వ షరతు: ఈ ఒడంబడికను గూర్చిగాని, ఇందువలన సాగిస్తూండబడిన ఒడంబడికలు, ఏర్పాట్లనుగూర్చిగాని సంభవించే తగాదాలు, ఉభయపక్షములచే చెరియొకరుగా నియమింపబడి, అయిద్దరిచే ఎన్నుకొనబడిన మరొకరు, ముగ్గురు సభ్యులుగాగల మధ్యవర్తిసంఘముచే పరిష్కారము చేయబడుటకు దాఖలు చేయవలెను.

5 వ షరతు: ఈ ఒడంబడిక వెంటనే అమలులోనికివచ్చి ఒక సంవత్సరకాలము అమలులోనుండును.

ఇందుకు అంగీకారముగా ఇండియా గవర్నర్‌జనరలున్నూ, హైదరాబాదు, బేరార్‌ల నిజామున్నూ తమచేవ్రాళ్ళు చేయుటమైనది.

(1) మీర్ ఉస్మాన్ అలీఖాన్
(హైదరాబాద్, బీరార్ నిజాం)

(2) మౌంట్ బాటన్ ఆఫ్ బర్మా
(ఇండియా గవర్నర్ జనరల్)

అల్లసాని పెద్దన

(10-వ పేజీ తరువాయి)

మెంత అని విమర్శించారు. ఆ విమర్శలు చదివి నప్పట్నుంచీ, మనవాంధ్ర నాటక కాలనిర్ణయ సిద్ధాంతం మన గ్రంథాలక్కూడా పట్టుందా లేదా ని విచారించడ మారంభించారు.

పె : ఊహూ—

నే : ఆగండి తాతగారూ, నన్ను చివర్లా చెప్పనీండి ఆ సిద్ధాంతాన్ని తమ గ్రంథానికి పట్టిస్తే:—'ఒకనాటి కుతపకాలమునందు' అన్నారు కాబట్టి ఆ కాలమందు యోగి వచ్చా డన్నమాట: తర్వాత ప్రవరుని అలవాట్నిబట్టి భోజనానంతరం తీర్థయాత్రా సంభాషణ జరి గుండాలి: అది జరిగింతర్వాత సిద్ధుడు మందు రాసిపోవాలి: 'ఆ మందిడి యతడరిగిన భూమీసుతుడరిగె' అనడంవల్ల నాడే ప్రవరుడు హిమవత్పర్వతాని కెళ్ళుండాలి: "మధ్యాహ్న ముండెల్పెడుక్" అనడంచేత, అతిథిపూజకోసం రెండు ఝాములైతేగాని భోం చేయరుకదా. మధ్యాహ్నమంటే రేమిటా అని—

పె : కాలసిద్ధాంతమంటే యిదా! తెలి సింది. హిమవత్పర్వతంలో నెంతకాలమున్నాడు, తర్వాత సూర్యాస్తమయవర్ణ నంచిగడా, ఆ మన్య హిమకంతిపర్యటనం, వరూధినీ దర్శనం, సంభాషణ అన్నిటికీ వ్యవధివుందా, పైకథా కాలపరిమాణ మెంతా, అనికాదూ మీ సిద్ధాంత ప్రయోగం?

నే : (సంతోషంతో) చిత్తం, సూక్ష్మ గ్రాహులు: తమరు చూపిస్తే అంటుకుపోతారు!

పె :(ముక్కుమీద వేలేసుకుని) నీ చూపిస్తే అంటుకుపోవడం చల్లగా వుండా! ఇదేం సిద్ధాంతం! యిదేం పాపకర్మం! ఏమిటీ?! తెల్లాళ్ళ వాఙ్మయానికి పట్టిందీ యీ తెగులు! దాన్ని మన వాఙ్మయానిక్కూడా పట్టించాలనీ మీరంధి?! రామరామా! ఇట్లాటి విమ ర్శొస్తుందని మేమంతా యెరక్కరాస్తిమే! ఏమిటీ? ఒక్కొక్క కావ్యంలో కథ యెంత కాలపరిమాణాన్ని నిరూపించాడనా? వెయ్యేం డ్లవుతుంది, నూరేండ్లవుతుంది, యేడాదౌతుంది, నెలౌతుంది, దినమౌతుంది, లేకపోతే ఒక్క ఘడియో, విఘడియో, రెప్పపాటో అవుతుంది. ఈ కాలపరిమాణం తెలియడంవల్ల నయ్యే రస పోషణేది, జ్ఞానాభివృద్ధేది? మేమింటాకన్న చెత్తను పోగుజేయడం క్రింది కృషన్నమాట— ఓరి, మీ విమర్శ బంగారంగానూ! (కొంచెమాగి) సరే, మీ సిద్ధాంతదృష్ట్యా మా గ్రంథాన్ని విమర్శిద్దాం. దాన్లో కథ జరిగి కొన్ని కోట్ల సంవత్సరాలైంది. ఒకడి చిన్నతనంలో జరిగిందే మనస్సుకుబట్టే విషయమైతే నిన్నో మొన్నో జరిగినట్లుందే, కవి అంత మనస్సుకు పట్టలేనికథ నెత్తుకోనేయెత్తుకోడే. ఎత్తుకున్నప్పు డిప్పుడు జరుగుతున్నట్లు వ్రాస్తేగాని అది సర్వాదరణీయం కాదే. అట్లాటప్పుడు దానికాల పరిమాణ నిర్ణయానికి దిగితే ఆకథేమాగుతుంది? తర్వాత ఒక కథలో వెనుక జరిగిందీ, ముందు జరిగిందీ, ఇప్పుడు జరిగిందీ ఉండొచ్చునే భూత భవిష్యద్వర్తమానకథాసరళులకు విపరీతకాల పరి ణామ వ్యత్యాసాలుండొచ్చునే అవన్నీ మీ సిద్ధాంతంతో కొల్చికూర్తే దాంతోనే ప్రయోజ నం వెలగబడ్తుంది. కాదయ్యా, ఓపికపట్టి పని లేనివాడెవడో కూర్చుని కూరుస్తాడు ఎందుకు పనికొస్తుందది. తద్దృష్ట్యా పరీక్షించి లోపా లోపాలు మీరంతా నిర్ణయిస్తారనుకుందాం. దాంతో మా మనుచరిత్రకు వన్నెతరుగుతుందా, వాసి తరుగుతుందా? మీ విమర్శనాశక్తి బాగుం దనుపిస్తుందా?

నే : అదేమండీ? కాలసిద్ధాంతవిమర్శతో నాంగ్లవాఙ్మయ మెంత పెరిగిందనుకుంటారు!

పె : ఓ నాన్నాయనా! రవ్వ ఒక పలుకులా గుంటుంది కాని అడ్డమైన నెత్తా పోగు జేస్తే పెద్ద కుప్పవుతుంది.

నే : తమ కా సిద్ధాంతం పనికిరాదన్నమాట.


పె : (కొంచెముండి) పనికిరాం దన్నమాటే మిటి.—వట్టి పనికిమాలిన సిద్ధాంత మన్నమాట. ఈ కథలో ముందు భాగానికి తర్వాతి భాగా నికి బహుశా యింతకాలం జరిగుంటుందని యెవడైనా ఛాందసవ్యాఖ్యాతంటే బాగుం టుందేమో కాని మిగతావాండ్లకది నిరర్థకం.

నే : పోనీండి తాతగారూ: మరొక విష యం:—ఆ గ్రంథం ద్వితీయాశ్వాసమంత బాగుండవేం మిగతా ఆశ్వాసాలు.

పె : ఇట్లాటి శంకల కేమని సమాధానం? గడుసుతనంగా అదిబాగుంది కాబట్టి, అందా మంటే సమాధానం కాదైపాయె! ఏదో విప్పి చెబితేగాని నీకు సంతుష్టిగానుండదు కాబట్టి చెబ్తాపట్టు. మొదట కథకూడా ఒక వస్తువే. ఏ వస్తువుకైనా రుచి సమగ్రంగా వుంటుందా? చిన్న ఉదాహరణం వంకాయ. తొడిమ దగ్గర రుచి మిగతా చోట్ల నుండదు. ఆ కథకంతా మూలమా ఆశ్వాసంలో ఉంది. మిగిల్న భాగాలకంటే అక్కడి కథ రసవంతమైంది. అందుకని మిగిలిన వాట్లోకంటే రుచిమంతంగా వుంది. కాని గ్రంథాన్నట్లా పరిశీలించకూడదు. మిగతా ఆశ్వా సాల్లో నున్న విషయాల్ని తీసుకుని అవి యిత రత్రా కనుపించి నటువంటి విషయాలకంటే బాగున్నాయో లేదో చూడాలి. వేట నుదా హరణంగా తీసుకో. వాఙ్మయంలో నున్న వేట లకు మా వేటకు నేలాటి పోలికుందో గమనిం చాలి. అప్పుడు తేల్చాలి. మా మత మేమిటంటే, చదువుకోవడానికి వినడానికి మీ కా ఆశ్వాస మెంత యింపుగా గనబడ్డా మిగతావి వాట్లో నున్న విషయరసవత్తరీత్యా దానికి తీసిపోవు. దానికొక్క వెసిలిక చిక్కింది, అందులోని చక్కని శృంగారం. శృంగారరసం అందరికి నచ్చినట్లు మిగిల్నవి నచ్చవు. దాన్లోకూడా వరూధినికద్దనడం, ప్రవరుడు వద్దనడం మాశక్తి వంచన లేకుండా వర్ణితాలయ్యాయ్. అట్లాటి ప్రసంగం అందరికి విన నింపుగా వుంటుంది కాబట్టికూడా దాని ఆధిక్యత యేర్పడింది. ఇత రాశ్వాసాల్లో విషయాలపట్లకూడా మనసా అట్లాటి అభిమానమే పట్టించుకుని విమర్శిస్తే అవి దానికి తీసిపోవని మే మన్నది నీకు నచ్చక తప్పదు.

నే : గ్రాహ్యమేండి. ఇక—తమరు వరూధి న్నన్యాయం చేసారని మేమంతా అనుకుంటాం.

పె : ఇది పెద్ద శంకే. దీనికి మనుచరిత్ర శిల్పాన్నంతా విమర్శించాల్సొస్తుంది. ఐనా సూలంగా ముచ్చటిస్తా. ఆమెనెట్లా అన్యాయం చేసా? ప్రవరుడిచేత ఊఁ అనిపించలేదనా? అట్లా గైతే ప్రవరుణ్ణిమటు కన్యాయం చేయలా అట్లాటి కామినితో ప్రసంగం కుదిర్చి? పవిత్ర శీలుణ్ణి, కామప్రపూర్ణ యైన కాంతామణిని ఏకాంతంగా తారసిల్లజేస్తే యే యవస్థ కలుగు తుందో దాన్ని వర్ణించాం. అందులోది? జరిగిం దన్యాయమైతే అది యీశ్వరుడికే తోచిందా అన్నట్లు తర్వాతి కథలో నతని స్వరూపంతోనే ఆ కామిని వాంఛ తీరిందిగా? అసలు ప్రవరు



ఆక్టింగ్ గవర్నర్ జనరల్‌గా అధికారాన్ని స్వీకరించిన అనంతరం, మంత్రివర్గసభ్యుల అభినందనల నందుకొంటున్న శ్రీ రాజగోపాలాచారిగారు.

డన్నావ్. అతని పనైపోయిందికాబట్టి అతని సంగతి మళ్లీ తడవాల్సినపని లేకుండా పోయింది.

నే : (కొంచెం విచారించి) బాగుందికాని తమరూ జరిగిం దన్యాయమా అనుకున్నట్లు "మహీసురాధము డహంకృతితో నని రోష భీషణ స్ఫురణవహించెనో యన నభోమణి దాల్చె గషాయ దీధితిన్" అన్నారేం? అదంతా నేను మీకు వరూధినిపట్ల గలిగిన సానుభూతికి ప్రబల నిదర్శనమనుకుంటున్నా. నేనే గాదు మా కాలం వాండ్లు చాలామం దట్లా గనుకుంటారు.

పె : ఓరీ మీ కాలంవాండ్లు చాలా మందితో మాకు చావొచ్చిందే? తోచిన విమర్శనల్లా విసురారే! ఏమాలోచిం చన్నారట్లా? వర్ణన్ని కథతో గలిపితే యింకా అందంగా వుంటుందని చేసిందాన్ని మా సానుభూతిక్రింద తిప్పారూ? కవిమనస్సు కథలో లీనమై తిరుగుతుంది. ఆ సందర్భంలో నట్లా వ్రాస్తే బాగుంటుం దని వ్రాసాం. రసపోషణకు చిక్కిన వీలును వదలు కునేకవి కవౌతాడా? అట్లాగాకుండా ప్రవ రునివంటి పవిత్రుణ్ణి యీ కామినిట్లా చేస్తుందా అని సూర్యుడికి కోప మొచ్చిందంటే యెట్లా వుంటుంది? అదీ అనేవాండ్లమేమో పైకథ ట్లా జరక్కుంటే. ఏదోవిధంగా ఆ కోర్కె యీడే ర్తుందా లేదా? అట్లా సూర్యభగవానునకే కోప మొచ్చిం దనడంలో దానిసూచనకూడా వీలుం దా లేదా? అందుకనికూడా అట్లా వ్రాశాంగాని ప్రకృత విషయం జరిగిన కథనుసరించిన న్యాయాన్యాయ పరిశీలన మేమాత్రం లేదు.

నే : బాగా తెలిసిందండి. తమ వర్ణన్లు కొండ వీటి చాంతాళ్లా వుంటాయేం? క్లుప్తంగా జేయక పొయ్యారా?

పె : (ఆశ్చర్యంతో) ఏమిటీ? కొండవీటి చాంతాళ్లా!

నే : అవునండీ. సూచనాస్వరూపమైన వర్ణనే రసవంతమని తెల్లాడిమతం.

పె : ఏమిటీ? తెల్లాడిమతమా?! వాడిమతా న్నే అనుష్ఠించి మీరంతా వాడిదేశం పోరాదూ యీ పనికిమాల్ని దేశంలో నుండకుండా? సమస్త విషయాల్లో వాడి సిద్ధాంతాల్నే అనుసరించ రాదూ ఇట్లా మా ప్రాణాల్దీయకుండా?! ఏమి టేమిటీ వర్ణన్లు కొండవీటి చాంతాళ్లా? వాట్ని సరిగ్గా చదివారూ, చదివితే అర్థంచేసుకున్నారూ. ఓపిగ్గా జదివితే ఒక్కొక్కటందంగా వుందా లేదా? సాంప్రదాయాన్ని పరీక్షించారా యెప్పుడైనా? వాల్మీకివ్యాసుల వర్ణనెట్లా వుం టాయ్? మంచివస్తువులకు బారెడేసి వర్ణ న్లుంటాయ్. మనపడగ్గదుల్లో వున్న పటాలన్నిట్ని వరసెట్టి వేలగడ్తారు. నగల్తూస్తే రకరకాల నగలూ వేస్తారు. విందొస్తే వింత వింత పదా ర్థాల్ని సంతరించి వంట జేయిస్తారు. ఉపన్య సిస్తే పూర్వపక్షాలన్నిట్నీ రాద్ధాంతాలు చేసి సిద్ధాంతం జేస్తారు. ఒకటేమిటి, ప్రతిదాన్లో పరిపూర్ణత కోసం పాటుపడ్తారు. ఈ సాంప్ర దాయం కవితావర్ణన కెందుకు బట్టదూ? పొరు గింటిపుల్లగూరకు మల్లే మాకూర లేదన్నట్లుంది.

నే : అదేమిటండీ పొరుగింటివంట బాగుంటే మన మట్లా వండుకుంటే తప్పాండీ?

పె : తప్పని ఎవరన్నారు? వండుకోండట్లా టిది, మీ యిష్టమొచ్చినట్లారగించండి. మా అమ్మ మ్మట్లా వండేది కాదుకాబట్టి ఆమె వంట బాగుండ్లేదనొద్దు. ప్రకృతం తెల్లాడిరాత బాగుంటే అట్లాగే రాసుకోండి, మాకేం లోపం? దాని పాప పుణ్యాలెరుగని మమ్మల్నెందుకు విమ ర్శించడం? మా రాతలు బాగుండ్లే దనుకుంటే వాట్ని చదువుకో బోకండి.

నే : అమ్మ నాయనో! అట్లాగంటే యెట్లా గండోయ్! మాకున్న ఆధారమంతా మీ వ్రాత లైతే. అయి బాబో! మేం వాట్ని వద ల్లేమండోయ్!


పె : అయితే ఎక్కడెక్కడో కొత్తల్తూచి, అది మా పూర్వులకు లేదని వాండ్ల నెక్కిరించ కండి. సరే; ఇక నేను పొయ్యేదా?

నే : చిత్తం. తమర్తో ఇంకా చాలా మాట్లాడా లనుకున్నాను. ఇంత సొద్దోం దనుకోలా.

పె : సరే, రేపురా.

నే : చిత్తం. వెళ్లివస్తా.

(నిష్క్రమణ)



ఎలిజబెత్ - మౌంట్ బాటన్ వివాహం జరిగిన వెస్ట్‌మినిస్టర్ అబీ

నారాయణ భట్టు

(6 వ పేజీ తరువాయి)

"ధనుర్విద్యయందు నీకు కౌశల మున్నదని తెలియుచున్నది. వేదబాహ్యుని వాక్కువలె శ్రుతివలె నీయందా విద్య శోభించనేరదు. నీయందు మాకున్న వాత్సల్యముచే పూర్వమిచ్చిన బిరుదు లాంఛనములు గౌరవములు ఈ క్షణము నుండి యుపసంహరించుచున్నాము. అరత్ని ప్రమాణము కల ఖడ్గముమాత్రము ధరించుటకు అనుజ్ఞ ఇచ్చుచున్నాము.

ఆ మాటలు వినినవెంటనే కామరాజపుత్రుడు ఆసనమునుండి లేచెను. లేచి శాంతముగా తాను ధరించియున్న గౌరవలాంఛనము లన్నియు నొక్కటొకటై రాజరాజు పాదముల సన్నిధిని నివేదించెను. సభ నిర్వాక్కుగా నుండెను;

మరల రాజరాజు మాటలు వినబడెను. అతడు కాముని సోదరులకు విజయాదిత్యుడు, విమలాదిత్యుడు, విక్రమాదిత్యుడు విష్ణువర్ధనుడు, రాజమార్తాండుడు—అను వారల దిక్కు తిరిగి మాటాడెను.

"మీరు మీ సోదరునియం దభిమానముచేత సభాముఖమున చెప్పినది నేను విశ్వసింపలేను. మీరందరికముందు ధర్మదీక్ష అలవరచుకొనవలసినదని ఆజ్ఞాపించుచున్నాను."

వా రైదుగురును శిరస్సులు వంచుకొనిరి.

అంతట రాజరాజు కనుసన్నతో రాజమయ్య ప్రభువు నెదుట నుంచిరి.

"నీవు సమర్థతతో నీ బ్రాహ్మణుని రెండు మారులు కాపాడినావు, నీకు దండనాథపదవి ప్రసాదించుచున్నాము. ముందుకూడ నీ రాజభక్తి ప్రకటించుకొనవలెను."

అని రాజరాజు వాక్యములు వినబడెను. వెంటనే గండాచార్యుడు ఆజ్ఞాపత్రము వ్రాసి, రాజముద్రిక వేయించి రాజరాజు పీఠికముందుంచెను. అది రాజరాజనరేంద్రుడు స్వహస్తముతో ప్రసాదింపగా రాజమయ్య వంగి 'మహాప్రసాద' మని యందుకొని పత్రము రెండు కనుల కద్దుకొని రాజరాజుకు నమస్కరించెను. రాజాజ్ఞతో నతనికి దండనాథ లాంఛనము గు వనిపత్రము ప్రసాదింపగా నదియు రెండు చేతులతో నందుకొని కన్నుల కద్దుకొని, యది చేతులనుంచుకొని "ఇది సర్వలోకాశ్రయ శ్రీ రాజరాజ విష్ణువర్ధనుల సేవయం దుపయోగింతు" నని ప్రమాణము చేసెను.

మరల రాజరాజు వాక్కులు వినబడెను:

"కామరాజపుత్రా, నీవు చేసిన యపరాధములు తీవ్రమైనవి. మాకు నీయం దున్న వాత్సల్యముచే మా నోటితో శిక్ష విధింపలేకున్నాము. సభ్యులుగా నున్న మంత్రులు, దండనాథులు, విద్వాంసులు, నారాయణభట్టారకులు, ప్రాడ్వివాకులు శిక్ష సూచింపవలెనని మా యాజ్ఞ!"

అట్లనుచు ఒక్కొక్కరివంక మహారాజు చూచెను. ఎవరును మాటాడలేదు. తుదకు ప్రాడ్వివాకు డిట్లు వచించెను:

"దైవానుగ్రహమువలన బాణహతుడైన యీ బ్రాహ్మణుడు జీవించియున్నాడు. కనుక ఇట్టి దోషికి ఎట్టి యాస్తియు లేకుండజేసి యావజ్జీవము కారాగారములో నుంచుట శిక్ష. ఖడ్గము నుంచుట కేవలము దయ చూపుట!"

రాజరాజు ముందు నారాయణభట్టువంక జూచెను. నారాయణభట్టు వినయముతో తల వంచి మాటాడలేదు. పిమ్మట దండనాథులవంక జూచెను. వారు మాటాడలేదు. అంతట వజ్జియ ప్రెగ్గడవంక జూడ నతడును మౌనము వహించెను. విద్వాంసుల నితరసభ్యులును మౌనము వహించిరి. సభయంతయు మౌనము వహించెను.

రాజరాజే మరల పలికెను.

"సభామౌనము ప్రాడ్వివాకుని వాక్యముల మోఘములని నిర్ణయించుచున్నది. కామునికి ఇకముందు ఎట్టి యాస్తియు నుండదు. యావజ్జీవము కారాగారములో నుండవలెను. ఒకకత్తి ధరించుట కిచ్చిన అనుజ్ఞకు భంగ ముండదు."

లేఖకుడగు గండాచార్యుడు వెంటనే పత్రము లిఖించి ప్రాడ్వివాకునికి జూపెను. అంత రాజానుమతితో రాజముద్రిక ముద్రాధికారి దానిపై వేసెను. ఇద్దరు రాజభటులు కాముని కిరుప్రక్కల వచ్చి నిలువబడిరి.

కాముడు వినయముతో చేతు లొగ్గి యొక్క వినతి చేసికొనెను:

"మహారాజా, ఒక్క మనవి కలదు. అనాదిగా కుబ్జవిష్ణువర్ధనుల కాలమునుండి యిది కల్యాణ కటకేశ్వరులకు సామంతరాజ్యము. నేను నిర్దోషిని, తమ తీర్పుపై కుంతలేశ్వరులకు పునర్విమర్శనార్థము వినతిచేసికొన ననుజ్ఞ వేడెదను!"

సభయంతయు నతని సాహసమునకు నివ్వెరపోయెను. అతని సోదరులే నిర్వాక్కులైరి.

రాజరాజు జాతని సేసికొని పొమ్మని భటులకు సంజ్ఞ చేయుచు ధర్మాసనమునుండి అభ్యంతరమందిరమునకు బోవుచుండెను. శిక్షితుని ముఖము చూచుట సార్వభౌముడు చేయదగనిపని!

భటు లిద్దరు కాముని రెండుచేతులు బట్టుకొనిరి. ఆకస్మికావేశముతో నతడు వారిద్దర విదలించి త్రోసివేసెను. వారు మరల పట్టుకొను నవకాశమున నతడు "ఇట్టి పక్షపాతముతో కూడిన నిర్ణయమునకు నేను బద్ధుడను గాను. అధర్మము నన్ను బంధింపలేదు." అనుచు భీకరగా నగచుచు తన కనుమతియిచ్చిన కత్తితో బలముగా రొమ్ములో పొడుచుకొని రాజసభాంతరమున పడిపోయెను.

౧౭

నరనారాయణసమాగమము

కాముని సాహసవచనములకును సాహసచేష్టకును సభయంతయు జలదరించెను. కాని శిక్షితుని స్థితిగతులు రాజభటులేగాని సభాసదులు ప్రత్యక్షముగా జోక్యము కలిగించుకొని చూడరాదు. కాముని సోదరులుకూడ నతనిరొయ్యగరబోలేదు; అతని బలుకరించలేదు; అతని కుపచారములు చేయలేదు. రాజసేవ యంత కఠినము! రాజభటులే యాతని నావలకు దీసికొని పోయిరి.

నన్నయభట్టారకుడు ప్రేమాతిశయముతో నారాయణభట్టు కడకు వడివడి వచ్చెను. దగ్గరకు వచ్చినంతనే నన్నయను నారాయణుడు గాఢముగా కౌగిలించుకొనెను. ఇరువురకు కన్నులార్ద్రి మయ్యెను.

"నారాయణా, నేనుకూడ గుర్తుపట్టలేకుండ మారిపోయినావేమి?"

ఏడేండ్లు మంత్రిత్వము చేసిన ఫలము" అనుచు తన నాసాగ్రము బలవంతమున పీకి నన్నయ చేతి కిచ్చెను. రక్తములేని యా మాంసఖండము చూచి నన్నయ ఏవగించుకొనుచు క్రింద పారవైచెను. ఇంతలో రెండు చెవుల ఖండములు దక్షిణగండభాగమునందలి కండయు పీకి యవికూడ నన్నయ చేతబెట్టి, 'నా దేహఖండములవి దగూడ నిని నింత అసహ్యమా?" అని నారాయణు డనెను.

నీరక్తములగు నా కండలుగూడ క్రిందపారవేయుచు నన్నయ, "ఈ నత్తి ఎక్కడ సంపాదించితివి?" అని యడిగెను.

"నత్తియా? మంత్రిత్వము వదలిన తర్వాత ఇక్కడికి వచ్చుచుండగా దారిలో దొరికిన దీ నిధి."

నన్నయ తలయెత్తి నారాయణుని ముఖము తిలకింపగా పూర్వరూపము వచ్చియుండెను.

"వేషధారీ!" అని నన్నయ యనుచుండగా వృద్ధుడగు భీమనభట్టు అక్కడికి వచ్చెను. నన్నయ యతని జూపి "నారాయణా, నీకు ... నుండమని నాకు ప్రేమపూర్వకముగా నుపదేశించిన వాడే భీమనభట్టు. ఇతడు మనకు పూజ్యుడు. నమస్కరింపుము!" అనెను.

నారాయణుడు ప్రయత్నపూర్వకముగా చేయి రొత్తి రెండు చేతులు కలపి భీమనకు నమస్కరించెను.

"ఇదుగో చెట్టనభట్టు, భీమన కుమారుడు. ఇతని కవిత్వము మధురమైనది. ఇదు పావులూరి మల్లన, మన కాస్తకోటిలోనివాడు పాప మీతనిపై దండయాత్ర చేసితివి వెనుక. ఇతని కవిత్వము శాస్త్రానుకూలముగా నుండును. గణితములో మేటి. ద్రవిడ కర్ణాట భాషలలో గూడ ప్రవీణుడు.

నారాయణభట్టు కూడిన కవుల నందరను ఆదరదృక్కులతో గౌరవముతో దిలకించెను. కాముని రక్తము చిందిన యా సభామధ్యమున నా కవీశ్వరుల సమావేశ మొక చిత్రశోభతో వెలుగొందెను. ఆ కవిసమ్మేళనములో కాముని రక్తము మరపు తగిలెను. వారి మనస్సులలో కేవలము నారాయణుని గాయమే కలతపరచుచుండెను. వీర్యవంతమగు కాలమున దుర్మార్గులు సాహసకృత్యములుచేసి యుత్తమజనుల మెప్పింపగలరా? రాజసూయ సభాంతరాళమున శిశుపాలుని మస్తకము తెగటారగా శిశుపాలుని ముఖ్య బంధువులు కాక యితరు లది గ్రహించిరా? ఆదిరాజనిభుడగు రాజరాజు నాస్థానమున దోషిగా నిర్ధారితుడైన వాని చర్య ధీర పురుషులను కలంచునా?

కవులందరు నారాయణుని చుట్టు మూగిరి. అతని ప్రతిభ నన్నయ పూర్వప్రసంగములవలన నారందరెరిగినదియే. మరియు నామధ్యమ్ము గనుమహాదేవి అర్చన సమయమున నాతడు చెప్పిన పద్యములవలన నతని కీర్తి కవి పండిత లోకములో ప్రాకిపోయియుండెను.

"ఇన్నాళ్ళు నాకు చిక్కకుండ దొంగవలె తప్పించుకొంటివి. ఇట్టి దొంగపను లెప్పటినుండి నేర్చుకొంటివి?"— నన్నయ ప్రశ్నించెను.

(22-వ పేజీ చూడుడు)

నేటి ప్రపంచం

[5 వ పేజీ తరువాయి]

తెలుస్తున్నది. ఏది ఏమైనప్పటికీ, అంతర్యుద్ధ పీడిత చైనాకు అమెరికా చేయవలసినంత సహాయం చేయడం లేదన్నమాట నిజం. అమెరికా యూరప్ ఖండ వ్యవహారాలలో ఒక వైఖరినీ, ఆసియా ఖండ వ్యవహారాలలో మరొక వైఖరినీ కనబరుస్తున్నది. సరియైన ఆర్థిక, ఆయుధ సహాయమే లభ్యమైతే చాంగ్-కై-షేక్ ప్రభుత్వానికి కమ్యూనిస్టులు ఏనాడో దాసోహమనవలసి వచ్చేది. అమెరికా విదేశమంత్రి జార్జిమార్షల్ చైనాకు 30 కోట్ల డాలర్ల సహాయం చేయదలచినట్లు ప్రకటించాడని తెలిసి మార్షల్ చాంగ్-కై-షేక్ ఇలా అన్నాడు. "అమెరికా మాకు చేయదలిగిన సహాయం ఈ పాటిదే అయితే, స్వయం సహాయం కోసం ఇక మా తిప్పలు మేము పడవలసిందే. చైనా ప్రజలు ఓర్పు వహించాలి. జపానుకూ మనకూ యుద్ధం ప్రారంభమైన మూడున్నర సంవత్సరాలకు గాని, మనకు సహాయం చేయాలనే ఉద్దేశం అమెరికాకు కలగలేదనే విషయం జ్ఞాపకం వుంచుకోండి." ఏది ఏమైనప్పటికీ చైనా జాతీయ ప్రభుత్వంపట్ల అమెరికా అనుసరించదలచిన వైఖరి ఏమిటో, బాహ్య ప్రపంచానికి గాని, చైనాకు గాని ఇప్పటి వరకూ స్పష్టంగా బోధపడనిమాట వాస్తవం. అంతర్యుద్ధ పర్యవసానం విషయంలో తన ప్రజలు ఏమాత్రం భంగపడవలసిన అగత్యం లేదని చాంగ్‌కైషేక్ ధైర్యం చెబుతున్నప్పటికీ, ఆసియాఖండంలో భారతదేశంతోపాటు నాయకత్వం వహించవలసిన చైనా పరిస్థితి నిరాశాజనకంగానే వున్నది.

* * *

పాలస్తీనాను యూదు, అరబ్ రాజ్యాలుగా విభజించవలసిందేనని ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశంకూడా మూడింట రెండువంతుల మెజారిటీతో నిర్ణయించింది. ఇప్పటికి మూడు నెలలనుంచీ జరుగుతున్న ఐక్యరాజ్యసమితి సమావేశం పాలస్తీనా విభజన నిర్ణయంతో నవంబరు 30 వ తేదీన సమాప్తమైంది. విభజనకు అనుకూలంగా 33 వోట్లు, ప్రతికూలంగా 13 వోట్లూ వచ్చినవి. మొత్తం పదిదేశాలు ఈ వోటింగులో పాల్గొనలేదు. సమితి నిర్ణయంపట్ల తమ ఆక్షేపణను తెలుపుతూ ఇండియా, పాకిస్థాన్ ప్రతినిధులు, అరబ్ రాజ్యాల ప్రతినిధులు సభాస్థలి నుంచి నిర్గమించారు. బ్రిటిష్ మాండేటరీ పరిపాలన పాలస్తీనాలో 1948 ఆగస్టు 1-వ తేదీనాటికి సమాప్తమవుతుంది. ఎక్కడో లేక్ సక్సెస్‌లో సమావేశమైన ఐక్యరాజ్య సమితి పాలస్తీనా భవిష్యత్తును ఈ విధంగా తేల్చివేయదలచిందిగాని, ఆ నిర్ణయాన్ని ప్రత్యక్షంగా పాలస్తీనాకు వెళ్ళి ఐక్యరాజ్యసమితి సభ్యులు అమలు జరపడానికి వీల్లేదు. బ్రిటిష్ వారు నిష్క్రమించగానే, ఐక్యరాజ్య సమితి ప్రత్యేక సంఘం విభజన పథకాన్ని అమలు జరుపుతుంది. ఈ ప్రత్యేక సంఘంలో శిరియా, చెకోస్లవేకియా, డెన్మార్కు, పెనామా, ఫిలిప్పైన్ దేశాల ప్రతినిధులు వుంటారు.

పాలస్తీనా విభజనకు చేసిన నిర్ణయం ఫలితంగా ఐక్యరాజ్య సమితి తన ఉన్నతాశయాలకే స్వస్తి చెప్పిందనీ, అది ప్రపంచశాంతిని కాపాడగలదనే ఆశ అంతరించిందనీ, ఈ విభజన పథకాన్ని తమ బొందిలో ప్రాణాలున్నంతవరకు ఘోరంగా ప్రతిఘటించి తీరుతామని అరబ్ రాజ్య ప్రతినిధులు హెచ్చరిక చేస్తున్నారు. విభజన అమలు జరగకుండా యూదులను ప్రతిఘటించడమే యిక గత్యంతరమని అరబ్ లీగు ప్రధాన కార్యదర్శి అజ్జాంపాషా అంటున్నాడు. ఒక్కొక్క అరబ్ రాజ్యం 10 వేలమంది సైనికులను పంపించి సహాయపడి పాలస్తీనా విభజన పథకాన్ని ప్రతిఘటించటానికి నిర్ణయించింది. ఈ నిర్ణయంలో కొంత భాగాన్ని ఆచరణలో పెట్టడానికి అరబ్ రాజ్యాల ప్రభుత్వాలు ఉపక్రమించినట్లు తెలుస్తున్నది.

అరబ్ రాజ్యాల ఆశయాలకు విరుద్ధంగా పాలస్తీనా విభజనను అమలు జరిపితే మధ్య ప్రాచ్యంలో ఘోర రక్తపాతం సంభవించడం తథ్యం.

పర్షియా పెట్రోల్ గనుల విషయంలో రష్యా పర్షియా సంబంధాలు కూడా త్వరలోనే తెగిపోయే సూచనలు కనిపిస్తున్నవి. అజెర్బైజాన్ రాష్ట్రంలో ఇదివరకు పర్షియాకు ప్రతికూలంగా పనిచేసిన కమ్యూనిస్టు టూడే పార్టీ వారు తిరిగి ప్రతికూల ప్రదర్శనలు ప్రారంభించారు. పర్షియాలో ఘవాం సుల్తానే ప్రభుత్వం తొలగిపోయి సోవియట్ రష్యా వైఖరిని పటుతరంగా ప్రతిఘటించగల మరొక ప్రభుత్వం ఏర్పడవచ్చు. మధ్య ప్రాచ్య అశాంతిని, రగ్లను రెచ్చగొట్టడానికి ఇది కూడా సహాయపడుతుంది.

వీటన్నిటినీ బట్టి చూస్తే, తృతీయ ప్రపంచ సంగ్రామం ఈ సారి మధ్య ప్రాచ్యంలో ప్రారంభమయే అవకాశాలే ఎక్కువగా కనిపిస్తున్నవి.



బర్మా ప్రధాని థాకిన్ నూ

భారత రాజకీయాలు

[9 వ పేజీ తరువాయి]

పూర్వపుస్మృతి ఆయన మనోవీధులలో అప్పుడప్పుడు విహరిస్తూంటుంది. అటువంటి దురదృష్టసమయంలో ఆయన ఈ మధ్య ఒక ప్రకటన చేశాడు. పాకిస్థాన్‌లోని హరిజనులందరినీ భారతదేశం వచ్చివేయవలసిందని ఆదేశిస్తూ, భారత దేశంలో వారికి జరుగగల దుర్భరావమానాలను ఆయన చిత్రాతిచిత్రంగా వర్ణించాడు. భారత దేశంలో హరిజనులకు జరుగుచున్నదని ఆయన చెప్పిన దుర్భరావమానములు నూరింట ఒక గ్రామములో జరుగుచుండవచ్చును. పట్టణములలోను, అత్యధిక గ్రామాలలోను అస్పృశ్యతను ప్రజలు మరచిపోయినారు. వారికందరికీ ఆ విషయం డా. అంబేద్కర్ తిరిగి జ్ఞాపకం చేస్తున్నాడు. కాంగ్రెస్‌లో జేరవలసిందని హరిజనులనేగాక, మరెవ్వరినైనా నిర్బంధం చేస్తున్నారని బ్రిటిష్ ప్రభుత్వం కూడా చేయ సాహసించని ఆరోపణను డా. అంబేద్కర్ చేస్తున్నాడు. ఈయనమాటలను హరిజనులకు బాధ్యత వహించినవారందరూ నిరసిస్తారు; ఈయన చేసే ఆరోపణలు చాలవరకు సత్యదూరములని అందరికీ తెలుసును. అయినా బాధ్యతాయుత ప్రభుత్వములోనున్న వ్యక్తి, ఇతి బాధ్యతారహిత ప్రకటన చేసి వుండకూడదు. ఒకవేళ కాంగ్రెస్ హరిజనులకు నిజముగానే అన్యాయము చేస్తున్నచో తాను వారికి చేయగల్గినంత ఆ కాంగ్రెస్‌తోనే కలిసి పని చేస్తూ వుండుటయేనా!

* * *

మనఇంటిలో పెత్తనం మన చేతులలోనికి రాగానే విడిపోతామన్న సోదరులకు హృదయపూర్వకంగా వీడ్కోలిచ్చాము. తెలిసో, తెలియకో వారు మనను ఎన్ని యిబ్బందులు కలిగించినా, మనం వారికి శుభమునే కాంక్షిస్తున్నాము. కాని మననుంచివిడిపోయి, సాధించగలిగిన దేమీ లేదని వారిప్పుడిప్పుడే గ్రహిస్తున్నారు. అయితే, వారిధోరణిలో ఇంతమాత్రమునైనే మార్పు వచ్చినదని భావించరాదు. వీరెంతవరకు మనను నష్టకష్టముల పాలుజేయుటే మరి ప్రధానోద్దేశ్యముగా కనపడుతున్నది.

గురునానక్ జన్మించిన రోజు పరమ పవిత్రముగా ఎంచి, ఆ రోజున నన్కానా సాహెబ్‌కు యాత్ర చేయాలని సిక్కులందరు అపేక్షిస్తారు. ప్రతి సంవత్సరం ఆరోజున నన్కానా సాహెబ్‌లో గొప్ప ఉత్సవము జరుగుతుండేది. నన్కానా సాహిబు పశ్చిమ పంజాబ్‌లో వుండిపోయింది. కాని అక్కడకు యాత్ర వెళ్లాలని సిక్కులెంతో ప్రయత్నించారు; భారత ప్రభుత్వం కూడా వారి కోరికను బలపరచినది. పాకిస్థాన్ ప్రభుత్వం ససేమిరా వీలులేదనటం వల్ల, సిక్కులకు చాల ఆశాభంగం కల్గింది.

పశ్చిమ పంజాబులో చాల హిందూ, సిక్కు ధర్మాదాయ సంస్థలుండేవి. ఆ సంస్థలు ముఖ్యముగా పాఠశాలలు నిర్వహిస్తూండేవి. అక్కడినుంచి ముస్లిమేతరులందరు తరలి రావటంతో, పాకిస్థాన్ ప్రభుత్వమే వాటి నన్నిటిని వశపరచుకుని, పేర్లు మార్చి వేసి, తానుపయోగించుకుంటున్నారు. ఈ సంస్థలకు సంబంధించిన ఆస్తులను భారతదేశం చేర్చే విషయమై భారత ప్రభుత్వం శ్రద్ధ వహిస్తున్నది.

పశ్చిమ పంజాబు బ్యాంకులలో ముస్లిమేతరులు తమ బంగారు, వెండివస్తువులను, ముఖ్యకాగితములను దాచుకుని, వాని అక్కడనే వుంచి భారతదేశం వచ్చివేశారు. ఈ మధ్య వీరు లాహోరు వెళ్ళి అవి తెచ్చుకోవడానికి ప్రయత్నించగా ముందు ప్రభుత్వము తరువాత బ్యాంకులు అడ్డుపడడం వలన, నిరాశులై, వాని నక్కడనే వదలివేసి రావలసివచ్చింది. ఇటువంటి చిన్న చిన్న విషయాలలో గిల్లికజ్జాలు పెట్టుకొంటుండటం, అభివృద్ధిలోనికి రావలసిన ప్రభుత్వానికి తగదు. తూర్పు బెంగాల్‌లో హిందువులపై దౌర్జన్యములు ఎక్కువౌతున్న వనుఫిర్యాదులు తరచుగా వస్తూనే వున్నవి. పాకిస్థాన్ భవిష్యత్తులో మత సామరస్యమును చక్కగా కాపాడగలరు. అసలు ముస్లిమేతరులు వుంటేనే కదా, సామరస్యమును కాపాడవలసినది!

పాకిస్థాన్ ఆర్థిక, రాజకీయ రంగాలలో అప్పుడే కల్లోలం ప్రారంభమైనట్లు వార్తలు ఎక్కువగా వస్తున్నవి రాజకీయంగా జునాగడ్, కాశ్మీర్‌లలో ఓడిపోయి, ఐక్యరాజ్య సమితిలో అనామకంగా వుంటున్న పాకిస్థాన్ ఆర్థికంగా ఇబ్బందులకు ఆయువుపట్టు అయిన భాగాల్ని వదలి పడిపోయింది. సింధు రాష్ట్రములు ఎప్పుడూ లోటు రాష్ట్రాలే. పశ్చిమపంజాబ్ బీదపడి వున్నది. కాబట్టి ఆర్థికంగా పాకిస్థానుకు విపత్తు తప్పదన్న విషయం పాకిస్థాన్ ప్రభుత్వం గుర్తించినది. పాకిస్థాన్ నాయకులలో అప్పుడే భేదాభిప్రాయములు ఏర్పడుచున్నట్లు కూడా తెలుస్తున్నది. ఒకదువలన భారతయూనియన్‌తో మంచిగావుండి, వీరైతే అప్పు పుచ్చుకుని, ఆర్థిక విపత్తు గడవటానికి పాకిస్థాన్ నాయకులు ప్రయత్నిస్తున్నారు. ఈ ఉద్దేశ్యముతోనే ప్రధాని లియాకతాలీఖాన్ ఢిల్లీలో యిప్పుడు సమాలోచనలు జరుపుచున్నాడు. అవిభక్త భారత ప్రభుత్వ ఆస్తి, అప్పులలో నూటికి 17½ పాళ్ళకు బాధ్యత వహించటానికి ఈయన అంగీకరించాడు. ఆర్థిక విపత్తుకు తట్టుకోవటానికి తమకు రూ. 50 కోట్లు అప్పు యివ్వవలసిందని ఈయన భారత ప్రభుత్వాన్ని అర్థిస్తున్నట్లు తెలుస్తున్నది. అయితే, ఈ అప్పుసొమ్ము మనపై ఆక్రమణలు దండెత్తటానికిగాక సద్వినియోగం చేస్తారని నమ్మకం వుంటేనే అప్పు యివ్వాలి. ఆర్థికంగా భారతదేశంతో సన్నిహిత సంబంధాలు ఏర్పరచుకుని, ఒక సమాఖ్యవలె వ్యవహరించటానికి పాకిస్థాన్ వప్పుకుంటే అప్పు యివ్వవచ్చును.

* * *

భాషాప్రయుక్తరాష్ట్రాల విషయమై అధిరివేళ శాసనసభలో ప్రధాని పండిట్ నెహ్రూ ఒక ముఖ్యప్రకటన చేశారు. నూతనరాజ్యాంగ చట్టం అమలులోనికి వచ్చేటప్పటికి ఆంధ్ర రాష్ట్రం తప్పకుండా ఏర్పడుతుందని ఈయన హామీ యిచ్చాడు. ఇతర భాషాప్రయుక్త రాష్ట్రాలుకూడా ఆ సమయమునకుగాని, తర్వాత కొద్దికాలమునకుగాని ఏర్పడవచ్చును. నూతన రాజ్యాంగ చట్టములో, రాష్ట్రాల జాబితాలో ఆంధ్రరాష్ట్రం పేర్కొనబడుతుంది. ఆ రాజ్యాంగచట్టం ఆమోదింపబడిన వెంటనే ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటుచేయటానికి పూనుకుంటారు.



ఫెడరల్ కోర్టు నూతన న్యాయాధిపతి జస్టిస్ పతంజలి శాస్త్రి.

నూతన రాజ్యాంగ చట్టమును అంగీకరించుటకు రాజ్యాంగ పరిషత్తు జనవరి నెలలో సమావేశం కావచ్చును. ఆ సమావేశంలోనే సరిహద్దు నిర్ణయాక సంఘములు ఏర్పరుచబడును. ఆ సంఘము సరిహద్దులను నిర్ణయించగానే, ఆర్డర్-ఇన్-కౌన్సిల్ ద్వారా ప్రత్యేక రాష్ట్రము ఏర్పరుపబడి, ఆ రాష్ట్ర ప్రభుత్వ యాజమాన్యముననే నూతన రాజ్యాంగ చట్టం ప్రకారం ఎన్నికలు జరుపబడును. ఈ విధముగా జరిగినచో 4-5 నెలలలో ఆంధ్రరాష్ట్రము లభించును. సరిహద్దు నిర్ణాయక సంఘము తన కార్యక్రమమును ఎంత త్వరలో ముగించిన రాష్ట్రము అంత త్వరలో లభించును. అందువలన ఈ సంఘము తన కార్యక్రమము పూర్తిచేయుటకు ఒక గడువు ఏర్పరచవలసిందని మనము కోరవలెను. సరిహద్దుల విషయమై మన తరపు వాదమును మనము వెంటనే తయారు చేసుకొనవలెను. ఒరిస్సా నాయకులతో సంప్రదించి, అక్కడి సరిహద్దులను నిర్ణయించుకొనుటకు కొన్ని ప్రయత్నములు జరుగుచున్నట్లు తెలుస్తున్నది. బళ్ళారిలోను, సేలం, ఆర్కాటు జిల్లాలలోను మనకు రావలసిన తాలూకాల విషయమై ఇప్పుడు శ్రద్ధతో పనిచేయవలెను. నాయకులు ఆ ప్రాంతములలో పర్యటన చేసి, వివరములన్నీ సేకరిస్తూ ప్రజలలో ప్రబోధము చేయవలెను. మద్రాసు నగరము ఢిల్లీ పట్టణమువలె ప్రత్యేకముగా నుండునట్లుగాని, ఉభయ ప్రాంతములకు విభజింపబడునట్లుగాని ఏర్పాటు చేయటం మంచిది. ఇట్టి పరిస్థితులలో చైనా నగరం పూర్తిగా తమిళులకే చెందటానికి వీలు లేదను విషయమై మనము తీవ్రముగా ఆందోళన చేయవలెను. మద్రాసు, బొంబాయి నగరముల భవిష్యత్తు బహుశః ఒకే విధానము ప్రకారము నిర్ణయింపబడును. అందువలన ఈ రెండు పట్టణములను ప్రత్యేకముగానే వుంచివేయవలసిందని కేంద్ర ప్రభుత్వమునకు, సరిహద్దు నిర్ణాయకసంఘమునకు నచ్చజెప్పటానికి మనము గుజరాతీలసహాయము కూడా అపేక్షించవచ్చును. ఆంధ్రరాష్ట్రము లభిస్తున్నదని సంబరపడి లాభములేదు; మనము యిన్నాళ్ళుగా కలలుగంటున్న రాష్ట్రము లభించునట్లు ప్రయత్నముచేయుట అత్యవసరము.

ఆర్థిక పారిశ్రామిక వ్యాపార విషయాలు

పంచదార చెరుకుపంటకు ప్రభుత్వసహాయం

మన నిత్యజీవితంలో పంచదార, బెల్లం ఎంత ముఖ్యావసరములో మనకు తెలియును. కాని మనదేశానికి చాలినంత పంచదార, బెల్లం దేశంలో ఉత్పత్తి కాకపోవటంవలన కొన్ని సంవత్సరాల క్రితంవరకు పంచదార విదేశాలనుండి ఎక్కువగా దిగుమతి చేసుకోవలసివచ్చేది. తరువాత పంచదార పరిశ్రమకు ప్రభుత్వం 'రక్షణ' యివ్వటంతో, మనదేశంలోనే ఉత్పత్తి ఎక్కువైందిగాని మనకు కావలసినంతగా ఉత్పత్తి పెరగలేదు. అందువలననే యుద్ధం ప్రారంభమైనప్పటినుండి పంచదార, బెల్లం ధరను ప్రభుత్వం కంట్రోలు చేసింది. పంచదార ఉత్పత్తి ఎక్కువచేయటానికి చాల అవకాశాలున్నవిగాని, పంచదార చెరుకు పండించే పొలాలు చాలవరకు ఇతర ఆహారధాన్యాలు పండించటానికి ఉపయోగింపబడుతూ వుండటం వలన, పంచదార చెరుకు ఉత్పత్తి పెరిగితే ఆహారధాన్యాల ఉత్పత్తి తగ్గిపోతూవుంటుంది. అందువలన పంచదారచెరుకును అధికంగా ఉత్పత్తి చేయటానికి చేయవలసిందేమిటంటే, ప్రతి ఎకరం భూమిలోను ఇప్పటికన్న ఎక్కువ మొత్తం పంచదార చెరుకు పండేటట్లు చేయటం. ఈ విషయంలో రైతులకు తగిన ప్రోత్సాహమివ్వటానికి కేంద్రప్రభుత్వము, రాష్ట్రప్రభుత్వము కూడా పథకాలు వేసుకుని, కార్యక్రమం ప్రారంభించబోతున్నవి.

పంచదారపంట విషయమై ప్రభుత్వానికి సలహాయిస్తూ, ఆ పరిశ్రమకు తోడ్పడుతూ వుండటానికి ఒక ప్రత్యేక సంఘం ఏర్పాటు చేయబడినది. ఈ సంఘమును ఇండియన్ సెంట్రల్ షుగర్ కేన్ కమిటీ అంటారు. 1944-45 వ సం. లో భారత ప్రభుత్వం ఈసంఘానికి రూ. 75 లక్షలు విరాళమిచ్చి, ఆ మొత్తమును రాష్ట్రాలన్నిటికి పంచదారపంట అభివృద్ధికి ఉపయోగించబడేటందుకు పంచవలసిందని ఆదేశించింది. ఆ యా రాష్ట్రాలలో చెరుకు పండించబడుతున్న పొలం విస్తీర్ణాన్ని బట్టి ఈ మొత్తం అన్ని రాష్ట్రాలకు పంచారు. యు. పి. కి రూ. 30 లక్షలు; బీహారుకు రూ. 12 లక్షలు; బెంగాల్‌కు రూ. 9, 37, 500 లు; మద్రాసుకు రూ 5, 62, 500 లు యీ నిధిలోనుండి పంచిపెట్టబడినవి. ఈ విధంగా పంచిపెట్టబడిన మొత్తాలను వినియోగించవలసిన విధానముకూడా ప్రభుత్వం సూచించింది. ఈ మొత్తంలో ఎంతమాత్రముకూడా పరిశోధనలకు, రోడ్లకు వినియోగించరాదు. చెరుకు తోటలకు నీటిసాగుబడి సౌకర్యాలు అభివృద్ధిచేసి సరిగా కాపాడుకొనటానికి, సమంజసమైన ధరలకు, చెరుకుతోటలకు ఉపయుక్తంగావుండే ఎరువు సరఫరా చెయ్యటానికీ, చక్కని విత్తనాలు సంపాదించి వానిని అభివృద్ధిచేసి అవి ఎక్కువగా నాటబడేటట్లు రైతులలో ప్రచారం చెయ్యటానికి, పంచదార చెరుకు పండించటానికి కావలసిన పనిముట్లు ఆయా ప్రాంతాలకు తగినట్టివి, రైతుకు అందుబాటులోవుండే ధరలకు సరఫరా చేయటానికీ, చెరుకునాటబడి పెరుగుతూ వుండగా తెగులు, చీడ మొదలైన జాడ్యాలకు లోనై ఆ పంట చెడిపోకుండా కాపాడటానికీ, ప్యాక్టరీకి వెంట తిరుగుతూ పంటల విషయంలో జాగ్రత్తవహించే నిపుణులను ఏర్పాటు చేయటానికీ ఈ మొత్తం ఉపయోగించవలెనని కేంద్ర ప్రభుత్వం నిబంధనలు చేసింది. ఈ యీ విషయాలలో అయిన ఖర్చులో సగం మాత్రమే పైన చెప్పినట్లు ఆయా రాష్ట్రాలకు కేటాయించిన మొత్తంనుండి వాడుకొని మిగిలిన సగం మొత్తమును ఆ రాష్ట్ర ప్రభుత్వం భరించవలెను. ఈ విధమైన ఏర్పాట్లు ప్రకారం తమ తమ రాష్ట్రాలలో పంచదార చెరుకుపంటను అభివృద్ధిచేయటానికి అన్ని రాష్ట్రాలు పూనుకొని కొన్ని పథకాలు ఏర్పాటు చేసుకొన్నవి. అస్సాం, ఒరిస్సా, బీహారు, బొంబాయి, మద్రాసు, యు. పి. రాష్ట్రాలు ఏర్పాటు చేసుకున్న పథకాలను భారత ప్రభుత్వం ఆమోదించింది. ఈ రాష్ట్రాలలో అభివృద్ధి కార్యక్రమం ఈ సంవత్సరమే ప్రారంభమౌతుంది.

ఇందుకొరకు మన రాష్ట్రంలో ఏర్పాటు చేయబడిన పథకం ప్రకారం, చెరుకుపంట పండించే జిల్లాలలోనుంచి మొత్తం 24 తాలూకాలు ఏరుకుని, ఆ తాలూకాలలో చెరుకు పండిస్తున్న భూములకు చెరుకుపంటకు తగిన ఎరువులు సరఫరా చేసి, వ్యవసాయం విషయంలో రైతులకు సలహానిస్తూ వుండటానికి ప్రత్యేక ఏర్పాట్లు చేస్తారు. పంచదార మిల్లుల దగ్గర, ఒకొక్క మిలు దగ్గర, 20 ఎకరాల చొప్పున ఒక చెరుకు తోటను శాస్త్రీయంగా, అభివృద్ధికర మార్గాలలో ప్రభుత్వమే వేసి, చెరుకుపంటను ఏ విధముగా పండించాలో రైతులకు ప్రత్యక్షంగా చూపిస్తుంది. తమ తోటలకు, ప్రభుత్వం వేసిన తోటకు వున్న భేదాను చూసిన రైతు, తన తోటను కూడా ప్రభుత్వం అనుసరించిన మార్గాన్ననుసరించి వృద్ధి చేయడానికి ప్రయత్నిస్తాడు. తద్వారా పంట అధికమౌతుందని ప్రభుత్వం ఆశిస్తున్నది. ఈ కార్యక్రమం అమలుకి సంవత్సరానికి రూ. 11 లక్షలు ఖర్చవుతుందని అంచనా వేశారు. అందులో సగభాగం రాష్ట్రప్రభుత్వమే భరిస్తుంది.

కోయంబత్తూరులో వున్న చెరుకు విత్తనాల పరిశోధనకేంద్రం ప్రభుత్వంద్వారా సెంట్రల్ షుగర్ కేన్ కమిటీ వశపరచుకోవాలని కూడా ప్రయత్నిస్తున్నది.

సి. పి. లో పరిశ్రమల అభివృద్ధి

పరిశ్రమల అభివృద్ధికొరకు సి. పి. ప్రభుత్వం వహిస్తున్న ప్రత్యేక శ్రద్ధను, పరిశ్రమాభివృద్ధికి సి. పి. బడ్జెట్‌లో కేటాయించబడిన మొత్తమును గురించి ఈ పంక్తులలో ఇదివరకే మనవి చేశాను. కొన్ని రాష్ట్రాలవలె అంచనాలు, పథకాలు వేస్తూ సంతృప్తిపడివుండక, కార్యరంగంలోకూడా సి. పి. ప్రభుత్వం శ్లాఘనీయంగా పనిచేస్తున్నది. 1946 వ సం.లో పరిశ్రమాభివృద్ధికి సలహా యివ్వటానికి ఒక ప్రత్యేక సంఘం నియమించారు. ఆ సంఘం ఒక పంచవర్ష ప్రణాళిక ఏర్పాటుచేసినది. ఇప్పుడు పరిశ్రమాభివృద్ధి ఆ ప్రణాళిక ప్రకారమే జరుగుతున్నది.

సి. పి. రాష్ట్రంలో మొత్తం మూడు కాగితాల మిల్లులు స్థాపించనున్నారు; ఉన్న ఒక్క మిల్లునూ మూసివేసిన మద్రాసు రాష్ట్రం సి. పి. ప్రభుత్వ విధానాన్ని జాగ్రత్తగా గమనించటం అత్యవసరం. చాందా జిల్లాలో ఒక కాగితాల మిల్లు స్థాపింపబడుతుంది. ఈ మిల్లు బేడీ అండ్ కంపెనీ వారు నిర్వహిస్తారు. ఈ కంపెనీ మూలధనంలో రూ. 12½ లక్షలు ప్రభుత్వం కొని, కంపెనీకి ప్రోత్సాహమిస్తుంది. కాగితం పరిశ్రమకు ముఖ్యముగా కావలిసింది ముడిపదార్థము (వాసం, గడ్డి, పాతగుడ్డలు, పనికిరాని కాగితాలు మొదలైనవి), మంచినీళ్లు తగినంత మంది కార్మికులు. ఈ మిల్లుకు ముడిపదార్థముగా వెదురుబొంగులు ఉపయోగిస్తారు. ఈ వెదురు బల్లార్షా అడవినుండి కావలసినంతగా తెచ్చుకోవచ్చును. మిల్లునడపటానికి కావలసిన రాతిబొగ్గు వార్ధాలోయలో మిల్లుకు దగ్గరనే దొరుకుతుంది. కాగితాలను తయారు చేయుటానికి కావలసిన సున్నం రాయి కూడా చాందా జిల్లాలోనే దొరుకుతుంది. ఈ మూడు ముఖ్యమైన పదార్థాలు ఇంత అందుబాటులో వుండటం వలన కాగితంపరిశ్రమ ఇక్కడ చక్కగా అభివృద్ధి అవటానికి అవకాశంవున్నది. ఈ జిల్లాలోనే దాహక క్షారకము (కాస్టిక్ సోడా)ను తయారుచేయుటకు కూడా అవకాశమున్నట్లు తెలిసినది. ఆ పరిశ్రమను స్థాపించే విషయము, మరి ఏయే ఇతర పరిశ్రమలు ఈ జిల్లాలో స్థాపించవచ్చునన్న విషయము ఇప్పుడు ఆలోచింపబడుతున్నది. హోషంగాబాద్-బెతూల్ ప్రాంతంలో మరొక కాగితాలమిల్లును స్థాపించడానికి బిర్లా సోదరులకు అనుమతి ఇవ్వబడినది. ఈ కంపెనీకి ప్రభుత్వం ధన సహాయమేమీ చెయ్యదు. ఈ మిల్లుకు రాతిని బొగ్గు హింగాఘట్ వద్దనుంచి 100 మైళ్ళ దూరం రైలులో రావాలి. అది కొంచెం ఖరీదు, కష్టము కూడాను. అందువలన దగ్గరగావున్న పెంచ్ లోయలో బొగ్గు దొరుకుతుందేమోనని చూస్తున్నారు. ఈ మిల్లు తావానది గట్టుమీద కట్టనున్నారని తెలుస్తున్నది.

మరొక కాగితాలమిల్లు ఏ. యన్. నాయరు గారు నిర్మించనున్న న్యూస్ ప్రింట్ మిల్లు. ఇందులో తయారయ్యే కాగితం వార్తాపత్రికలకు పనికివస్తుంది. ఇటువంటిమిల్లు భారతదేశంలో స్థాపించటం ఇదే ప్రథమం. ఈ కంపెనీలో కూడా ప్రభుత్వం రూ 10 లక్షలకు మించకుండా మూలధనం వాటాలు పుచ్చుకుంటుంది.

అల్యూమినియం ఫ్యాక్టరీని స్థాపించటానికి హిందాల్కో కంపెనీకి అనుమతి యివ్వబడినది. ఈ కంపెనీలోకూడా 10 వ వంతు మూలధనం ప్రభుత్వం కొంటుంది. అల్యూమినియం పరిశ్రమ మంచిదే కాని, ఇప్పుడా వస్తువులు ఎక్కువ ఖరీదుగా వున్నాయి. ఉత్పత్తివిధానాలను అభివృద్ధి చేసి కార్మికులకు సుశిక్షణ యిచ్చి చక్కని వస్తువులు తయారుచేయించి సమంజసమైన ధరలకు అమ్ముతూవుంటే పరిశ్రమ మున్ముందుబాగా అభివృద్ధిలోనికి వస్తుంది. ఈ మిల్లు నడపటానికి విద్యుచ్ఛక్తి కేంద్రమొకటి ప్రత్యేకంగా స్థాపించబడనున్నది ప్రస్తుతం ఈ మిల్లు కంపెనీచే నిర్వహింపబడుతున్నా, కొన్నాళ్ళు పోయినతర్వాత ప్రభుత్వమే వశపరుచుకొని నిర్వహించవలెనని భావిస్తున్నది.


ఈ పరిశ్రమలుగాక, కంప్టీలో బొగ్గుగనులను అభివృద్ధి చేయుటానికీ యోత్‌మల్ నగరంలో ఒక సబ్బుల ఫ్యాక్టరీని కట్టడానికికూడా ప్రయత్నాలు జరుగుచున్నవి.

చేపల ఉత్పత్తి విషయమైకూడా సి. పి. ప్రభుత్వం ప్రత్యేకాసక్తి చూపుతున్నది. రామ్‌టెక్ వద్దనున్న కిండిసి తటాకంలో కొత్త రకపు చేపలను పెంచటం కొన్ని రకాల చేపల సంతతిని వృద్ధి చేయటం మొదలైన వాటిపై పరిశోధనలు ప్రారంభించనున్నారు. మొత్తం 15 లక్షల ఎకరాల ప్రాంతంలో చేపలను పెంచటానికి అధికారమిస్తూ ఒక శాసనం చేయబడుచున్నది. ఈ కార్యక్రమం పూర్తి అయేటప్పటికి సం.నకు 90 లక్షల మణుగుల చేపలు లభిస్తవి. పల్లెవాండ్ల జీవితమును సౌఖ్యవంతము చేసి చేపలవలని లాభము వారికే ముట్టేట్లు చేయటానికి కూడా ప్రభుత్వం ఆలోచిస్తున్నట్లు తెలుస్తున్నది.

నిజాంతో ఒడంబడిక

17 వ పేజీ తరువాయి

స్థానంలోపలా వెలుపలా ఉభయమత వర్గాలమధ్య ఉన్న సంబంధ బాంధవ్యాల మీద యీ ఒడంబడిక యొక్క హితప్రభావం ప్రసరించగలదనీ, నేను విశ్వసిస్తున్నాను. కాబట్టి ఈ సంఘటనలను గతానికి చెందినవని భావించి, సఖ్యసౌహార్దాలతో కూడుకున్న స్నేహపూరిత దినాల కోసం మన మికముందు నిరీక్షించవచ్చును. సంస్థానం విడిచిపెట్టిపోయిన వారందరూ స్వగృహాలకు తిరిగి రావడానికి అనుకూలమైన వాతావరణం ఈ విధంగా ఏర్పడాలి. పరస్పర సహాయ సహకారాల కోసం చేసుకున్న ఈ ఒడంబడిక అన్యోన్యతతో సఖ్యతగా అమలుజరుపబడుతుందనికూడా నాకు దృఢవిశ్వాసం ఉన్నది. మాటమాటకు మేము ఈ లక్ష్యాన్నే సర్వదాముందు పెట్టుకొని శాయశక్తులా తోడ్పడడానికి పాటుపడతాము. ప్రస్తుతం, రాజ్యాంగ సంస్కరణల విషయమైకూడా నైజాము శ్రద్ధగా ఆలోచనలు జరుపుతున్నాడని నేనీ సందర్భంలో పేర్కొనవచ్చును. రాజ్యాంగ సంస్కరణల విషయంలో అయితే నేమి, సంస్థాన ప్రవేశ విషయంలో అయితేనేమి, ఏవిషయంలో నైనప్పటికీ సంస్థానాధిపతులు ప్రజాభీష్టాన్నే ధ్రువతారగా పెట్టుకోదగియున్నదని, నైజాం ఇప్పటికైనా నిస్సంకోచంగా అంగీకరించగలడని ఆశిస్తున్నాను. ఈ సూత్రం అప్పుడే అనేక సంస్థానాలలో సఫలీకృతం అయినట్లు, విస్పష్టమైన తార్కాణాలు కానవస్తున్నవి. సంస్థానాధిపతులందరిలోనూ విశిష్టస్థానం ఆక్రమించుకొనిఉన్న నైజాము ఈ విషయములో ఆదర్శప్రాయంగా వ్యవహరించి, ఇతరులందరికీ మేలుబంతి కాగలడని ఆశిస్తున్నాను.



భారత అధినివేశ ప్రభుత్వం హైదరాబాద్ సంస్థానాల యథాతథపు ఒడంబడికను సాధించిన నిజాం ప్రతినిధివర్గం సభ్యులు అబ్దుల్ రహీమ్ పింగళి వెంకట్రామారెడ్డి, నవాబ్ మొయిన్ నవాజ్ జంగ్.

నారాయణభట్టు

(19-వ పేజీ తరువాయి)

ఆ మాటలనుచుండగా వజ్జియ పగ్గర వారి యొద్దకు వచ్చి, "దొంగపను లేమిటి, కవులకు!" అని చిరునవ్వుతో ప్రశ్నించెను.

నారాయణభట్టు నవ్వుచు, "వజ్జియమంత్రీశ్వరా, నన్నీ నన్నయ 'దొంగపను లెప్పటినుండి నేర్చుకొంటి'వని యడుగుచున్నాడు. మంత్రిపదవి స్వీకరించినప్పటినుండి యని చెప్పబోవుచుండగా మీరు దయచేసినారు. ఏమి చెప్పుదున!" అనెను.

ఎన్నడును చిరునవ్వైనంత నెరుగని నవ్వని వజ్జియ యీ మాటలకు కడుపార నవ్వెను. కవులందరు నవ్విరి.

"కవులైనవారికి మంత్రిత్వము శాశ్వతముగా శోభించనట్లున్నదే!" అని వజ్జియ పలుకనప్పటికి కవులందరు నారాయణభట్టును జూచి నవ్విరి.

ఇంతలో నారాయణభట్టును వజ్జియ మందిరమునకు తీసికొనిపోవుటకు పల్లకి వచ్చెను.

"కవులు కవులను చూచినప్పుడు ఒడలిమీది గాయములబాధకూడ తెలియనట్టి మైమరపు కలుగును కాబోలును!" అని మరియొకమారు వజ్జియ పరిహాసమాడెను. కవులందరు నందుకు సమ్మతించిరి. వజ్జియ కానాడు మనస్సెంతయు నుల్లాసముగా నుండెను.

కవులకడ నారాయణభట్టు సెలవు దీసికొని చీదమార్యాది పండితులకు నమస్కరించి, వచ్చిన యాపల్లకి యెక్కుచు నన్నయనుగూడ నందెక్కుమని పిలిచెను.

ముందు వజ్జియ పల్లకియు నావెనుక నన్నయ నారాయణు లున్న పల్లకియు రాజమహేంద్రపురవీధుల రాజసభాంగణమునుండి వజ్జియ మందిరమునకేగెను.

నన్నయయు నారాయణుడును పల్లకిలో వచ్చుచు దారిలో కొన్ని విషయములలో ప్రసంగించిరి. వారిద్దరి ముఖములలో పరస్పర సాన్నిధ్యము నూతన తేజముద్యోతి మయ్యెను. దీర్ఘకాలవియోగానంతరమున నా బాల్యమిత్రులు మరల కలసికొని పొందిన యానందమునకు మేరలేదు.

వారిద్దరు నొక్క పల్లకిలో బోవుచుండ నందులో వారు నరనారాయణులవలెను, రెండు దీపశిఖలవలెను వెలుగుచు గానవచ్చిరి. పురాణవిదులకు వీరు పురాణములందలి నరనారాయణులనియు, మహాభారత వేత్తలకు వీరు కృష్ణార్జునులనియు అనిపించిరి.

యజ్ఞము చేసికొనుటకు వజ్జియ యనుమతింపనందున రాజరాజనరేంద్రునికా విషయము మనవి చేసికొనుటకు సోమయాజులకు రాజదర్శనము కాలేదు. ఈనాడు విన్నవించుకొనుటకు వారు మరల రాజసభకు వచ్చిరి. కాని చెప్పుకొనుటకవకాశము మరల చిక్కలేదు. వారు మరల నాలోచించుకొని "ఆనాటి ఉదయమున వజ్జియ పనితొందరలో నట్లు మాటాడి యుండును ఇప్పుడు చెప్పుకొందము" అని యాలోచించి వజ్జియ మందిరమువొద్దకు వచ్చివేచి యుండిరి. కాని వజ్జియ వారిని చూచినంతనే భటులచే దర్శనమునకు వీలులేదని చెప్పించి పంపివేసెను.

౨౮


వేపల్లె

కృష్ణవేణీనది సముద్రపరిష్వంగమునకు బహుబాహువులు చాచినది. అందొక బాహువు దక్షిణముఖముగా నున్నది.

ఆ బాహువు పశ్చిమ తీరమునకు సమీపభూమిలో కొందరు ప్రజలు నివసించుచుండిరి. కలిదిండికొద్ద ఇప్పటికై దేండ్ల క్రిందట గొప్ప యుద్ధము జరిగినది.

గంగైకొండ మధురాంతక రాజేంద్ర చోడ భూపాలుడు రాజరాజనరేంద్రుని మేనమామయు మామయునై యుండెను. అతని మహాసేనపతి రాజరాజ బ్రహ్మమహారాజు కీర్తి దిగంత విశ్రాంతము. రాజరాజు మాతులునిగా ఆదేశము ననుసరించి రాజరాజబ్రహ్మ దండనాథుడును, ఉత్తమశోడచోడగోనును, ఉత్తమచోడమిలాడుడయ్యాను అను మువ్వురు చోళసేనానులు మూడగ్నులవలె మహాసైన్యముతో నాంధ్రదేశము వచ్చి గృధ్రవార (గుడివాడ) విషయములోని కలిదిండికొద్ద కర్ణాటక సైన్యములతో తలపడిరి. ద్రవిళసైన్యములకును, కర్ణాటకసైన్యములకును పరస్పర ప్రతిఘటన భీకరమగు మహారణమయ్యెను. అందు ముష్టిముష్టి, కేశాకేశి, దండాదండి, కుంతాకుంతి, పరస్పరము ఆయోధనము జరిగెను. ధానుష్కుల బాణపాతములచే నుభయసైన్యముల పలువురు భటులు వీరస్వర్గము నొందిరి. ఆ యుద్ధము కాలవశమున సమయుద్ధమయ్యెను. అటు కర్ణాటక దండనాథులును ఇటు ద్రవిళదండనాథులు రణభూమిని ప్రాణములు వదలిరి. అచ్చట అనతికాలమున రాజరాజనరేంద్రుడు ద్రవిళదండనాథుల పేర శివాయతనములు నిలిపి మధురాంతక నల్లూరు గ్రామము ప్రతిష్ఠించెను.

కర్ణాటకసైన్యము చెల్లాచెదరయ్యెను. ఆ సైన్యమువెంట వచ్చిన ప్రజలు చెదరిపోక మిగిలియున్న గోధనమును కృష్ణవేణీ నదిదాటించి



పాపికొండ ఆవద్ద గోదావరి

(ఛా. చి. మాజేటి సత్యనారాయణ)

తృణజలసమృద్ధిగల తావుల సంచరించుచు తుదకు ఒకచోట చిట్టడవి బాగుచేసికొని కుటీరములు నిర్మించుకొనిరి. అది వేపల్లె యయ్యెను.

సోమిదేవిని కుపమను పిశాచవేషములతో నెత్తుకొనిపోయిన దొంగలు దొంగలమర్రికి రమారమి మూడు క్రోశముల దూరమునగల వేపల్లె కా రాత్రియే బహువేగమునవచ్చి యందొకయింట దాచిరి. అప్పటికే స్మృతి వచ్చిన వారికి త్రావుటకు చక్కని గోక్షీర మిచ్చిరి.

వారినట్లు చేర్చినది పసువులశాలలోనికి. మరుసటి దినము ఉదయమునుండియు వారికి వంటకమునకు మృణ్మయ పాత్రలను ఆహార పదార్థములను ఇచ్చిరి. ఆ పల్లెలోని స్త్రీ పురుషులెవ్వరు వారితో నేమియు మాటాడరు. కాని రాత్రింబవళ్లును ఎక్కడికి బోకుండ కందరు కాపుగానుండిరి. ఆ పల్లెనుండి వారు తప్పించుకొన యత్నించుచున్నట్లు వారికి దోచినప్పుడు కఠినముగా ప్రవర్తించుచుండిరి. కాని ఇతర సమయములలో వారి కెట్టి యొత్తిడియు లేకుండెను.

తమ్ము నెందులకా వేపల్లెకు వారు తెచ్చిరో తెలిసికొనుటకెంత ప్రయత్నించినను సోమిదేవికి సాధ్యపడలేదు. ధనాశకల చోరులుగా వీరు కనిపించలేదు. వారి కున్న స్వల్పాభరణములు ముట్టుకొనలేదు. వెనుక వచ్చుచుండిన వారి వస్తుసామగ్రిని హరించినట్లు తోచదు. ఇంత దూరమున కాని దేశమున తమకు శత్రువులుందురా?—ఏ వనదేవతకైనను తమ్ము బలి యీయవలెనని వీరి యుద్దేశమా?

ఆ యూహ కనుగుణముగా నా పల్లెలో నప్పుడు జాతర యొకటి సాగుచుండెను. పల్లెకు కొంచెము దూరముగా దక్షిణమున నొక 'పురము' నిర్మించిరి. ఆ 'పురము' పటకుటీరము ననుసరించును. దానిపై శిఖరమువలె నొక యుత్తడి కుంభముకలదు. ఆ 'పురమున' స్త్రీ లుందురు. వేపల్లెలోని ప్రజలందరు నచట కొలువుకు చేరుచుండిరి.

కొలువు కచ్చట నొక ఘటముపెట్టి దానిని వేపల్లెచుట్టును ముఖరములగు బహువాద్యములతో నూరేగించుచుండిరి. ఈ ఊరేగింపు పగలు మూడు వేళలను అర్ధరాత్రమున నొకసారియు జరుగుచుండెను.

ఒక రాత్రి మహిషబలి యిచ్చుట చూచిన దాది సోమిదేవికి భయ మెక్కువయ్యెను. ఈ పల్లెకు వచ్చువారితరులెవరు గనిపించలేదు. మారుమూల పల్లెగా కనిపించెను. అదియు చిట్టడవి మధ్యమునందున్నందున నటువచ్చు నితర మనుష్యుల జాడయే లేదు. అర్ధరాత్రముల మారముల నొక్కొక్కసారి సముద్రఘోషవలె శబ్దము వినబడుచుండెను. ఆ సముద్రఘోష చుట్టుప్రక్కల నున్న తాటితోపులలో దూరి యందుండి ప్రసరించుచు మరింత ఉద్వేగము కలిగించుచుండెను.

ఇట్లుండగా నొకనాడు దూరమున సోమిదేవిచే బహుమతినొందిన గంగిగోవులవాడు కనిపించెను. సోమిదేవి ప్రాణములు లేచివచ్చెను. ఆమె యతని బిలువగారాలేదు అంతట నామెయే గంపెడాశతో నతనికొద్దకుబోయి పలుకరించెను.

కాని యతడామె నెన్నడు జూడనివానివలె ప్రత్యుత్తరమిచ్చెను. తానె పొరబడితినని సోమిదేవి యనుమానించెను. కాని కుపమయు నచట చేరి "మాట్లాడవేమి! మా పట్టుశాలు ఇంతలో మరచిపోయినావా?" అని అడిగినది. దానికిని అతడు మాటాడక తీవ్రముగా చూచుచు నావలకు బోయెను.

సోమిదేవికి దిగులు హెచ్చెను. ధనదు ప్రోలులో నుదయమున నీతడు కనపడి, సాయంత్రము భట్టప్రోలులో మరల నెదురైనాడు కదా. ఆ పిమ్మట రెండుమూడు గడియలకే యీ దొంగ లెత్తుకొని వచ్చిరి. వీడుపలుకరించిన మాటాడడు. వీరి యుద్దేశము బాగుగా లేదు. 'కుపమ'ను తలచుకొని యామెకు కడుపులో కలికినట్లు బాధ కలుగసాగెను. ఈ యాపదల నుండి గట్టెక్కుట యెప్పుడు! ఇంత తొందరపడి సార్థముతో ప్రయాణ మెందుకు చేసితిని!

ఆమె యిట్లు దిగులుపడుచున్నను కుపమ కేమియు తెలియనీకుండెను. కుపమ చురుకైన పిల్ల. సంస్కృత శ్లోకములు, తెలుగు పద్యములు, కన్నడ పద్యములు శ్రావ్యముగా చదువును. కంఠము శ్రావ్యమైనది. మధురముగా పాటలు పాడగలదు. ఆ ప్రజలు కర్ణాటకము ఆంధ్రము సగము సగము కలసిన భాషలో మాటాడుచు నట్టి పాటలనే పాడుకొనుచుండిరి. అట్టి పాట నొక్కసారి విన్నంతనే వారి యాసతో గ్రహించి వారియెదుట తన మధుర కంఠముతో కుపమ తిరిగి యవి పాడుచుండెను. నిష్కపటముగా ప్రతివారిని బలుకరించెను. ఈ విధముగా నామె గోప స్త్రీల యాదరము సంపాదించెను.

అంతలో దుగ్గవ్వ యను నలుబదియేండ్ల గోపిక యొకతె కుపమను విశేషముగా ప్రేమింప సాగెను. దుగ్గవ్వకు అదే యీడుగల కుమార్తె ఒక్క సంవత్సరము క్రిందట జనిపోయె నట. మరి దానికి పిల్లలులేరు. కుపమను చూచినప్పటినుండియు దానికి పోయిన కూతురు జ్ఞప్తి వచ్చును. వచ్చి, 'ఈ విధముగా పిలుచునది,— ఈ విధముగా నడుచునది,— ఈ విధముగా మాట్లాడునది—'యని చెప్పును. దుగ్గవ్వ తన కూతురు చేష్టలు చెప్పినవిధము అనుకరించుచు కుపమ దుగ్గవ్వను పిలువసాగినది; పలుకరింపసాగినది. ఆ మాటలు విని దుగ్గవ్వ బావురు మని యొక్కొక్కమారేడ్చును.


ఈ విధముగా దినములు గడచిపోవుచుండెను. క్రొత్త మనుష్యు లెవరును కనుపింపరు. ఇది అరణ్యమా? ద్వీపమా? మరియొక లోకమా?


వేపల్లెలో జాతర యైపోయినది. వెంటనే తమ ప్రాణములు తీయుదురను భయముపోయినది. సంవత్సరమునుండి దక్షిణదేశ మంతయు తిరిగి తిరిగి వచ్చిన పిమ్మట నిక్కడి జీవనము శాంతముగా నుండెను. భోజనాద్యవసరములకు లోపములేదు. ఆవుపాలు, పెరుగు, నెయ్యి కొదువలేదు. మరొక ప్రపంచమున నున్నట్లు సుఖముగనే యున్నది.

మోటుపల్లికి రావలసియుండిన పొన్నపైనాడు? సార్థములో తమతో వచ్చుచు గదా ప్రహారములకు పడిపోయిన పరిచారకు లేమైరి? వెంట వచ్చుచున్న కంచర మేమైనది. శ్రీ నారాయణ భట్టారకు లెందున్నారు? క్షేమముగా నున్నారా? మే మిచ్చటనున్నట్లు వారికి తెలియునట్లు? మా కిచ్చటనుండి మోక్ష మెన్నటికైన నున్నదా? మోక్షోపాయ మేమి?—పేము చిరకాలమునుండి యుపాసించిన దుర్గాదేవి కటాక్ష మెప్పుడు ప్రసరించును!

"దుర్గే, స్మృతాహరసి భీతి మశేషజంతోః!"

వార్తా విశేషాలు






రత ప్రధానమంత్రి పండితజవహర్లాల్ నెహ్రూ ఇటీవల శ్రీనగర్ వెళ్ళినప్పుడు కాశ్మీరు జాతీయమహాసభ రక్షకదళం సైనికవిన్యాసం. జరుపుతున్న దృశ్యం.




ఇటీవలనే సేనానిగా నియమితుడైన లెఫ్టనెంటుజనరల్ కరియప్పగారు విమాన దళాధిపతి యస్ ముఖర్జీ గారు గవర్నరుజనరల్ రాజగోపాలాచారి గారితో ముచ్చటిస్తున్న దృశ్యం.



తెలంగాణా నాయకులు శ్రీ బద్దం ఎల్లారెడ్డి శ్రీమతి స్వరాజ్యం గార్లు 9-11-47 తేద రాజమహేంద్రవరము విచ్చేసిన సందర్భమున ఉత్సవములో తీయబడిన ఛాయా చిత్రా



నాగడ్ తాత్కాలిక ప్రభుత్వ మంత్రివర్గంవారికి బొంబాయి పౌరులు సన్మానమిచ్చారు చిత్రంలో శ్యామలదాస్ గాంధీ తక్కిన నల్గురు మంత్రులూ ఉన్నారు.



కాశ్మీర్‌లో పేరుదెచ్చుకొన్న భారతీయ సైన్యాలను నెహ్రూ అభినందిస్తున్నదృ

Regd No M. 4479

Edited, Printed & Published by S. Sambhu Prasad at the Andhra Patrika Press, No. 7, Thambu Chetty St., G. T. Madras.
Q H. No. Copies.—10,000